www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 282
ANDHRAJYOTHI

శనివారం | 27-1-2024 | పేజీలు: 12 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథివిదియ తె. 3.38 తదుపరి తదియ; నక్షత్రం: ఆశ్లేష మ. 1.02 తదుపరి మఖ; వర్జ్యం: రా. 2.28-4.15; దుర్ముహూర్తం: ఉ. 6.53-8.22; అమృతఘడియలు: ఉ. 11.15-1.02; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.04 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





బెజవాడలో గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

# గణతంత్ర వేడుకల్లో నారీ శక్తి

దేశ చరిత్రలో తొలిసారి త్రివిధ దళాలకు చెందిన పూర్తిస్థాయి మహిళా కంటింజెంట్ మార్చ్‌పాస్ట్



ఢిల్లీ కర్తవ్య పథ్‌లో సశస్త్ర సీమాబల్ మహిళా జవాన్ల కవాతు. మోటారు సైకిళ్లపై విన్యాసాలు

రాకెట్ వ్యవస్థల ప్రదర్శన.. బైక్ విన్యాసాలతో సత్తా

మహిళా శక్తిని చాటేలా.. వివిధ రాష్ట్రాల శకటాలు

'వందేభారతం–నారీశక్తి' పేరిట నృత్య ప్రదర్శనలతో సంస్కృతిని చాటిన 1500 మంది డాన్సర్లు

ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

నలభై ఏళ్ల తర్వాత ఈ వేడుకల్లో మళ్లీ గుర్రపు బగ్గీ

న్యూఢిల్లీ, జనవరి 26: రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగిన 75వ గణతంత్ర దినోత్సవాల్లో నారీ శక్తి సత్తా చాటింది. 'ఆకాశంలోనే కాదు.. సైన్యంలోనూ సగం' అన్న చందంగా ఇటీవలికాలంలో సైన్యంలో పెరుగుతున్న మహిళా శక్తిని చాటేలా.. త్రివిధ దళాలకు చెందిన మహిళా కంటింజెంట్ చరిత్రలో తొలిసారి ఈ వేడుకల్లో మార్చ్‌పాస్ట్ చేసింది. ఆర్మీ మిలటరీ పోలీసుకు చెందిన కెప్టెన్ సంధ్య మహ్లా నేతృత్వంలో.. సబ్ లెఫ్టినెంట్ అను యాదవ్ (నౌకా దళం), ఫ్లైట్ లెఫ్టినెంట్ సృష్టి వర్మ (వైమానిక దళం), కెప్టెన్ శరణ్యరావ్, త్రివిధ దళాలకూ చెందిన అగ్నివీర్‌లతో కూడిన పూర్తిస్థాయి మహిళా సేన ఈ పరేడ్ నిర్వహించగా.. త్రివిధ దళాలకు

మిగతా 2వ పేజీలో...

జగనన్న నుంచి ఏదీ ఆశించలేదు..

# కాదని అమ్మతో చెప్పించగలరా?



తాడేపల్లికి వెళ్లింది రెండుసార్లే!

జగనన్నను ఏదీ కోరలేదు

నా బిడ్డలపై ప్రమాణం చేస్తా మరి మీరు చేయగలరా?

అవును.. నేను షర్మిలా రెడ్డినే

పులి కడుపున పులే పుడుతుంది

నా కుమారుడికి రాజారెడ్డి అని నా తండ్రే పేరు పెట్టారు: షర్మిల

## భారీ విగ్రహాలతో పేదల ఆకలి తీరదు!

'అంబేడ్కర్ రాజ్యాంగాన్ని' కాలరాస్తున్నారు

దళితులపై దాడులు పెరిగాయ్

దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కనే పెట్టుకుంటున్నారు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు స్వాహా

బీజేపీకి కట్టు బానిసలా వైసీపీ

జగన్ సర్కారుపై విరుచుకుపడ్డ షర్మిల

సభలు, సమావేశాల్లో అంబేడ్కర్ గురించి గొప్పగా చెప్పడం కాదు.. ఆయన ఆశయాలను ఉన్నతంగా అమలు చేయాలి.

ప్రత్యేక హోదా తీసుకురాలేని.. పోలవరం నిర్మించలేని.. రాజధాని కట్టలేని పార్టీలకు మద్దతివ్వరాదని ప్రజలు తమకు తాము ఈ రిపబ్లిక్ డే సందర్భంగా తీర్మానం చేసుకోవాలి.

- షర్మిల

అమరావతి/విజయవాడ/గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'జగన్ నుంచి ఏమీ ఆశించకుండానే పాదయాత్ర చేశారా?' అంటూ వైసీపీ శిబిరం చేస్తున్న ప్రచారంపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఘాటుగా స్పందించారు. ఆస్తి కోసం, పదవి కోసం జగన్‌ను తాను బ్లాక్‌మెయిల్ చేస్తున్నానని వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపైనా ఆమె తీవ్రంగా స్పందించారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల జాతీయ జెండాను ఎగురవేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పార్టీ కార్యకర్తల భేటీలో ప్రసంగించారు. తనపై జగన్ శిబిరం చేస్తున్న వ్యాఖ్యలపై ఒకింత ఆవేశం, ఆవేదనతో స్పందించారు. "నేను ఏదో ఆశించి పాదయాత్ర చేయలేదు. వాళ్లంతట వాళ్లు అడిగితేనే కుటుంబాన్ని వదిలి రాష్ట్రమంతా నడిచా. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తాడేపల్లికి కేవలం రెండుసార్లు వెళ్లా.. ఒకసారి అమ్మతో కలిసి ప్రైవేటు కార్యక్రమానికి.. ఇటీవల కుమారుడి పెళ్లి కార్డు ఇచ్చేందుకు! నా భర్తతో కలిసి ఒక్కసారీ తాడేపల్లికి వెళ్లలేదు. జగన్‌ను ఏదీ అడిగిందీ లేదు. నా బిడ్డలపై ప్రమాణం

మిగతా 11వ పేజీలో...

## అడొస్తే చెల్లెలైనా.. అంతే!

### షర్మిలపైనా వైసీపీ సోషల్ మీడియాలో దాడి

నీచమైన వ్యాఖ్యలు, వీడియోలతో వ్యక్తిత్వ హననం

ఇప్పటిదాకా విపక్ష నేతలు, మద్దతుదారులే టార్గెట్

మహిళలైతే మరింత దారుణమైన వ్యాఖ్యలు

పీసీసీ చీఫ్ హోదాలో జగన్ పాలనపై షర్మిల ప్రశ్నలు

బదులివ్వలేని నిస్సహాయత, అక్కసు, ఆక్రోశం

సోషల్ మీడియాలో షర్మిలపై నీచమైన వ్యాఖ్యలు

11 జగన్ వీరాభిమానుల వీడియోలు, పోస్టింగ్‌లు

'నా అక్క చెల్లెమ్మలు' అని ప్రతి సభలోనూ ఊదరగొట్టే వైఎస్ జగన్ సొంత చెల్లి షర్మిలపై ఆయన సొంత పార్టీ సోషల్ మీడియా టీమ్, అభిమానులే నీచమైన పోస్టింగ్‌లు, రాతలతో విరుచుకుపడుతున్నారు. షర్మిల సంధిస్తున్న ప్రశ్నలకు జవాబులు ఇవ్వలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు.

# పొత్తుతోనే ముందుకు!



ఒంటరిగా వెళ్తే సీట్లు వచ్చినా.. ప్రభుత్వం రాదు: పవన్

రాజోలు, రాజానగరం స్థానాలు మనకే

2024లో జగన్ సర్కారు కనబడకూడదు

గతంలో విడిపోయి పలుచపడ్డాం 11

కలిసి పనిచేసి జనసేన-టీడీపీ సర్కారును సాధిద్దాం

పొత్తులో ఆటుపోట్లు తప్పవు.. జనసేనాని స్పష్టీకరణ



బాబు సమక్షంలో టీడీపీలో చేరిన వీరశివారెడ్డి, కొలికపూడి

## పవన్ ప్రకటనను స్వాగతిస్తున్నాం

జనసేన పోటీ చేసే సీట్లనే ప్రకటించారు

వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోంది

టీడీపీ, జనసేన శ్రేణులు నమ్మొద్దు: టీడీపీ 11

టీడీపీలోకి వీరశివారెడ్డి, కొలికపూడి



## కలిసి మురిసిన పద్మవిభూషణులు

ప్రతిష్ఠాత్మక పురస్కారం నేపథ్యంలో వెంకయ్య, చిరంజీవి భేటీ

విద్యార్థి నేతగా వెంకయ్య పిలుపిస్తే తరగతులు బహిష్కరించాం

ఎంపీగా అనేక అంశాలపై అడిగి తెలుసుకునేవాడిని: మెగాస్టార్

తెలుగు సినీ పరిశ్రమకు మూడో కన్ను చిరంజీవి: వెంకయ్య 12

## నితీశ్ అడుగులు ఎటు?



బీజేపీతో కలిసి రేపు కొత్త ప్రభుత్వం?

బిహార్‌లో జోరందుకున్న ఊహాగానాలు

రాజ్‌భవన్ కార్యక్రమానికి తేజస్వీ గైర్హాజరు 2

ఊహాగానాలపై స్పష్టతనివ్వాలని ఆర్జేడీ విజ్ఞప్తి

ఇండియాలోనే కొనసాగుతున్నాం: జేడీయూ

సొంతంగా సర్కారు ఏర్పాటుపై లాలూ కసరత్తు!



## బెరైటీస్‌ను బొక్కేశారు

మంగంపేటలో తవ్వే కొద్దీ అక్రమాలు

ఏపీఎండీసీలో కుమ్ముడే కుమ్ముడు

నిర్వాసితుల పరిహారంలోనూ దోపిడీ

బినామీల పేర్లతో అక్రమాలు

ముగ్గురు అధికారుల వల్ల ప్రభుత్వ ఖజానాకు 26 కోట్లు గండి

ఈడీ, సీపీఓపై క్రిమినల్ కేసులు పెట్టాలని విజిలెన్స్ సూచన

అరెస్ట్ చేసి చర్యలకు సిఫారసు

విజిలెన్స్ నివేదికలన్నీ బుట్టదాఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి కడప జిల్లా మంగంపేట బెరైటీస్ గనుల్లో తవ్వే కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. ఎంత దోచుకున్నా ఏమీ కాదన్న ధీమాతో గనుల శాఖలో గజదొంగలు రెచ్చిపోతున్నారు. కంచే చేను మేసిన చందంగా బెరైటీస్‌ను కొల్లగొడుతున్నారు. పట్టా భూములు ఇచ్చిన నిర్వాసితులకు పరిహారం కింద కేటాయించాల్సిన బెరైటీస్‌లోనూ అక్రమాలకు పాల్పడినట్టు వెలుగులోకి వచ్చింది. అధికారులు, కాంట్రాక్టర్లు బినామీలను సృష్టించి టన్నుల కొద్దీ తవ్వేశారు. ముగ్గురు అధికారుల కారణంగా 26 కోట్ల విలువైన

మిగతా 12వ పేజీలో...

# దేవుడినైనా వేలం!

## ఆలయ భూములు ఆయనకు పల్లీలే

మంత్రిగా ఉన్నన్నాళ్లూ గుడుల ఆస్తులపైనే కన్నంతా

సొంత ఆలయానికి రూ.కోటికిపైగా దేవదాయ నిధుల మళ్లింపు

కరోనా సాయంగా అందిన బెడ్లు, దుప్పట్లూ అమ్ముకున్న కక్కుర్తి

ఆలయాలు ప్రైవేటుకు.. కొత్త సంస్కృతికి ఆద్యుడు

ఆపై వాటి కింద ఉన్న ఖరీదైన భూముల కైవసం

ఓఎస్‌డీ మామను ముందుపెట్టి భారీగా భూదందా

ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.8 కోట్ల స్థలం స్వాహా

తీసేసిన మంత్రి దందా అంతా ఇంతా కాదు!




భూములను కొట్టేసేవారిని చూశాం. ఆస్తులను వేలంలో కారుచౌకగా దక్కించుకునేవారిని చూసి ఉంటాం. కానీ, దేవుడు కొలువైన ఆలయాలను సైతం ధారాదత్తం చేయడం ఆయన హయాంలోనే అందరూ చూశారు. పలు ఆలయాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేశారు. ఆయన నివాసానికి దగ్గరలో ఉన్న శ్రీసత్యభామ రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానాన్ని ఓ కుల సంఘానికి ఇచ్చేశారు. ఈ దేవస్థానం కింద ఉన్న రూ. కోట్ల విలువైన ఆస్తులను కొట్టేయడానికే ఎమ్మెల్యే ఈ ఎత్తు వేసినట్టు అప్పట్లో కథనాలు వెలువడ్డాయి.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఆయన 'తీసేసిన మంత్రి'! కానీ... మంత్రిగా ఉండగా తన శాఖను ఉద్ధరించిన సంగతి పక్కనపెడితే, ఆ శాఖను సొంతానికి వాడుకోవడంపైనే దృష్టి పెట్టారని ఆయనపై ఆరోపణలు! ఇతర అంశాల్లోనూ వేలు పెట్టడం... పల్లీల్లా సొమ్ములు నమిలేయడం ఆయన స్పెషాలిటీ. పాఠశాలల్లో

మిగతా 3వ పేజీలో...

కరోనా కాలంలోనూ ఆ నేత తన కక్కుర్తి బుద్ధిని వదులుకోలేదు. కొవిడ్ రోగుల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన మంచాలు, బెడ్లు కొట్టేసి అమ్ముకున్నారు.. ప్రైవేటు ఆస్పత్రులు, మందుల దుకాణాల వారిని మంత్రి అనుచరుడు సమావేశపరిచాడు. తాము సరఫరా చేసే పీసీడీ మందులనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. మాట వినకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ పీసీడీ మందుల దందా ద్వారా కరోనా కాలంలో మంత్రి, ఆయన అనుచరులు సుమారు రూ.50 కోట్ల మేర ఆర్జించారు.



'జ్ఞానవాపి' స్థలాన్ని హిందువులకు

## అప్పగించండి

గిరిరాజ్ సింగ్, హిందూ మహాసభ డిమాండ్

ఆలయాన్ని కూల్చి మసీదు నిర్మాణం 2

అక్కడ దేవతల విగ్రహాలు.. తెలుగులో శాసనాలు

ఏఎస్ఐ నివేదిక పేర్కొందని న్యాయవాది జైన్ వెల్లడి

మసీదు కమిటీ సందేహాలు.. భద్రత కట్టుదిట్టం

## బిహార్ విద్యార్థులు.. ఏపీలో ఓట్లు!

వైసీపీ అభ్యర్థి నడిపే కాలేజీలో ఇతర రాష్ట్రాల నర్సింగ్ విద్యార్థులు

వారికి ఎలాంటి ఆధారమూ లేకున్నా ఇక్కడ ఓటర్లుగా నమోదు 12

ఎమ్మెల్యే అనగాని లేఖ రాసినా స్పందించని ఎన్నికల అధికారులు



# ఆకట్టుకున్న ఇస్రో శకటం

» చంద్రయాన్, ఆదిత్య ఎల్-1 ప్రాముఖ్యం తెలిసేలా తయారీ

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన శకటాలు ఆకట్టుకున్నాయి. మూడేళ్ల తర్వాత తొలిసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలంగాణ శకటానికి చోటు దక్కింది. జయజయ హే తెలంగాణ పేరిట రూపొందించిన ఈ శకటాన్ని కొమరం భీమ్, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ తదితర పోరాటయోధుల స్ఫూర్తి ప్రపంచానికి తెలియజేసేలా తీర్చిదిద్దారు. ఇక, విద్యా వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను వివరించేలా రూపొందించిన శకటాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రదర్శించింది. అయోధ్య రామమందిరంలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠను తెలియజెప్పేలా రూపొందించిన శకటాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రదర్శించింది. ఇక, చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 అంతరిక్ష నౌకల నమూనాలతో ఆయా ప్రయోగాల ప్రాముఖ్యత వివరించేలా ఇస్రో ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఫ్రాన్స్ సైనిక విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఫ్రెంచ్ వాయుసేనకు చెందిన రెండు రఫేల్ ఫైటర్ జెట్లు, ఫీనెక్స్ అనే మరో ఎయిర్ క్రాఫ్ట్ ఢిల్లీ గగనతలంలో దూసుకెళ్లాయి. ఫ్రెంచ్ సైన్యం భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఇది రెండో సారి. రిపబ్లిక్ డే పరేడ్ ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ కర్తవ్యపథ్‌లో కాలినడకన తిరిగారు. గ్యాలరీల వద్దకు వెళ్లి చెయ్యి ఊపుతూ సందర్శకులకు అభివాదం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌ను 13వేల మంది ప్రత్యేక అతిథులు ప్రత్యక్షంగా వీక్షించారు. కర్తవ్యపథ్‌లో 'అనంత్ సూత్ర' పేరిట ఏర్పాటు చేసిన 1,900 చీరల ప్రదర్శన ఆకట్టుకుంది.

# మోదీ నాయకత్వం భేష్



న్యూఢిల్లీ, జనవరి 26 : ప్రధాన మోదీపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోసారి ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానం నేటి ప్రపంచంలో కష్ట సాధ్యమైనది అన్నారు. భారత్ సాధిస్తున్న ఆర్థికాభివృద్ధి, ప్రగతి ప్రధాని మోదీ నాయకత్వం వల్లనే సాధ్యమయ్యాయని ప్రశంసించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధి, ప్రగతి సాధిస్తున్న దేశం భారత్ అని పేర్కొన్నారు. కేవలం ప్రధాని మోదీ నాయకత్వం వల్లనే ఈ దశకు చేరగలిగిందని చెప్పారు. కాలిన్‌గ్రాడ్ ప్రాంతంలోని ఓ యూనివర్శిటీ విద్యార్థులతో మాట్లాడుతూ ఈమేరకు వివరించారు. మాస్కో... న్యూఢిల్లీ, భారత నాయకత్వంపై ఆధారపడవచ్చని స్పష్టం చేశారు. ఎందుకంటే భారత్ అంతర్జాతీయంగా రష్యాకు వ్యతిరేకంగా వ్యవహరించదన్నారు. 150 కోట్ల జనాభా గల భారత్‌కు స్వతంత్ర విదేశాంగ విధానం హక్కని వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఈ హక్కును గుర్తించారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో అభివృద్ధిలో భారత్ ఎంతో ముందంజ వేసిందని, భారత్ "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలతో పాటు రష్యా కూడా గుర్తించిందని చెప్పారు. భారత్‌లో అతిపెద్ద విదేశీ పెట్టుబడి రష్యా నుంచే ఉన్నట్లు వివరిస్తూ... రష్యాకు చెందిన రోజ్‌నెఫ్ట్ కంపెనీ ఒక ఆయిల్ రిఫైనరీ, గ్యాస్ స్టేషన్లు, ఓడరేవు తదితర వాటిలో 23 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టిందని వెల్లడించారు. రష్యాలో భారత సినిమాలకున్న ఆదరణను ప్రస్తావిస్తూ.. భారతీయ సినిమాలను జాతీయ టీవీ ఛానల్‌లో ప్రసారం చేసే అతి కొద్ది దేశాల్లో రష్యా ఒకటని పుతిన్ అన్నారు.

## గణతంత్ర వేడుకల్లో
# నారీ శక్తి







(మొదటి పేజీ తరువాయి)

సుప్రీం కమాండర్‌గా తొలి మహిళా రాష్ట్రపతి అయిన ద్రౌపది ముర్ము వారి గౌరవ వందనాన్ని స్వీకరించడం అసలు హైలైట్. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతదేశం నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి ఫ్రాన్స్ దేశ అధ్యక్షుడు పాల్గొనడం ఇది ఆరోసారి. మరే దేశాధినేతా ఇన్నిసార్లు గణతంత్ర దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కాలేదు. 'వికసిత్ భారత్', 'భారత్ లోక్‌తంత్ర్ కీ మాతృక' అనే థీమ్‌లతో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా తొలుత 112 మంది మహిళలతో కూడిన బృందం శంఖ నాదం చేస్తూ, నాదస్వరాలు, నగారాలు, తదితర సంప్రదాయ వాయిద్యాలను మోగిస్తూ ముందుకు సాగింది. కంటి శస్త్రచికిత్స నిపుణురాలు, పారాట్రూపర్ అయిన మేజర్ సృష్టి ఖుల్లా నేతృత్వంలోని పూర్తిస్థాయి మహిళా సాయుధ దళాల వైద్య సేవల కవాతు దళం వారి వెంట నడిచింది. లెఫ్టినెంట్ దీప్తి రాణా, లెఫ్టినెంట్ ప్రియాంక స్వేద.. మన సైన్యం ఉపయోగించే 'స్వాతి వెపన్ లొకేటింగ్ రేడార్', 'పినాక రాకెట్ సిస్టమ్'లను ప్రదర్శించారు. ఆర్టిలరీ రెజిమెంట్‌లో మొట్టమొదటిసారిగా గత ఏడాది నియమితులైన 10 మంది మహిళా అధికారుల్లో వీరు కూడా ఉన్నారు. అలాగే.. 149 మంది పురుషులతో కూడిన బాంబే శాపర్స్ దళం రెండు దశాబ్దాల తర్వాత ఈ వేడుకల్లో పాల్గొంది. ఆ దళానికి మేజర్ దివ్య త్యాగి అనే మహిళా అధికారి నేతృత్వం వహించడం విశేషం. ఇంకా.. అడిషనల్ డీసీపీ (ఢిల్లీ నార్త్ డిస్ట్రిక్ట్), ఐపీఎస్ అధికారి శ్వేత కె.సుగతన్ నేతృత్వంలో 194 మంది మహిళా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లతో కూడిన ఢిల్లీ పోలీసు దళం ఈ పరేడ్‌లో పాల్గొంది. ఆ 194లో దాదాపు 80 శాతం మంది ఈశాన్య రాష్ట్రాలకు చెందిన మహిళా పోలీసులే కావడం మరో విశేషం. 144 మంది పురుష, మహిళా అగ్నివీర్‌లతో కూడిన నౌకా దళ సేనకు కమాండర్‌గా లెఫ్టినెంట్ ప్రజ్వల్ నేతృత్వం వహించగా.. లెఫ్టినెంట్ ముదిత గోయల్, లెఫ్టినెంట్ శ్రావణి సుప్రియ, లెఫ్టినెంట్ దేవిక ప్లటూన్ కమాండర్లుగా వ్యవహరించారు. ఫ్రాన్స్‌కు చెందిన సైనిక బృందం కూడా కర్తవ్యపథ్‌లో పరేడ్ నిర్వహించగా.. ఆబృందంలో ఆరుగురు భారతీయులు ఉన్నారు.

### నౌకాదళ శకటమూ..

ఈసారి నౌకాదళ శకటం థీమ్‌లో నారీ శక్తి కూడా ఒక భాగంగా ఉంది. శకటంలో తొలి భాగాన్ని.. భారత నౌకాదళంలో అన్ని ర్యాంకుల్లో, అన్ని కొలువుల్లో మహిళలు ఎలా సత్తా చాటుతున్నారో తెలిపేలా, రెండో భాగాన్ని ఆత్మనిర్భరత థీమ్‌తో రూపొందించారు. ఇక.. 144 మంది ఎయిర్‌మెన్, నలుగురు అధికారులతో కూడిన వాయు సేన దళాన్ని స్క్వాడ్రన్ లీడర్ రష్మీ ఠాకూర్ ముందుండి నడిపించారు. స్క్వాడ్రన్ లీడర్స్ సుమిత యాదవ్, ప్రతీతి ఆహ్లూవాలియా, ఫ్లైట్ లెఫ్టినెంట్ కీర్తి రోహిల్ సూపర్ న్యూమరరీ అధికారులుగా దళ కమాండర్ వెనుక నడిచారు. అలాగే.. భారత తీర రక్షక దళ (ఐసీజీ) సేనకు అసిస్టెంట్ కమాండెంట్ చునౌతి శర్మ నాయకత్వం వహించారు. ఆమె వెనుక గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్లు ప్రియ దహియా, హార్దిక్, పల్లవి నడిచారు. బీఎస్ఎఫ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ మోనికా లక్రా, సీఐఎస్ఎఫ్ దళానికి తన్మయీ మొహంతీ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ మేఘ నాయర్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ మోనియా శర్మ, సహస్త్ర సీమా బల్ దళానికి డిప్యూటీ కమాండెంట్ నాన్సీ సింగ్లా నేతృత్వం వహించారు. సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఒంటెల కంటింజెంట్‌కు కమాండెంట్ మనోహర్ సింగ్ నాయకత్వం వహించగా.. అందంగా అలంకరించిన ఒంటెలను మహిళా అధికారులు స్వారీ చేస్తూ పరేడ్‌లో పాల్గొన్నారు. అలాగే, ఎన్‌సీసీలోని పలు దళాల్లో మహిళలు గణనీయంగా కనిపించారు. 200 మంది మహిళా వలంటీర్లతో కూడిన నేషనల్ సర్వీస్ స్కీమ్ కంటింజెంట్‌కు సిక్కిమ్‌కు చెందిన రగీనా తమాంగ్ నాయకత్వం వహించారు. 148 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో కూడిన పూర్తిస్థాయి బాలికల దళానికి ఉత్తర్‌ప్రదేశ్ డైరెక్టరేట్‌కు చెందిన సీనియర్ అండర్ ఆఫీసర్ తను తేవటియా నేతృత్వం వహించారు.



గుర్రపు బగ్గీ నుంచి దిగుతున్న ముర్ము, మేక్రాన్

### రక్షణలో సగం..

ఆత్మనిర్భరతను ప్రతిబింబించేలా రూపొందించిన డీఆర్‌డీవో శకటానికి గైడెడ్ క్షిపణుల నిపుణురాలైన శాస్త్రవేత్త సునీతా జెనా నాయకత్వం వహించారు. యాంటి శాటిలైట్ క్షిపణుల నుంచి మూడో తరం యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్ల దాకా డీఆర్‌డీవోలో మహిళల భాగస్వామ్యాన్ని ఈ శకటంలో కళ్లకు కట్టారు. వివిధ రాష్ట్రాలకు చెందిన శకటాలను సైతం మహిళా శక్తిని చాటేలా రూపొందించడం ఈసారి విశేషం. అలాగే.. 265 మంది మహిళలు మోటార్‌సైకిళ్లపై విన్యాసాలు చేశారు. సబ్-ఇన్‌స్పెక్టర్ శ్వేతా సింగ్ నేతృత్వంలో బీఎస్ఎఫ్ మహిళా బ్రాస్ బ్యాండ్ పరేడ్‌లో పాల్గొనగా.. వందే భారతం-నారీశక్తి బ్యానర్ కింద 1500 మంది నృత్యకళాకారులు కూచిపూడి, కథక్, భరతనాట్యం సహా 30 రకాల నృత్యాలను ప్రదర్శించారు. కాగా.. దాదాపు 40 ఏళ్ల తర్వాత గణతంత్ర వేడుకల్లో గుర్రపు బగ్గీ కనిపించడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో కలిసి గుర్రపు బగ్గీలో కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు.

## లోకం తీరు






## ఫ్రాన్స్‌తో మరింత
# రక్షణ బంధం

న్యూఢిల్లీ, జనవరి 26: ఇండియా, ఫ్రాన్స్ దేశాల మధ్య రక్షణ బంధం మరింత పటిష్ఠమవుతోంది. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. గురువారం జైపూర్‌లో ఆయన పర్యటన మొదలైంది. ఇదేరోజు రాత్రి జైపూర్‌లో ప్రధాని మోదీ, మేక్రాన్‌ల మధ్య కీలకమైన చర్చలు జరిగాయి. వీటికి సంబంధించిన వివరాలను శుక్రవారం విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా మీడియాకు వెల్లడించారు. హెచ్125 చాపర్ల ఉత్పత్తికి సంబంధించి టాటాలు, ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ఆయన చెప్పారు. రోబోటిక్స్, అటానమస్ వాహనాలు, సైబర్ రక్షణ వంటి రంగాల్లో సహకారానికి ఇండియా-ఫ్రాన్స్ రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్ దోహదపడుతుందని చెప్పారు. అలాగే ఉపగ్రహాల ప్రయోగానికి సంబంధించిన సహకారం కోసం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, ఫ్రాన్స్‌కు చెందిన ఏరియాన్ స్పేస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంపైనా చర్చ జరిగిందన్నారు. కాగా, మేక్రాన్ గౌరవార్థం రాష్ట్రపతి ముర్ము రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం విందు ఏర్పాటు చేశారు.

# నైట్రోజన్ గ్యాస్‌తో మరణ శిక్ష!

» అమెరికాలో తొలిసారి అమలు

ఎట్మోర్, జనవరి 26: అమెరికాలో ఓ ఖైదీకి నైట్రోజన్ గ్యాస్ వాడి మరణ శిక్షను అమలు చేశారు. ఇలా మరణశిక్ష అమలు చేయడం ఇదే తొలిసారి. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ మత బోధకుడి భార్యను చంపిన కేసులో కెన్నెత్ స్మిత్ (58)కు ఫేస్ మాస్క్ అమర్చి స్వచ్ఛమైన నైట్రోజన్‌ను వదలడంతో దాన్ని పీల్చి మరణించినట్లు గురువారం అలబామా జైలు అధికారులు ప్రకటించారు. 7 నిమిషాల్లో మరణశిక్ష అమలైనట్లు తెలిపారు. స్మిత్ మరణాన్ని అలబామా గవర్నర్ కే ఐవీ ధ్రువీకరించారు. వ్యవస్థలో లోపాలను అడ్డుపెట్టుకొని 30ఏళ్లపాటు స్మిత్ తప్పించుకున్నాడని.. చివరకు బాధ్యత వహించక తప్పలేదన్నారు. ప్రయోగాత్మక మరణ శిక్ష పద్ధతులకు తనను పావుగా వాడుకుంటున్నారని స్మిత్ అక్కడి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. అలబామాకు చెందిన పాస్టర్ చార్లెస్ సెన్నెట్ భారీగా అప్పులు చేశాడు. తన భార్య చనిపోతే ఆమె పేరిట ఉన్న బీమా సొమ్ము వస్తుందని భావించాడు. గ్రే విలియమ్స్‌ను కలిసి తన భార్యను చంపేందుకు సెన్నెట్ ఒప్పందం చేసుకున్నాడు. విలియమ్స్ కొంత సుపారీ ఇచ్చి తన స్నేహితులైన కెన్నెత్ స్మిత్, జాన్ ఫ్రాస్ట్ పార్కర్‌లకు పని అప్పగించాడు. వారు 1988 మార్చిలో సెన్నెట్ భార్యను కత్తితో దాడి చేసి చంపారు. ఈ ఘటన తర్వాత సెన్నెట్‌ను అనుమానించి అధికారులు విచారించారు. దొరికిపోతానేమోనని భావించిన సెన్నెట్ ఆత్మహత్య చేసుకున్నాడు. కేసులోని గ్రేవిలియమ్స్‌కు జీవిత ఖైదు విధించగా జైల్లోనే మరణించాడు. జాన్ ఫ్రాస్ట్‌కు 2010లో మరణశిక్షను అమలు చేశారు. మరో నిందితుడు స్మిత్ తనకు హత్యలో ఏ ప్రమేయం లేదంటూ న్యాయపోరాటానికి దిగాడు. సాక్ష్యాధారాలన్నీ పక్కాగా ఉండటంతో దోషిగా తేలాడు. 2022లోనే విషపూరిత ఇంజెక్షన్‌ను ఇచ్చి స్మిత్‌కు మరణశిక్ష అమలు చేయాలని కోర్టు తీర్పునిచ్చింది. అయితే ఆ ఇంజెక్షన్ తయారీలో జాప్యం జరిగింది. డెత్ వారెంట్ కూడా ముగిసింది. మరేదైనా విధానంలో మరణశిక్షను అమలు చేయాలని న్యాయమూర్తి ఆదేశించగా చివరకు నైట్రోజన్‌గ్యాస్‌తో మరణ శిక్షను అమలుచేశారు. ఇలా మరణశిక్ష అమలు చేయడంపై యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం విచారం వ్యక్తం చేశాయి.

# బీజేపీతో మళ్లీ నితీశ్ జట్టు?

## రేపు సీఎంగా ప్రమాణం?.. డిప్యూటీ సీఎంగా సుశీల్ మోదీ.. బిహార్‌లో ఊహాగానాలు

» ఇదంతా దుష్ప్రచారం.. ఇండియా కూటమి లోనే కొనసాగుతున్నాం: జేడీయూ



పట్నా, లఖ్‌నవూ, జనవరి 26: ఆర్జేడీతో పొత్తును వదిలిపెట్టి బీజేపీతో మళ్లీ చేతులు కలిపి నితీశ్‌కుమార్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని, ఆదివారం సీఎంగా ప్రమాణం చేస్తారని బిహార్‌లో జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనికి తగినట్లుగానే గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం నితీశ్ హాజరైనప్పటికీ, ఆర్జేడీ నేత, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఆ పార్టీకే చెందిన అసెంబ్లీ స్పీకర్ అవధ్ బిహారీ చౌదరి, ఇతర నేతలు గైర్హాజరయ్యారు. దీనిపై సీఎంను విలేకర్లు ప్రశ్నించగా.. హాజరుకాని వారినే అడగండి అని ముక్తసరిగా బదులిచ్చారు. అయితే రాజ్‌భవన్ కార్యక్రమానికి ఆర్జేడీ తరపున ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి అలోక్ కుమార్ మెహతా హాజరయ్యారు. కాగా, నితీశ్ తిరిగి బీజేపీతో చేతులు కలుపుతారా అన్న విలేకర్ల ప్రశ్నపై బీజేపీ సీనియర్ నేత సుశీల్‌కుమార్ మోదీ స్పందిస్తూ.. 'రాజకీయాల్లో శాశ్వతంగా తలుపులు మూసుకుపోవటం అంటూ ఉండదు. సమయం వచ్చినప్పుడు తలుపులు తెర్చుకుంటాయి. తలుపులు తెరవాలా?వద్దా? అన్నది మా పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుంది' అని చెప్పారు. నితీశ్ బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే సుశీల్‌కుమార్ మోదీ ఉప ముఖ్యమంత్రి పదవిని చేపడతారని వార్తలు వెలువడ్డాయి. అయితే పలువురు బీజేపీ నేతలు నితీశ్‌తో తిరిగి చేతులు కలపటంపై విముఖతను వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రజానీకంలో నితీశ్ ప్రతిష్ఠ గణనీయంగా పడిపోయిందని, ఆయనతో పొత్తు కుదుర్చుకుంటే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నష్టపోతుందని, ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ కూటమి స్వీప్ చేస్తుందని ఓ బీజేపీ నేత పేర్కొన్నారు. గురువారం పార్టీ కీలక నేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఢిల్లీలో కలిసి తిరిగి బిహార్‌కు వచ్చిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి స్పందిస్తూ.. 'ఢిల్లీలో చర్చలు లోక్‌సభ ఎన్నికల గురించే జరిగాయి. అమిత్ షా, నడ్డా.. (నితీశ్‌కు) తలుపులు మూసుకుపోయాయని గతంలో ప్రకటించారు. పార్టీ కార్యకర్తగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా. నితీశ్ దుస్తులను మార్చినట్లుగా స్నేహితులను మార్చే రాజకీయ నాయకుడు' అని విమర్శించారు.

### బిహార్‌లో ఎవరికి ఎన్ని?

243 సీట్ల బిహార్ అసెంబ్లీలో కనీస మెజారిటీకి 122మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ఆర్జేడీకి 79, బీజేపీకి 78, జేడీయూకి 45, కాంగ్రెస్‌కు 19, వామపక్షాలకు 16, హెచ్ఏఎం(ఎస్)కు నలుగురు ఎమ్మెల్యేలు, ఎంఐఎంకు ఒక్కరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు ఆర్జేడీతో కలిసి ఉన్నాయి. ఈ 3 పార్టీల బలం 114. అంటే మెజారిటీకి మరో 8 మంది ఎమ్మెల్యేలు అవసరం. జేడీయూ-బీజేపీ చేతులు కలిపితే 123మందితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతాయి.

### నితీశ్ స్వయంగా స్పష్టతనివ్వాలి: ఆర్జేడీ

ఎన్‌డీఏలో తిరిగి చేరతారని జరుగుతున్న ప్రచారంపై సీఎం నితీశ్ స్పష్టతివ్వాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝా విజ్ఞప్తి చేశారు. 'బీజేపీని ఓడించి మనం చేతులు కలిపి ప్రభుతాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుత గందరగోళం ప్రజాజీవితాన్ని ప్రభావితం చేస్తోంది. సీఎం స్వయంగా శుక్రవారం సాయంత్రం వరకు ఒక ప్రకటన చేయాలి' అన్నారు. కాగా, నితీశ్ తమకు మొండిచేయి చూపితే ఏం చేయాలనేదానిపై ఆర్జేడీ కసరత్తు జరుపుతోంది. లాలూ నివాసంలో ఈ మేరకు తీవ్ర చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. 'కొన్నేళ్ల కిందటిలాగా నితీశ్ మళ్లీ మాకు నష్టం చేయకుండా అవసరమైన ప్రణాళికలు మావద్ద ఉన్నాయి. ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ పార్టీల కూటమికి మెజారిటీకి అవసరమైన దానికన్నా 20సీట్లు తక్కువ ఉన్నాయి. అయితే, స్పీకర్ మా పార్టీకి చెందిన వ్యక్తే కాబట్టి, మేం సంఖ్యాబలాన్ని కూడగట్టుకోగలం' అని ఓ ఆర్జేడీ నేత అన్నారు. కాగా ఎన్‌డీఏలోకి తిరిగి వెళ్తామంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఇదంతా కొందరు కావాలని చేస్తున్న దుష్ప్రచారమని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుశ్వాహ స్పష్టం చేశారు. తాను సీఎంను గురు, శుక్రవారాల్లో కలిశానని, వదంతులన్నీ అబద్ధాలేనని, పార్టీ ఎమ్మెల్యేలను పట్నాకుపిలిపించామన్నదీ వాస్తవం కాదన్నారు.

### ఈ పాపం కాంగ్రెస్‌దే: అఖిలేశ్

నితీశ్‌కుమార్ తిరిగి బీజేపీ చెంతకు చేరతారన్న వార్తలపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ.. ఈ పరిణామాలకు కాంగ్రెసే కారణమని మండిపడ్డారు. నితీశ్ 'ఇండియా' కూటమిలో కొనసాగితే ప్రధాని పదవి చేపట్టే అవకాశం ఉందని, విపక్షాలను ఒకేతాటిపైకి తెచ్చేందుకు చొరవ చూపింది నితీశేనని గుర్తుచేశారు. ఆయన ఇబ్బందులేంటో కాంగ్రెస్ పార్టీ గుర్తించి చర్చించి ఉంటే పరిష్కారం లభించేదన్నారు.



ఉమాదేవిని సత్కరిస్తున్న కెనరాబ్యాంకు ఎండీ, సీఈవో సత్యనారాయణ రాజు

# యువ రెజ్లర్ ఉమాదేవికి కెనరా బ్యాంక్ సన్మానం

» 20 వేల నగదు అందజేత.. వచ్చే ఐదేళ్లు అండగా ఉంటామని ప్రకటన

బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): యువ రెజ్లర్ దేవరకొండ ఉమాదేవిని కెనరా బ్యాంకు ఘనంగా సన్మానించింది. రష్యాలో ఇటీవల జరిగిన రెజ్లింగ్ పోటీల్లో ఉమాదేవి దేశానికి రజత పతకం అందించారు. బెంగళూరులోని కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉమాదేవికి బ్యాంకు ఎండీ, సీఈవో కే సత్యనారాయణరాజు రూ.20వేల నగదు, వెండిపళ్లెం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు స్పందించి ఉమాదేవి రష్యా వెళ్లేందుకు స్పాన్సర్‌షిప్ చేశామని గుర్తుచేశారు. వచ్చే ఐదేళ్ల పాటు ఆమెకు అన్ని విధాలా ప్రోత్సాహం అందజేస్తామని ప్రకటించారు. సత్యసాయి జిల్లా భద్రపల్లి మండలం తంగాల గ్రామానికి చెందిన ఉమాదేవి.. రష్యాలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ రెజ్లింగ్ పోటీల్లో 49 కిలోల జూనియర్ విభాగానికి ఎంపికైంది. పేదరికంతో ఆమె రష్యా వెళ్లలేని పరిస్థితిలో ఉందనే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది.

# ఐఆర్ఆర్ కేసులో బాబుకు బెయిల్‌పై సుప్రీంకు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్‌మెంట్ కేసులో మాజీ సీఎంకు ఏపీ హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. ఇది ఈ నెల 29న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానుంది.

# గల్ఫ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు


(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గణతంత్ర వేడుకలను గల్ఫ్ దేశాల్లోని భారతీయులు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో రాయబారులు జెండా ఎగురవేశారు. యూఏఈలోని భారత రాయబారి సంజయ్ సుధీర్ అబుదాబిలోని భారత ఎంబసీలో పతాకావిష్కరణ చేశారు. వచ్చేనెల 13న ప్రధాని మోదీ యూఏఈ వస్తున్న సందర్భంగా జరిగే 'అహ్లాన్ మోదీ' కార్యక్రమానికి రావాల్సిందిగా ప్రవాస భారతీయులను కోరారు. దుబాయిలో శుక్రవారం భారత కాన్సుల్ జనరల్ పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ స్వాగత కార్యక్రమానికి రావాల్సిందిగా కోరారు.

# 'జ్ఞానవాపి' స్థలాన్ని హిందువులకు అప్పగించండి

## గిరిరాజ్ సింగ్, హిందూ మహాసభ డిమాండ్.. జ్ఞానవాపి వద్ద భద్రత కట్టుదిట్టం

న్యూఢిల్లీ, జనవరి 26: ఉత్తరప్రదేశ్‌లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలో గతంలో పెద్ద హిందూ దేవాలయం ఉండేదని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) నివేదిక వెల్లడించిన నేపథ్యంలో.. ముస్లింలు ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, హిందూ మహాసభ అధ్యక్షుడు స్వామి చక్రపాణి మహరాజ్ డిమాండ్ చేశారు. 'జ్ఞానవాపిలో ఆలయం ఉన్నట్టు అన్ని ఆధారాలూ బయటపడ్డాయి. ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించాలని ముస్లిం సోదరులను కోరుతున్నా' అని గిరిరాజ్ సింగ్ అన్నారు. ప్రస్తుత నిర్మాణానికి ముందు హిందూ దేవాలయం ఉండేదని ఏఎస్ఐ నివేదిక స్పష్టం చేస్తున్నందున ఆ స్థలంపై హక్కులను తిరిగి హిందువులకు అప్పగించి ఆదర్శంగా నిలవాలని హిందూ మహాసభ అధ్యక్షుడు స్వామి చక్రపాణి మహరాజ్ ముస్లిం వర్గానికి విజ్ఞప్తి చేశారు. తాజా పరిణామాలతో వివాదాస్పద జ్ఞానవాపి మసీదు వద్ద అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.



ఏఎస్ఐ సర్వేలో బయటపడినట్లుగా ఇండియా టుడే వార్తా సంస్థ బయటపెట్టిన చిత్రాలు

# మరికొందరు అభ్యర్థుల మార్పు?

» జగన్ కసరత్తు.. ఎంపికలో తీవ్ర గందరగోళం
» కొత్త ఇన్‌చార్జులపై నిరసనల వెల్లువ
» ఎమ్మిగనూరుకు బుట్టా రేణుక పేరు పరిశీలన
» కర్నూలులో జయరాం స్థానంలో మేయర్ రామయ్య
» నరసరావుపేటకు అనిల్‌కుమార్‌తోపాటు ఎంపీ బీద మస్తాన్‌రావు పేరూ పరిశీలన

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ .. లోక్‌సభ స్థానాల అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గందరగోళంగా వ్యవహరిస్తున్నారని వైసీపీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. సర్వేల పేరిట ఏకపక్షంగా కొందరు ఎమ్మెల్యేలను తొలగించిన జగన్.. తీరా పలువురు సిటింగ్‌లు ఎదురుతిరగడం.. టీడీపీ, జనసేనల్లో చేరడం.. కొందరు ఆయన చెల్లెలు షర్మిల వెంట నడిచేందుకు సిద్ధమవడం.. తదితర పరిణామాల నేపథ్యంలో ఆయన కాస్త వెనక్కి తగ్గారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెన్నకేశవరెడ్డిని కాదని వెంకటేశ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన సీఎం.. ఇప్పుడక్కడ మాజీ ఎంపీ బుట్టా రేణుక పేరు పరిశీలిస్తున్నారు. ఎమ్మిగనూరు అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డిని కాదని.. వెంకటేశ్‌ను ప్రకటించారు. అ యితే ఈయన విజయంపై నమ్మకం కుదరక.. మాజీ ఎంపీ బుట్టా రేణుక పేరును జగన్ పరిశీలించినట్లు సమాచారం.

### జయరాం అవుట్!

మంత్రి గుమ్మనూరు జయరాంను ఈసారి కర్నూలు లోక్‌సభకు పంపాలని సీఎం నిర్ణయించారు. ఈ మేరకు కర్నూ లు లోక్‌సభ ఇన్‌చార్జిగా ఆయన పేరు ప్రకటించారు. అయి తే.. తాను శాసనసభకే పోటీ చేస్తానని జయరాం తేల్చిచెప్పా రు. ఇటీవల సీఎం జగన్ పర్యటనకూ గైర్హాజరయ్యారు. దీంతో ఆయనకు టికెట్ ఇవ్వకూడదన్న నిర్ణయానికి వచ్చా రు. వెంటనే.. కర్నూలు మేయర్ బీవై రామయ్యను కర్నూలు ఎంపీగా బరిలోకి దింపాలన్న నిర్ణయానికి జగన్ వచ్చారు. అదేవిధంగా నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించాలని నిర్ణయించారు. కానీ ఆయన అభ్యర్థిత్వాన్ని నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వ్యతిరేకిస్తున్నారని వైసీపీలో చర్చ జరుగుతోం ది. ఇప్పుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసరావుపేట ఎంపీగా బరిలోకి దింపాలని జగన్ యోచిస్తున్నారు. అయితే అందుకాయన సుముఖంగా లేకపోవడంతో రాజ్యసభ సభ్యు డు బీద మస్తాన్‌రావు పేరు కూడా పరిశీలిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ పేరు దాదాపు ఖరారు చేశారు. కానీ ఆ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ స్థానాల ఇన్‌చార్జులంతా ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని.. దీంతో అనిల్‌కుమార్, మస్తాన్‌రావు పేర్లను పరిశీలిస్తున్నారని సమాచారం.



ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్, వేదికపై అంబికా కృష్ణ, నూతన కార్యవర్గ సభ్యులు

# ఆర్యవైశ్యులకు అన్యాయం జరిగితే ఖబడ్దార్

- వచ్చే ఎన్నికల్లో ఐదు నుంచి పది టికెట్లు ఇవ్వాలి
- ఆర్యవైశ్య మహాసభలో మాజీ మంత్రి టీజీ వెంకటేశ్

గుంటూరు, జనవరి 26: 'ఆర్యవైశ్యులకు అన్యాయం జరిగితే ఖబడ్దార్! నేనున్నా.. ఎవరికి ఏ ఇబ్బందులు వచ్చినా అందరూ అండగా ఉండాలి' అని మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యమహాసభ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం గుంటూరులో జరిగింది. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీలైనా ఐదు నుంచి 10 స్థానాలు ఆర్యవైశ్యులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 'వైసీపీ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.. వెయ్యి కోట్ల సంగతి సరే.. కనీసం ఇప్పటికైనా విఎంచిపోయింది లేదు రూ.100 కోట్లు డిపాజిట్ చేయాల'ని కోరారు. గుంటూరు పశ్చిమ నుంచి ఎమ్మెల్యే మద్దాళి గిరికి వైసీపీ టికెట్ నిరాకరించం తనకు బాధనిపించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. సంఘం పూర్వాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత జీవీఎస్ఎల్ కాంతారావు, మద్దాలి గిరి, పోతుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం

సభలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహాసభ గౌరవ చైర్మన్‌గా మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మహాసభ అధ్యక్షుడిగా చిన్ని రామసత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరివీధి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా శేగు షణ్ముఖరావు ప్రమాణం చేశారు. కోశాధికారిగా నుదురుమాటి శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజర్‌గా కోట గురుబ్రహ్మం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా దూపకుంట్ల శబరివరప్రసాద్, పొలిటికల్ చైర్మన్‌గా కోట సత్యం, అడ్వైజర్‌గా పోతుల సురేష్ ప్రమాణస్వీకారం చేశారు.

# వైసీపీ అభ్యర్థులకు దొంగ డబ్బే ఆధారం

- చిత్తూరులో స్మగ్లర్ తీసుకెళ్లిన ఆ 50 కోట్లు ఎవరివి?
- పోలీసులు తేల్చాలని అమరనాథ్‌రెడ్డి డిమాండ్

చిత్తూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యర్థులకు ఎర్రచందనం, ఇసుక, మద్యం అక్రమ రవాణా ద్వారా లభించే దొంగ డబ్బే ఆధారమని మాజీ మంత్రి, టీడీపీ నేత అమరనాథ్‌రెడ్డి ఆరోపించారు. 'కోట్ల సొమ్ముతో పరార్' అంటూ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆయన చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి చెందిన అయ్యప్ప వెంచర్‌లో బుధవారం ఎర్రచందనం స్మగ్లర్లు సమావేశమై రూ.కోట్ల సొమ్ము పంచుకోవడంలో గొడవ పడ్డారని అన్నారు. అక్కడి నుంచి ఓ స్మగ్లర్ రూ.50 కోట్లతో పరారవ్వగా, జిల్లాకు చెందిన అధికార పార్టీ నేత రంగంలోకి దిగారని.. స్మగ్లర్‌ను, రూ.50 కోట్లను పట్టుకునే బాధ్యతను పోలీసులకు అప్పగించారని ఆయన ఆరోపించారు. జిల్లా పోలీసులు ఈ వ్యవహారాన్ని మూడో కంటికి తెలియకుండా డీల్ చేస్తున్నారన్నారు. ఆ రూ.50 కోట్ల సొమ్ము ఎవరిదో వెంటనే తేల్చాలని అమర్ డిమాండ్ చేశారు.

# ఏపీ నాన్ గజిటెడ్ సంఘంలోకి గజిటెడ్ ఆఫీసర్స్

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పేరును ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ అధికారుల సంఘంగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏపీ నాన్ గజిటెడ్ అధికారుల సంఘంగా ఉండేది. ఆ సంఘం స్టేట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించుకుని పేరు మార్పుపై తీర్మానించింది. సంఘం బైలాను కూడా మార్చారు. ఈ మార్పులను స్టేట్ కౌన్సిల్ ఆమోదించి ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం పరిశీలించి మార్పులకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ గజిటెడ్ ఉద్యోగులు సంఘంలో సభ్యులుగా చేరడానికి వీలుగా నిబంధనలకు సవరణ చేశారు.

# దేవుడినైనా వేలం!

(మొదటి పేజీ తరువాయి)

టీచర్ల డిప్యుటేషన్లు మొదలుకొని కరోనా సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్లు అమ్ముకోవడం వరకు... అన్ని పనుల్లోనూ కాసుల వేటే. ఆయన, ఆయన అనుచరగణం.. వీరి అక్రమాలు ఘనం! చివరకు దేవుడి ఆస్తులనే కబ్జా చేసేందుకు తెగించారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ ఉత్సవ రథంపై ఉన్న మూడు వెండి సింహాలు 2020 సెప్టెంబరులో చోరీకి గురయ్యాయి. ఈ సమయంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు విచారణను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయన్న విమర్శలు అప్పట్లో వచ్చాయి. వెండి సింహాలు గత ప్రభుత్వ హయాంలోనే చోరీకి గురి అయిఉండొచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఈ చోరీ వెనుక మంత్రి అనుచరుల హస్తమే ఉందన్న ప్రచారం జరిగింది. చివరికి అనామకులను ఈ కేసులో నిందితులుగా చూపి కేసు మూసివేశారు.

అమ్మో ఎమ్మెల్యే

### అది మంత్రికే చెల్లింది..

పలు ఆలయాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కొత్త సంస్కృతికి ఆయనే నాంది పలికారు. మంత్రి పక్కనే ఉన్న శ్రీసత్యభామ రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానాన్ని ఒక కులసంఘానికి కట్టబెడుతూ జీవో విడుదలైంది. ఆ ఆలయాన్ని తమ పూర్వీకులు నిర్మించారని, అది తమకు చెందుతుందని ఆ కులస్థులు పెట్టుకున్న దరఖాస్తు మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆలయానికి ఉన్న సుమారు రూ.కోట్లు విలువైన ఆస్తులను కొట్టేసే ప్లాన్‌లో భాగంగానే ఈ జీవో విడుదలైంది. ప్రతిఫలంగా భారీగానే ఆ నేతకు లబ్ధి చేకూరిందని ప్రచారం జరిగింది. వేణుగోపాలస్వామి ఆలయానికి నెలకు సుమారు లక్ష రూపాయలు సమకూరే ఆస్తులు ఉన్నాయి. గుడి చెంతనే 21 కమర్షియల్ దుకాణాలు ఉన్నాయి. మైలవరం నియోజకవర్గం కౌలూరులో 2 ఎకరాల పొలం ఉంది. ఇలాంటి ఆలయాన్ని కుల సంఘం పెద్దలు అడిగారని ప్రభుత్వం ఆగమేఘాలపై కట్టబెట్టేయడం అప్పట్లో అనుమానాలు రేపింది.

### మామ పేరుతో రూ.8 కోట్ల స్థలాన్ని కొట్టేశారు...

మంత్రిగా ఉన్న సమయంలో ఈ నేతకు ఓఎస్‌డీగా ఓ వ్యక్తి పనిచేశారు. ఆయన మామ పేరుతో సుమారు రూ.8 కోట్ల విలువైన స్థలాన్ని అప్పట్లో ఆయన కొట్టేశారు. మంత్రి నియోజకవర్గం పరిధిలోని ఓ ఆశ్రమంలో 5.16 ఎకరాల భూమి దేవదాయశాఖ పేరుతో ఉంది. సుమారు రూ.15 కోట్లు విలువైన ఈ భూమి తమ పూర్వీకులదని, ఎన్‌వోసీ ఇవ్వాలంటూ అప్పలస్వామి సత్రం, ట్రస్టు నిర్వాహకులు దేవదాయశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ భూమికి ఎన్‌వోసీ ఇప్పిస్తానని వారికి చెప్పి ఓఎస్‌డీ చక్రం తిప్పారు. ప్రతిఫలంగా తనకు ట్రస్టు నిర్వాహకులకు ఉన్న రూ. 8 కోట్ల విలువైన స్థలాన్ని ఇవ్వాలని ఒప్పందం చేసుకు మామ పేరుతో జీపీఏ చేయించేశారు. ఈ మొత్తం కథ ఆ నేత కనుసన్నల్లోనే నడిచింది. ఓఎస్‌డీ మామ...మంత్రి బినామీ అన్న ఆరోపణలు ఉన్నాయి.

### సొంత ఆలయానికి రూ.1.30 కోట్ల సీజీఎఫ్ నిధులు

మంత్రి కుటుంబం చేతిలో ఓ ఆలయం ఉంది. జీర్ణావస్థలో ఉన్న ఆలయాల మరమ్మతుల కోసం సర్వశ్రేయోనిధి(కామన్ గుడ్ ఫండ్- సీజీఎఫ్) నిధులను దేవదాయశాఖ వినియోగిస్తుంది. అయితే, తన పరపతిని వాడి ఈ నిధులను తన కుటుంబం ఆలయానికి ఆయన మళ్లించారు. ఏకంగా పురావస్తు శాఖ ఆధీనంలోని స్థలాన్ని ఆక్రమించేశారు. దేవాదాయశాఖలో రిజిస్టర్డ్ ఆలయంగా ఉన్న ఈ ఆలయానికి ఈవో ఉండరు. ప్రైవేటు ట్రస్టీల ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతోంది. ఆ నేత తండ్రి ఆలయం ట్రస్టు చైర్మన్. గత కొన్నేళ్లుగా ఆయనే చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ఆలయం చుట్టుపక్కల ప్రాంతమంతా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆయన మంత్రి అయిన తర్వాత ఈ ఆలయం చుట్టుపక్కల ఉన్న పురావస్తు శాఖ స్థలంపై కన్ను పడింది. ఆ శాఖ స్థలాన్ని ఆలయం పేరుతో తమ ఆధీనంలోకి తెచ్చుకుని అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ షాపుల నిర్మాణానికీ సీజీఎఫ్ నిధులను రూ.1.30 కోట్లు కేటాయింప చేసుకున్నారు. సాధారణంగా సీజీఎఫ్ నుంచి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు కేటాయిస్తుంటారు. కానీ మంత్రి సొంత ఆలయం కావడంతో చేయి కాస్త పెద్దదైంది. ఈ నిధులతో 10 దుకాణాలతో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారు.

### కరోనానూ క్యాష్ చేసుకున్నారు..

కరోనా కాలంలోనూ ఆ నేత కక్కుర్తి బుద్ధిని బయటపెట్టుకున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాల వారిని మంత్రి అనుచరుడు సమావేశపరిచిన తాము సరఫరా చేసే పీసీడీ మందులనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. మాట వినకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ పీసీడీ మందుల దందా ద్వారా కరోనా కాలంలో సుమారు రూ.50 కోట్ల మేర మంత్రి, ఆయన అనుచరులు ఆర్జించారు. 2020- 21లో కరోనా మహమ్మారి ప్రజలను బెంబేలెత్తిస్తున్న సమయంలో మంత్రి అండ చూసుకుని ఆయన అనుచరగణం భారీ ఎత్తున సొమ్ములు వెనకేసుకుంది. మంత్రి సన్నిహితుడిగా పేరొందిన ఒక మెడికల్ డిస్ట్రిబ్యూటర్ పీసీడీ మందుల దందాతో సుమారు రూ.50 కోట్లు పైచిలుకు ఆర్జించారు. ఫార్మా కంపెనీ తయారు చేసిన బ్రాండెడ్ మందుకు పేటెంట్ హక్కుల గడువు ముగిసిన తర్వాత ఆ మందు ఫార్ములాతో ఇతర కంపెనీలు ఏవైనా ఆ మందును తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా తయారు అయ్యేవే జనరిక్ మందులు. కొన్నిసార్లు పెద్ద కంపెనీలు కూడా మార్కెట్ పోటీని తట్టుకునేందుకు తాము గతంలో బ్రాండెడ్‌గా అమ్మిన మందులనే పేటెంట్ గడువు ముగిసిన తర్వాత బ్రాండెడ్‌తోపాటు జనరిక్ మందులుగా కూడా తీసుకొస్తుంటాయి. ఈ రెండు కాకుండా పీసీడీ మందులు అనేవి ఉంటాయి. ఫలానా మందు మాకు తయారు చేసి ఇవ్వండి, దానికి పేరు పెట్టుకుని, అమ్ముకుంటామని ఓ ఫార్మా కంపెనీతో ఒప్పందం చేసుకోవడం ద్వారా ఈ పీసీడీ మందుల తయారీ మొదలవుతుంది. ఉదాహరణకు ఓ ఫార్మా కంపెనీ డోలో పేరుతో ఓ మందు బిళ్లను తయారు చేసిందనుకుంటే అదే ఫార్ములాతో ఎలాంటి పేరు లేకుండా కేవలం ట్యాబ్లెట్లను తయారు చేసి ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం అన్నమాట. వీటిలో భారీ ఎత్తున మార్జిన్ ఉంటుంది. నాణ్యంగా తయారు చేయించుకునే వ్యక్తి.. తయారు చేసే వారిపైన ఆధారపడి ఉంటుంది. కరోనా కాలంలో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాల వారిని సమావేశపరిచిన మంత్రి అనుచరుడు తాము సరఫరా చేసే పీసీడీ మందులనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. మాట వినకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ పీసీడీ మందుల దందా ద్వారా కరోనా కాలంలో సుమారు రూ.50 కోట్ల మేర మంత్రి, ఆయన అనుచరులు ఆర్జించారు.



శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్తున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

### మల్లన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం, జనవరి 26: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి స్వామివారికి అభిషేకం నిర్వహించారు.



ఖాద్రీశుడి ఆలయంలో జస్టిస్ మన్మథరావును సత్కరిస్తున్న అర్చకులు

### ఖాద్రీశుడిని దర్శించుకున్న జస్టిస్ మన్మథరావు

కదిరిలీగల్/పుట్టపర్తి, జనవరి 26: శ్రీసత్యసాయి జిల్లా కదిరి శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు శుక్రవారం దర్శించుకున్నారు. అలాగే పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించారు.



లోయలో పడిన వాహనం

# రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- పల్నాడు జిల్లాలో బస్సు కిందకు దూసుకెళ్లిన ఆటో
- ముగ్గురు వ్యవసాయ కూలీలు మృత్యువాత
- 13 మందికి తీవ్రగాయాలు
- విశాఖ జిల్లాలో లోయలోకి వాహనం
- ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు

చిలకలూరిపేట/అరకులోయ, జనవరి 26: రాష్ట్రంలో రహదారులు రక్తమోడాయి. రెండు జిల్లాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. పల్నాడు జిల్లా నరసరావుపేట-చిలకలూరిపేట రహదారిపై లింగంగుంట్ల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామం నుంచి వీరంతా వ్యవసాయ పనుల నిమిత్తం ఆటోలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అదుపు తప్పిన ఆటోను తప్పించేందుకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రయత్నించగా సాధ్యపడలేదు. ఈ క్రమంలో బస్సు కిందకు వెళ్లడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వికసిరి హనుమాయమ్మ(60) అక్కడికక్కడే మృతి చెందగా, షేక్ హజరత్ వలి(70), గన్నవరపు శివ పార్వతి (65) ఆస్పత్రులకు తరలిస్తుండగా మృతి చెందారు. 13 మంది తీవ్రంగా గాయపడగా వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిలో పది మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. విశాఖలోని ఓ షాపింగ్‌మాల్ గోదాములో పనిచేస్తున్న ఎనిమిది మంది సిబ్బంది, మరో ఇద్దరు పిల్లలు కలిసి శుక్రవారం అనంతగిరి, అరకులోయ మండలాల్లో పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ఇన్నోవా వాహనంలో బయలుదేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సుంకరమెట్ట దాటిన తర్వాత పెదబంద గ్రామానికి సమీపంలో మలుపు వద్ద వాహనం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో వాహనం అదుపుతప్పి సుమారు 25 అడుగుల లోయలోకి కారు దూసుకుపోయి పెద్ద బండరాయిని ఢీకొని ఆగిపోయింది. ఈ క్రమంలో కారు మధ్య డోర్ తెరుచుకోవడంతో పైలా అన్నపూర్ణాదేవి (34) బయటకు పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అన్నపూర్ణాదేవి అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ కుమార్ బాబు తెలిపారు.







# ఓట్ ఫర్ ఓపీఎస్ సదస్సు జయప్రదం చేయండి

**గవర్నర్‌పేట:** పాత పెన్షన్ పునరుద్ధరణకు ఓట్ ఫర్ ఓపీఎస్ పేరుతో ఈనెల 28న రాజమండ్రిలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాజమండ్రి సదస్సు పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలను సదస్సుకు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, నేతలు హనుమంతరావు, ఎన్.కుమారరాజా, ఏ గోపాలకృష్ణ, బొల్ల వెంకటేశ్వరరావు, చలపతిరావు, డి.నిరీక్షణరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## హైదరాబాద్, బరోడా జయభేరి

**విజయవాడ స్పోర్ట్సు:** మూలపాడు వేదికగా శుక్రవారం ప్రారంభమైన బీసీసీఐ అండర్-23 ఉమెన్ వన్డే ట్రోర్నీ గ్రూప్-డీ మ్యాచ్‌ల్లో హైదరాబాద్ శుభారంభం చేసింది. ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన హైదరాబాద్ అమ్మాయిలు 49 ఓవర్ల లో 170 పరుగులకు ఆలౌటయ్యారు. 171 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన ఉత్తరాఖండ్ 34.4 ఓవర్లలో 93 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. విదర్భ-బరోడా మ్యాచ్‌లో బరోడా జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విదర్భ 72 పరుగులకు ఆలౌట్ కాగా, బరోడా 19.4 ఓవర్లలో 76 పరుగులతో జయకేతనం ఎగురవేసింది.

## రాష్ట్రచాంప్‌కు త్రోబాల్ జట్లు పయనం

అనంతపురం జిల్లాలో ఈ నెల 27 నుంచి జరిగే 8వ రాష్ట్రస్థాయి బాలబాలికల త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లు అక్కడకు రాష్ట్ర జనరల్ సెక్రటరీ సులోచన ఆధ్వర్యంలో పయనమయ్యాయి. బాలికల జట్టులో పి.సౌమ్య అన్నపూర్ణదేవి, బి.దుర్గాభవాని, కె.సాయిదుర్గ, పి.జోషిత, జి. శర్వాణి, ఆర్.సంధ్య, జి.మాధురి, కె.సారుప్య, పి. మౌనిక, డి.దీపిక, కె.అనిషా, ఎం.సహస్ర, కె.శాంతిప్రియ, సీహెచ్ హోత్రి శ్రీసాయి, కె.ధాన్విఎస్.కీర్తన ఉండగా, బాలుర జట్టులో బి. అవినాష్, ఎ.అఖిల్, బి. సందీప్ అజయ్ దీక్షిత్, ఎం. అఖిలేష్, పి.రేవంత్, ఎస్‌కే.డాగుల్ మీరా, ఎస్.దుర్గారావు, జె.రవివర్మ, జె.గణేష్, ఎన్.శరత్, బీ.సాయి గణేష్, ఎన్.హర్ష, జె.జగదీష్, జె.ప్రబోద్ కుమార్.

## రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి

**గుణదల:** రోడ్డు ప్రమాదంలో ఒకరు చనిపోయిన ఘటన ఎనికేపాడు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. రామవరప్పాడు రాజులబజార్లో నివాసముంటున్న తోట వెంకటేశ్వర ప్రసాద్ గూడవల్లిలోని నారాయణ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తుంటాడు. ఈయనకు భార్య, పాప. శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆయన తిరిగి సాయంత్రం మోటారు వాహనంపై ఇంటికి వస్తుండగా టిప్పర్ అతివేగంగా వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలవ్వడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న పటమట ఎస్‌ఐ సత్యన్నారాయణ సిబ్బందితో చేరుకుని క్షతగాత్రుణ్ణి ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే చనిపోయినట్టు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

# తిరంగా ఎగరంగా..

**విద్యాధరపురం, జనవరి 26:** నగరంలోని రైల్వే మినీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. రైలు ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పనకు 20 రైల్వేస్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం ఆదర్శమైన సేవలందించిన 20మంది ఉద్యోగులకు సర్టిఫికేట్ ఆఫ్ మెరిట్ అందజేశారు. అనిరుధ్, శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### దుర్గగుడిలో..

స్థానిక ఘాట్‌రోడ్డు ఓం టర్నింగ్ వద్ద గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది.కమిటీ చైర్మన్ కె.రాంబాబు, ఈవో రామారావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమ్మవారు, శ్రీరాములు, భారతమాత, గాంధీజీల చిత్రపటాలకు అర్చకులు, వేద పండితులు, వేద విద్యార్థుల వేద మంత్రోచ్ఛారణల నడుమ పూలు, పండ్లు సమర్పించారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది, హోంగార్డ్స్, దేవస్థానం రక్షణ సిబ్బంది గౌరవవందనాన్ని ఈవో అందుకున్నారు. ఏఈవోలు, ట్రస్ట్ బోర్డు సభ్యులు జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు, బి.మాధవికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

### కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో..

**కృష్ణలంక:** రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పీసీబీ ప్రధాన కార్యదర్శి బి.శ్రీధర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాటాడారు. ఏపీ పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎస్ఎస్‌వి భాస్కరరావు, జోనల్ కార్యాలయం అధికారి పి.మునుస్వామి నాయుడు, సీనియర్ ఎన్విరాల్‌మెంటల్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, జోనల్, రీజనల్ అధికారులు, పీసీబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఏపీ సీఆర్‌డీఏలో

ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ వివేక్ యాదవ్ జాతి నేతలు గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించి జాతీయ జెండా ఎగురవేశారు. పోలీసు దళాలచే గౌరవ వందనాన్ని స్వీకరించారు.

నగరంలో ఘనంగా గణతంత్ర వేడుకలు




అదనపు కమిషనర్లు కట్టా సింహాచలం, షేక్ అలీం భాష, ఆఫీస్ మేనేజర్ వి.డేవిడ్‌రాజు, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### డీటీసీ కార్యాలయంలో..

బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఉద్యోగులతో కలిసి డీటీసీ పురేంద్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు.ఆర్టీవో వై.ఐశ్వర్యరెడ్డి, ఎంవీ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, అధికారులు వెంకటేశ్వరరావు, జీవీఎస్ఎన్ మూర్తి, డీవీ రమణ, వి.పద్మాకరరావు, ఎస్.శ్రీనివాస్, ఏవోలు సిహెచ్.శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, కేవీవీ నాగమురళి పాల్గొన్నారు.

### పరేడ్ గ్రౌండ్‌లో..

పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ దిల్లీరావు, జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీసీపీ వి.అజిత, సబ్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందచేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏపీఎస్ ఎ.సాయిబాబా, పబ్లిసిటీ అసిస్టెంట్ ఫొటోగ్రాఫర్ వీవీ ప్రసాద్, రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు, టెక్నికల్ సబార్డినేట్ ఎం.రాజారావు ప్రశంసా పత్రాలను అందచేశారు.

### రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో

**ఆటోనగర్ (పెనమలూరు):** రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న అధికారుల, సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని సంస్థ ఎండీ లక్ష్మీషా పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం 300 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు. సంస్థ జేఎండీ ఎం శివప్రసాద్, గ్రామ సచివాలయాల అదనపు డైరెక్టర్ భావనా వశిష్ట, బోర్డు డైరెక్టర్ భాస్కరనాయుడు, ఈడీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, సీజీఎం అన్నపూర్ణ, జీఎం శ్రీరాములు పాల్గొన్నారు.

### ఆటోనగర్‌లో..

ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్, ది ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్, జేఆర్డీ టాటా ఐలా సర్వీస్ సొసైటీ సంయుక్తంగా గణతంత్ర వేడుకలను జవహర్ ఆటోనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బీవీఎస్ శాయి సభ్యుల సమక్షంలో పతాకావిష్కరణ చేశారు. ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీరాంప్రసాద్, కార్యదర్శి టీవీ నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి పవన్‌కుమార్ సరాఫ్, ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ తరఫున గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు, అధ్యక్షుడు డీ దుర్గాప్రసాద్, కార్యదర్శి ఎంఎస్ రామచంద్రరావు, కోశాధికారి జేఆర్ఎస్‌కే ప్రసాద్, జేఆర్డీ టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ కార్యదర్శి టీ శ్రీనివాసరావు, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, ఎన్ రాజబాబు, వి రమేష్‌బాబు పాల్గొన్నారు.

# కమనీయం శ్రీ సీతారాముల కల్యాణం




**విజయవాడ కల్చరల్:** శ్రీ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ముమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణ సప్తాహం శుక్రవారంతో ఘనంగా ముగిసింది. పూజ్య గురుదేవ్, హనుమాన్ సేవక్ డాక్టర్ పోలాప్రగడ శ్రీనివాస్ స్వామిజీ ఈ 'సుందరకాండ' సప్తాహాన్ని గానం చేశారు. కళాపీఠం గౌరవాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు దంపతుల చేతుల మీదుగా 'శ్రీ సీతారామ కల్యాణం' వైభవోపేతంగా జరిగింది. పోలాప్రగడ శ్రీనివాస్ గానానికి తబల-శ్రీకాంత్ సితార-విజయ్, వేణువు-నూకరాజు, కీబోర్డ్-లక్ష్మణ్ కుమార్ సాంకేతికతతో చక్కని వాద్య సహకారం అందించారు. ప్రముఖ న్యాయవాది జీవీఎంఆర్ఎస్ఎస్ వరప్రసాద్, ఎన్. లలిత్ ప్రసాద్, సూరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# దుర్గగుడిలో భక్తుల రద్దీ

**వన్‌టౌన్, జనవరి 26:** ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం, శని, ఆదివారాలు సెలవుదినాలు కావడంతో భక్తులు భారీగా రావడంతో క్యూలు కిటకిటలాడాయి. దర్శనానికి సుమారు గంటన్నర పైనే పట్టింది. ఈవో రామారావు, ఆలయ చైర్మన్ కే రాంబాబు పర్యవేక్షణలో ఏఈవోలు, సూపరింటెండెంటెంట్లు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మ దర్శనానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి దంపతులు శుక్రవారం విచ్చేశారు. ఈవో రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఈవో వారికి దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. హైదరాబాద్ గాయత్రీ నగర్‌కు చెందిన వి.వివేకానంద్ అమ్మవారి సన్నిధిలో నిత్యాన్నదానానికి రూ.1,00,116 ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి విరాళాన్ని అందజేశారు. ధర్మపథంలో భాగంగా శుక్రవారం భక్తి రంజని నిర్వహించారు. గురువు రాజలక్ష్మి శ్రీకాంత్, సహాయ గురువులు దేవి, అర్చన, మంజు, లావణ్య, కుసుమల ఆధ్వర్యంలో పలు భక్తి గీతాలు, వందేమాతరం గేయాలు ఆలపించారు.

### అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి దంపతులు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## సర్వేలు–సత్యాలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జ్ఞానవాపి మసీదు కింద ఆలయ అవశేషాలున్నాయని భారత పురావస్తుశాఖ నివేదిక తేల్చినట్టు హిందువుల తరఫు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ గురువారం మీడియా ముందు ప్రకటించారు. ఆ ప్రాంగణంలో ముపె[illegible]లుగుభాషల్లో ఉన్న శాసనాల ఆనవాళ్ళు దొరికాయని, వాటిలో ముగ్గురు దేవుళ్ళ ప్రస్తావన ఉందని, ఆలయ అవశేషాలపైనే మసీదు నిర్మించినట్టు సర్వే నిర్ధారించిందనీ అన్నారు. 839 పేజీల నివేదిక చేతికి అందిన వెంటనే ఈ న్యాయవాది మీడియా సమావేశంలో చెప్పిన వివరాలతో విభేదిస్తూ, హిందూదేవాలయం ఉనికిని సర్వే నిర్ధారించలేదంటూ శుక్రవారం ముస్లిం పక్షం న్యాయవాది మరో ప్రకటన చేశారు. ఈ రెండు ప్రకటనల మధ్య ఏయే అంశాల్లో విభేదం ఉన్నదన్నది అటుంచితే, అయోధ్యలో రామమందిర ఆరంభం ఘనంగా జరిగిన రెండురోజులకే జ్ఞానవాపి పరిణామాలు జోరందుకోవడం విశేషం.

ఏఎస్ఐ తన నివేదికను గత ఏడాది డిసెంబరు 18న సీల్డుకవర్‌లో వారణాసి కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను బహిర్గతం చేయాలని హిందూపక్షం న్యాయవాదులు గతంలో కోరినప్పుడు న్యాయమూర్తి అంగీకరించలేదు. తమ అభ్యర్థనమేరకు కోర్టు సర్వేను ఆదేశించినందున అందులో ఏమున్నదో తెలుసుకొనే హక్కు తమకు ఉంటుందని వారు డిమాండ్ చేసినప్పటికీ, అసత్యాలకు తప్పుడు సమాచారానికి ఇది అవకాశం ఇస్తుందంటూ కోర్టు తిరస్కరించింది. ఆ తరువాత, జనవరి 24న ఏ నిర్ణయమూ చేయబోతున్నట్టు న్యాయమూర్తి ప్రకటించినప్పుడు, అలహాబాద్ హైకోర్టు డిసెంబరు 19న ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సీల్డు కవర్ తెరిచే అంశాన్ని కనీసం ఒక నాలుగువారాలు వాయిదావేయాలని పురావస్తుశాఖ కూడా న్యాయస్థానాన్ని కోరింది. అత్యంత కీలకమైన ఈ నివేదిక బయటకువస్తే, అసత్యాలు, అర్ధసత్యాలు, దుష్ప్రచారాలు జరుగుతాయంటూ ఒకదశలో న్యాయస్థానం, పురావస్తుశాఖ అభిప్రాయపడిన ఈ నివేదిక ఉభయపక్షాలవారికీ వాదనలకు ఉపకరిస్తుందన్న పేరుతో అంతిమంగా బయటకు వచ్చింది. వందలపేజీల ఈ నివేదికలో ఏమున్నదన్నకంటే, అందుకున్న ఉభయపక్షాలు ఎదుటివారు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పరస్పరం ఖండించుకోవడం మాత్రం జరిగిపోతున్నది.

రథయాత్రలతో రామజన్మభూమి ఉద్యమం ఉధృతంగా ఉన్న కాలంలో ఒక పిటిషన్ ద్వారా ఈ వివాదం న్యాయస్థానంలోకి అడుగుపెట్టింది. ఏడేళ్ళ తరువాత 1991నాటి ప్రార్థనాస్థలాల చట్టం పరిధిలోకి ఈ పిటిషన్ వస్తుందంటూ కొట్టివేసిన ఇదే వారణాసి కోర్టు మరో పదమూడేళ్ళకు తిరిగి తెరిచింది. ఆ తరువాత ఏఎస్ఐ సర్వే కోరుతూ పిటిషన్ దాఖలు కావడం, మసీదు ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆరాధనకు అనుమతినివ్వాలంటూ కొందరు మహిళలు అభ్యర్థనలు చేసుకోవడం, వారణాసి కోర్టునుంచి అలహాబాద్ హైకోర్టు మీదుగా సుప్రీంకోర్టు వరకూ ఈ వ్యవహారం నడిచి, సర్వే జరగడం తెలిసిందే. ప్రార్థనాస్థలాల చట్టం ఈ పిటిషన్‌కు వర్తించబోదని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి రోహిత్ రంజన్ అగర్వాల్ డిసెంబరులో ప్రకటిస్తూ ఆలయ పునరుద్ధరణ అంశం దేశస్థాయిలో అత్యంత ప్రాధాన్యతగలదని, ఆర్నెల్లలో దానిని తేల్చాలని కూడా ప్రకటించారు.

వలసలు, చొరబాట్లు, మార్పిడులు ఉధృతంగా ఉన్న భారతదేశంలో చారిత్రక తప్పిదాలను సరిదిద్దేపేరిట మరిన్ని ఆలయ ఉద్యమాలు రేగి, సామాజిక అశాంతికి కారణమవుతాయన్న భయంతో, ముందు జాగ్రత్తతో 'రామజన్మభూమి'ని మినహాయిస్తూ ప్రార్థనాస్థలాల చట్టం పుట్టుకొచ్చింది. 2019లో రామమందిర నిర్మాణానికి వీలుకల్పించిన తీర్పులో సుప్రీంకోర్టు ఆ చట్టం స్ఫూర్తిని ప్రశంసించింది. దీనితో మరుసటి ఏడాది దాని రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలైతే, విస్తృత ధర్మాసనానికి నివేదిస్తామని కోర్టు ప్రకటించింది తప్ప ఈ విషయంలో అడుగుపడలేదు. చట్టాన్ని సమర్థించేదీ లేనిదీ కేంద్రప్రభుత్వం తేల్చలేదు. కానీ, దిగువకోర్టులు, హైకోర్టులు ఆ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తూ పోతున్నాయి. జ్ఞానవాపి సహా ఇటువంటి కేసుల యోగ్యత విషయంలో నోరెత్తకుండా దిగువకోర్టుల నిర్ణయాలను కొద్దిసవరణలతో సుప్రీంకోర్టు ఆమోదిస్తున్నందున, ఇప్పుడు మధురలోనూ సర్వేకు అడుగులుపడి మరో కొత్త ఆలయ ఉద్యమానికి ఊతం వస్తున్నది. శివలింగాల అన్వేషణను పక్కనబెట్టాలని భాగవత్ ఒకపక్కన అంటున్నా, వరుసగా అదే జరగడం మతంమీద ప్రేమ ఉన్న సామాన్యులకు సైతం ఆశ్చర్యాన్ని కలిగించకమానదు.

---

# 'సమాఖ్య పాలన' ఏమయ్యేట్టు?

ఇండియా అనగా భారతదేశము. అది రాష్ట్రాల యూనియన్‌గా ఉండవలెను. ఇదొక తిరుగులేని రాజ్యాంగ సత్యం. ఎవరూ ఎట్టి పరిస్థితులలోనూ దీన్ని నిరాకరించలేరు. అవును రాష్ట్రాల కలయికే ఇండియా. భారత రాజ్యాంగం మొదటి షెడ్యూలులో 29 రాష్ట్రాల జాబితా, 7 కేంద్ర పాలిత ప్రాంతాల జాబితా ఉన్నది. బ్రిటిష్ పాలనలోని రాష్ట్రాలు, దేశీయ రాజుల పాలనలోని సంస్థానాలు ఇండియా యూనియన్‌లో చేరేందుకు స్వచ్ఛందంగా అంగీకరించడం భారత సమాఖ్య పాలనా విధానం విశిష్టత.

ఇండియన్ యూనియన్‌లో భాగమైన రాష్ట్రాలను భాషాప్రయుక్తత ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించారు. ఎందుకంటే ఒక రాష్ట్రం అంటే కేవలం పరిపాలనా ప్రాంతం మాత్రమే కాదు. దానికొక ప్రత్యేక భాషాపరమైన, సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ అస్తిత్వమున్నది. ఆ అస్తిత్వం విలక్షణమైంది. ఏ రాష్ట్ర విలక్షణత ఆ రాష్ట్రానికి మాత్రమే సొంతం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మనం ఎలా భారత సమాఖ్యలో భాగమో కూడా చూద్దాం. భారత రాజ్యాంగంలోని కొన్ని అధికరణలు ఆ సమాఖ్య వ్యక్తిత్వాన్ని మరింతగా విస్తృతపరిచాయి. మరికొన్ని అధికరణలు ఆ సమాఖ్య తత్వానికి పరిమితులు విధించాయి. అయితే భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు ఈ దేశం ఒక సమాఖ్య వ్యవస్థగా ఉండితీరాలని ఆ మౌలిక శాసనం నిర్దేశించింది. భారత రాజ్యాంగానికి పార్లమెంటు చేసే సవరణలను దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు విధిగా ఆమోదించాలి. లేనిపక్షంలో ఆ సవరణకు చట్ట ప్రతిపత్తి లభించదని రాజ్యాంగ అధికరణ 368(2) స్పష్టం చేసింది. భారత్ స్పష్టంగా ఒక సమాఖ్య వ్యవస్థ అన్న నా వాదనకు ఆ అధికరణే ప్రధాన ప్రాతిపదిక.

కాగా రాజ్యాంగాన్ని సవరించడంలో పార్లమెంటుకు ఉన్న అధికారాలు వివాదాస్పదమైనవి. రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం ఏ వ్యక్తికీ, సంస్థకూ లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం కేశవానంద భారతి కేసు (1973) తీర్పులో స్పష్టం చేసింది. అదే విషయాన్ని మినర్వా మిల్స్ కేసు (1980) తీర్పులో పునరుద్ఘాటించింది. సమాఖ్య విధానం భారత రాజ్యాంగ మౌలిక లక్షణమని కేశవానంద భారతి, ఎస్ఆర్ బొమె[illegible]తదితర కేసులలో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అది సమాఖ్య విధానానికి ఒక తిరుగులేని విజయం.

అయినప్పటికీ మన సమాఖ్య విధానాన్ని బలహీనపరిచేందుకు కేంద్రం పలు విధాల ప్రయత్నిస్తోంది. ప్రతి రాష్ట్రానికి కార్యనిర్వాహక, శాసన, నిర్మాణ, ఆర్థిక అధికారాలు ఉన్నాయి. వీటిని నీరుగార్చడానికి కేంద్రం ఎలా ప్రయత్నిస్తోందో వివరంగా చూద్దాం.. తొలుత కార్యనిర్వాహక అధికారాలు. రాజ్యాంగ అధికరణలు 154, 162 కింద రాష్ట్రానికి కార్యనిర్వాహక అధికారాలు ఉన్నాయి. ఏ ఏ అంశాలలో రాష్ట్రాలకు ఈ అధికారాలు ఉన్నాయో ఆ అంశాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉన్నది. పోలీసు వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోనిది. శాంతి భద్రతల డీజీపీని రాష్ట్ర ప్రభుత్వమే నియమిస్తుంది. అయితే కేంద్రం ఈ అధికారాన్ని స్వాయత్తం చేసుకున్నది. ఆ ఉన్నత పోలీసధికారి పదవికి అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యుపిఎస్‌సికి నివేదించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఆ జాబితా నుంచి యుపిఎస్‌సి ఎంపిక చేసిన ముగ్గురు ఐపీఎస్ అధికారులలో ఒకరిని శాంతిభద్రతల డీజీపీగా నియమించాలని కేంద్రం నిర్దేశించింది. అలాగే 'నీట్'ను ప్రవేశపెట్టడం రాష్ట్రాల అధికారాలను కేంద్రం హస్తగతం చేసుకోవడమే కాదూ? రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొలిపి నిధులు సమకూరుస్తున్న వైద్యకళాశాలలతో సహా అన్ని వైద్యకళాశాలలలోనూ అడ్మిషన్లను కేంద్రం అఖిల భారత స్థాయిలో నిర్వహించే పరీక్షలో పొందిన మార్కులు, ర్యాంకు ఆధారంగా కల్పించాలని నిర్దేశించడం ఎలా న్యాయం? అలాగే కేంద్రం పాక్షికంగా సమకూర్చే సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేసేందుకు ఏవో కొన్ని కుంటి సాకులతో కేంద్రం నిరాకరిస్తోంది. నిధుల వ్యయానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో సమర్పించక పోవడం కూడా నిధుల మంజూరు నిరాకరణకు కారణమయితే ఎలా? కొత్త పాఠశాలలను ప్రారంభించలేదన్న కారణంగా కేరళకు నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం సమ్మతించడం లేదు. జననాల రేటు తక్కువగా ఉన్న కారణంగా విద్యార్థులు తగు సంఖ్యలో లేనందున ఉన్న పాఠశాలలను మూసివేయాల్సి వస్తుందని వివరణ ఇచ్చినప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు!




ఆర్థిక అధికారాల విషయంలో బలహీనపడినంతగా మరే విషయంలోనూ మన సమాఖ్య పాలనా విధానం బలహీనపడలేదు. పన్నుల సంబంధిత ఆదాయాలలో రాష్ట్రాల వాటాను గణనీయంగా తగ్గించాలని 14వ ఆర్థిక సంఘాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆదేశించినట్టు' తెలుస్తోంది. పర్యవసానంగా ఆ ఆదాయాలలో రాష్ట్రాలకు ప్రస్తుతమున్న 41 శాతం వాటా 31 శాతానికి తగ్గిపోయే అవకాశమున్నది.

శాసననిర్మాణ అధికారాల విషయాన్ని చూద్దాం. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో గల అంశాలపై చట్టాలు చేసే అధికారం అటు కేంద్రానికీ, ఇటు రాష్ట్రాలకూ ఉన్నది. అయితే కేంద్రం రాష్ట్రాల ఆమోదం లేకుండానే, కనీసం వాటిని సంప్రదించకుండానే ఆ అంశాలపై అనేక చట్టాలు తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఈ ఏకపక్ష ధోరణికి తాజా ఉదాహరణ ఇటీవల పార్లమెంటు ఆమోదం పొందిన నేర న్యాయ విచారణ చట్టాలు. ముసాయిదా బిల్లులపై కనీసం రాష్ట్రాలతో సంప్రతింపులు కూడా జరపలేదు. పైగా ఆ చట్టాలలోని పలు నిబంధనలు రాష్ట్రాల అధికార పరిధిలోని 'శాంతిభద్రతల నిర్వహణ– పోలీసు' అనే అంశం కిందకు వస్తాయి.

రాష్ట్రాల ఆర్థిక అధికారాలను కేంద్రం ఎలా స్వాయత్తం చేసుకుంటుందో చూద్దాం. ఆర్థిక అధికారాల విషయంలో బలహీనపడినంతగా మరే విషయంలోనూ మన సమాఖ్య పాలనా విధానం బలహీనపడలేదు. పన్నుల సంబంధిత ఆదాయాలలో రాష్ట్రాల వాటాను గణనీయంగా తగ్గించాలని 14వ ఆర్థిక సంఘాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆదేశించినట్టు' తెలుస్తోంది పర్యవసానంగా పన్నుల రాబడిలో రాష్ట్రాలకు ప్రస్తుతమున్న 41 శాతం వాటా 31 శాతానికి తగ్గిపోయే అవకాశమున్నది. రాష్ట్రాలకు వాటా కల్పించడానికి ఆస్కారం లేని సెస్‌లు, సర్‌ఛార్జీలను విచక్షణారహితంగా విధిస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలు తీసుకునే రుణాలపై కూడా తీవ్ర పరిమితులు విధించారు. జీఎస్టీ చట్టాలు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను కుదేలుపరుస్తున్నాయని మరి చెప్పనవసరం లేదు. అలాగే ఆర్థిక సహాయం అందించడంలో అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడడం లేదు. దీనివల్ల వివిధ రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. నిధులకోసం తాము కేంద్రాన్ని అడుక్కోవలసి వస్తోందని బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆక్రోశిస్తున్నారు. బీజేపీ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా సంతోషంగా లేరన్నది ఒక బహిరంగ రహస్యమే.

రాష్ట్రాల అధికారాలను గణనీయంగా తగ్గించివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదన్నది ఒకప్పుడు అధికార నడవాలలో ఒక వదంతిగా ఉండేది. ఇప్పుడది ఇంకెంత మాత్రం వదంతి కాదు. ఒక వాస్తవం. ఒక పథకం ప్రకారం రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరించివేస్తోంది. ఆ పథకం సంపూర్ణంగా అమలయిననాడు రాష్ట్రాలు కేవలం పరిపాలనా విభాగాలుగా మాత్రమే మిగిలిపోతాయి. భారత్ అప్పుడు ఒక మునిసిపాలిటీల యూనియన్‌గా మాత్రమే మిగులుతుంది. భావి పరిస్థితులు అంతకంటే కూడా ఘోరంగా ఉన్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

---

# పాలస్తీనా: ప్రవహిస్తున్న విషాదం

'గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీళ్ళతో' అని మహాకవి ఒకరు వాపోయారు. గతమే కాదు, వర్తమానమూ ఇందుకు ఏ మాత్రం భిన్నంగా లేదనేందుకు పాలస్తీనాలో ఎడతెగని ఘర్షణలే ఒక తిరుగులేని తార్కాణం. ఇజ్రాయెల్ –హమాస్ యుద్ధాన్ని గురించిన వార్తలు కలచివేస్తుండగా ఇటీవల ఒక రోజున పాత పుస్తకాల దుకాణానికి వెళ్లాను. 'WHEN I LIVED IN MODERN TIMES'. అనే నవల ఒకటి నా కంటపడింది. రచయిత్రి లిండా గ్రాంట్. ఆమె గురించి నేను ఎప్పుడూ వినలేదు, చదవలేదు. ఇజ్రాయెల్ ఆవిర్భవించక ముందు, బ్రిటన్ నియంత్రణలో ఉన్న కాలంలోని పాలస్తీనాలో పరిస్థితుల గురించి రాసిన నవల కావడంతో ఆ పుస్తకంపై నా ఆసక్తి పెరిగింది. ఆ పుస్తకాన్ని కొనడానికి అంతకంటే మరేమి ప్రేరణ కావాలి? కొని ఇంటికి తీసుకువచ్చి చదివాను. దశాబ్దాల క్రితం పాలస్తీనా సమస్య ఆరంభమైన వైనానికి ఒక చక్కని చారిత్రక కల్పనే లిండా గ్రాంట్ నవల. అది నాకు ఎలాంటి ఆశాభంగం కలిగించలేదు. ఈవెలిన్ సెర్ట్ అనే రెండు పదుల వయసులో ఉన్న బ్రిటిష్ యూదు పౌరురాలు దృక్పథం నుంచి రాసిన నవల అది. ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత, కొత్తగా ప్రభవించనున్న కొత్త యూదు రాజ్యం (ఇజ్రాయెల్)లో తాను చేయగలిగిందేమిటి? ఆ దేశ సమున్నతికి తాను చేయగలిగేదేమిటో తెలుసుకోవడానికి లిండా గ్రాంట్ పాలస్తీనాకు వెళ్లారు. ఒక కిబ్ బట్జ్ (సమష్టి వ్యవసాయ క్షేత్రం)లో ఆశ్రయం పొందారు. ఆ సమష్టి వ్యవసాయ క్షేత్రం అధికారి ఒక రష్యన్ యూదుడు. సోషలిస్ట్ విశ్వాసాలు ఉన్న వ్యక్తి. అరేబియా ఎడారిని సస్యశ్యామలం చేయాలని కలలు కంటున్న ఆదర్శవాది. అయితే అరబ్‌లు అంటే అతడికి సదభిప్రాయం లేదు. తన కంటే ఎన్నో శతాబ్దాల ముందు నుంచీ వారు పాలస్తీనాలో నివసిస్తున్నారన్న వాస్తవాన్ని విస్మరించిన యూదుడతడు. ఈవెలిన్‌తో ఒకసారి ఇలా అన్నాడు: "బ్రిటిష్ వారు వెళ్లిపోయిన తరువాత మనం ఈ అరబ్‌లను దయాభావనతో పాలిస్తాం. మన భావాలు, ఆలోచనలు వారిని తప్పక ప్రభావితం చేస్తాయి, తెగల స్వాభావిక విధేయ మానసిక ధోరణి నుంచి వారు విముక్తులవుతారు. ఆధునిక చింతనాధోరణి వారిలో మొగ్గ తొడిగి వికసిస్తుంది. అప్పుడు ఈ అరబ్‌లు ఈ భూమి నుంచి కూడా వెళ్లిపోతారు. ఇరుగు పొరుగు దేశాలలో వారికి తప్పక ఆశ్రయం లభిస్తుంది. మనం వారికి ఎంతో డబ్బు ఇచ్చి ఈ భూములు కొనుక్కున్నాం. వారి పరోక్ష భూస్వాములు విక్రయించిన ఈ భూమిని మంచి ధర ఇచ్చి కొనుక్కున్నాం. మనం ఎలాంటి వంచనకు పాల్పడలేదు ఈ భూమి ఎప్పుడైనా సర్వనాశనమైతే అది అరబ్‌ల వల్లనే కాని, మన వల్ల కాబోదు. శతాబ్దాలుగా ఇక్కడ ఉన్నవారు ఏమీ చేయలేని దానిని మనం కేవలం ఇరవై సంవత్సరాలలో చేశాం. ఈ భూమిని ఎంతగానో అభివృద్ధిపరిచాం. ఎందుకు? మనం దేనిలోనైతే పరిపూర్ణ విశ్వాసముంచామో దాని కోసం కదా. మనం విశ్వసించింది భవిష్యత్తు. అవును భవిష్యత్తు మనదే'.

ఈ మాటలు చదివిన వెంటనే ఇటువంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తూ యూరోపియన్ యూదు తాత్వికుడు మార్టిన్ బూబెర్ (1879–1965) 1938లో మహాత్మాగాంధీకి రాసిన ఒక లేఖలోని విషయాలు జ్ఞాపకమొచ్చాయి. పిడివాది అయిన సమష్టి వ్యవసాయక్షేత్ర అధికారి వలే కాకుండా ఈ తాత్వికుడు అరబ్‌లు, యూదుల మధ్య సమన్వయాన్ని కాంక్షించాడు. ఈజిప్ట్, పాలస్తీనియన్ రైతులు చాలా వెనుకబడి ఉన్నారని అంటూ వారిని ఆధునిక వ్యవసాయ పద్ధతులకు తీసుకువచ్చేందుకు యూదుల తోడ్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని బూబెర్ అన్నారు. 'పదమూడు శతాబ్దాలుగా అరబ్‌లు తనకు చేసిందేమిటని? పాలస్తీనా నేలను అడగండి. కేవలం యాభై సంవత్సరాల్లో మేము చేసింది ఏమిటి? ఆ నేల తల్లి సమాధానం ఈ భూమి ఎవరికి చెందుతుందనే న్యాయబద్ధమైన చర్చలో బలమైన సాక్ష్యం అవుతుందనడంలో సందేహం లేదు'. పాలస్తీనాలోని అరబ్‌లు... యూదుల కంటే తక్కువ స్థాయికి చెందినవారనేది బూబెర్ సునిశ్చిత అభిప్రాయం. 'పాలస్తీనా నేల మా విశిష్టతను గుర్తించింది' అని గాంధీకి రాసిన లేఖలో బూబెర్ స్పష్టంగా పేర్కొన్నారు. అరబ్‌లను మరింతగా ఆధునికులను చేయాలన్నదే యూదుల అభిమతమని బూబర్ పేర్కొన్నారు.




బ్రిటిష్ యూదు పౌరురాలు లిండా గ్రాంట్ 1990 దశకంలో రాసిన నవల 'WHEN I LIVED IN MODERN TIMES'లో ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణలు ఎప్పటికీ అపరిష్కృతంగా ఉండిపోవచ్చని అభిప్రాయపడ్డారు. అసలు ఆ ఘర్షణలకు బాధ్యత యూదులు, అరబ్‌ల కంటే అసలు ఆ సమస్యను సృష్టించిన దేశాలు–బ్రిటన్, జర్మనీ, అమెరికాలదే అన్నది ఒక నిష్ఠుర సత్యం. కనుక, పాలస్తీనాలో సుస్థిర శాంతి స్థాపనకు అమెరికా, యూరోపియన్ దేశాలు చొరవ తీసుకోవాలి.

కిబ్ బట్జ్ జీవితంతో విసిగిపోయిన ఈవెలిన్ తన నివాసాన్ని టెల్ అవీవ్‌కు మారుస్తుంది. అక్కడ జర్మన్ వాస్తు శిల్పులు నిర్మించిన ఒక కాలనీలో ఉంటుంది. అందరూ యూదులే ఉన్న ఆ ప్రాంతంలో శ్రీమతి లింజ్ అనే నవీన నాగరిక మహిళ పరిచయమవుతుంది. బెర్లిన్ నుంచి వలసవచ్చిన విద్యాధికురాలు లింజ్. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావంతులయిన స్త్రీ పురుషులు ఈ కాలనీలో ఉన్నారని ఈవెలిన్‌కు ఆమె చెబుతుంది. 'శాస్త్రవేత్తలు, దార్శనికులు, డాక్టర్లు, ఇంజనీర్లు, చిత్రకారులు.. ఇలా ప్రతి మేధో, వృత్తి రంగం వారు ఇక్కడ ఉన్నారు' అని ఆమె ఎంతగానో గర్విస్తుంటుంది. కర్బ్యూజాలు ఎలా అమ్మాలో మాత్రమే అరబ్‌లకు తెలుసు. అత్యంత ఆధునిక భావాల స్రష్టలు అయిన వారు తమకంటే విద్యా వ్యాసంగాలలో తక్కువ స్థాయికి చెందినవారు, పాలనానుభవం లేనివారి నియంత్రణలో ఉండడం సబబేనా అని శ్రీమతి లింజ్ ప్రశ్నిస్తుంది. పాలస్తీనాలో ఒక ఏడాది ఉన్న తరువాత బ్రిటన్‌కు తిరిగి వెడుతుంది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

టెల్ అవీవ్ నగరంలో ఒక యూదు తీవ్రవాదితో ఈవెలిన్ ప్రేమలో పడుతుంది. అతడు ఇర్గున్ అనే సాయుధ తీవ్రవాద బృందానికి చెందినవాడు. కింగ్ డేవిడ్ హోటల్‌పై బాంబు దాడిలో అతడు కూడా పాల్గొంటాడు. దాడికి లక్ష్యమైన బ్రిటిష్ అధికారులతో పాటు అమాయక యూదులు కూడా ఎంతోమంది ఆ దాడి మూలంగా చనిపోతారు. దీనిపై ఈవెలిన్ తన ప్రియుడిని తీవ్రంగా మందలిస్తుంది. అయితే అతడు తన చర్యను సమర్థించుకుంటాడు. సమూల మార్పుకు బాంబు ఒక సాధనమని ఈవెలిన్‌కు విపులంగా చెబుతాడు, పాత వ్యవస్థను బాంబు సర్వనాశనం చేయడమేకాదు, దాని పునర్నిర్మాణానికీ ఆస్కారం కల్పిస్తుంది అని అంటాడు. ఈవెలిన్ పాలస్తీనాలో ఒక ఏడాది ఉన్న తరువాత బ్రిటన్‌కు తిరిగి వెడుతుంది. ఒక యూదు సంగీతవేత్తను పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లలకు తల్లి అవుతుంది. భర్త చనిపోయిన చాలా సంవత్సరాల తరువాత ఇంగ్లండ్ నుంచి పాలస్తీనాకు వస్తుంది. తన చివరి సంవత్సరాలు అక్కడే గడపాలని కోరుకుంటుంది. లింజ్ ఇంకా బతికే ఉంటుంది. అరబ్‌లపై ఇజ్రాయెల్ రాజ్యవ్యవస్థ దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడే సంస్థలో ఆమె పని చేస్తుంటుంది. ఆ దురాగతాల గురించి లింజ్ చెప్పినప్పుడు ఎవరైనా, ముఖ్యంగా యూదులు అయినవారు అటువంటి దుర్మార్గాలకు ఎలా పాల్పడుతారో అని ఈవెలిన్ దిగ్భ్రాంతి చెందుతుంది.

లిండా గ్రాంట్ తన చారిత్రక నవల "వెన్ ఐ లివ్డ్ ఇన్ మోడరన్ టైమ్స్"ను 1990 దశకంలో రాశారు. ఓస్లో ఒప్పందాల వైఫల్యం స్పష్టంగా కనిపించడం, వెస్ట్ బ్యాంక్‌లో యూదుల నివాసాలు మరింతగా పెరిగిపోవడం, పాలస్తీనియన్ల తిరుగుబాటు ముమ్మరమయిన నేపథ్యంలో ఆమె ఈ నవలారచనకు ఉపక్రమించారు. 1940 దశకంలో యూదు–అరబ్‌ల ఘర్షణ మూలాలను చారిత్రక కల్పన ద్వారా వివరించేందుకు ఆమె ప్రయత్నించారు. చాలావరకు సఫలమయ్యారు. మున్నెన్నడూ లేని రీతిలో ఆ ఘర్షణ అత్యంత అమానుషంగా పరిణమించిన ప్రస్తుత సందర్భంలో ఆ నవలను చదవడం కరుణ భావంతో కదిలించివేసిన, తీవ్రంగా ఆలోచింపజేసిన అనుభవం అనడంలో సందేహం లేదు. అరబ్‌ల పట్ల సానుభూతి, ఇజ్రాయెలీ మితవాదులు తమ హింసాకాండను పూర్తిగా సమర్థించుకోవడం ఆ తొలి రోజుల్లో కూడా ఉన్నట్టు మనకు తెలుస్తుంది. అదే సమయంలో యూదుల వర్ణనాతీత యాతనలను రచయిత్రి మన దృష్టికి తీసుకువస్తారు. ఐరోపాలో యూదు మతస్థులపై తీవ్ర వ్యతిరేకత, హిట్లర్ మారణహోమాలు, ఇజ్రాయెల్ ఉనికిలోకి వచ్చిన తరువాత పశ్చిమాసియాలోని వివిధ దేశాలలో యూదులపై దాడులు, దురాగతాలు పెరిగిపోవడాన్ని లిండా గ్రాంట్ కళ్లకు కట్టించారు నవలను పూర్తిగా చదివిన తరువాత 'లిండా గ్రాంట్' గురించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు గూగుల్‌లో శోధించాను. గాజాలో తాజా హింసాకాండ నేపథ్యంలో బ్రిటిష్ యూదు పౌరురాలుగా తన అనుభవాలు, ఆదుర్దాలను వివరిస్తూ లిండా గ్రాంట్ ప్రముఖ మ్యాగజైన్ 'ప్రాస్పెక్ట్' నవంబర్, 2023 సంచికలో రాసిన ఒక వ్యాసం కూడా కనపడింది. పాలస్తీనియన్లకు మద్దతునిస్తున్న బ్రిటిష్ రచయితలు, కళాకారులు ఇజ్రాయెలీ పౌరులను అమానుషంగా హతమార్చడాన్ని విస్పష్టంగా ఖండించడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు, నెతన్యాహు ప్రభుత్వ ప్రతీకార చర్యలు రెండింటినీ ఆమె తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్యను పరిష్కరించేందుకు యూదులు–అరబ్‌ల మధ్య సమన్వయాన్ని సాధించగల రాజకీయ వ్యూహాన్ని సమకూర్చగల శక్తి సామర్థ్యాలు బ్రిటిష్ యూదులకు లేవని లిండా భావిస్తున్నారు. బహుశా ఆ సమస్య ఎప్పటికీ పరిష్కరించరానిదిగా ఉండిపోవచ్చని కూడా అభిప్రాయపడుతూ 'ప్రాస్పెక్ట్'లో తన వ్యాసాన్ని లిండా గ్రాంట్ ముగించారు. బహుశా, ఆమె అభిప్రాయం వాస్తవికమైనది కావచ్చు, కాకపోవచ్చు. ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్య పరిష్కారానికి ఏదైనా అవకాశముంటే అందుకు చొరవ తీసుకోవల్సింది యూదులు, అరబ్‌లు కాదని, అసలు ఆ సమస్యను సృష్టించిన దేశాలే అందుకు పూనుకోవాలని నేను అభిప్రాయపడుతున్నాను. లిండా గ్రాంట్ ఒక బ్రిటిష్ సైనికాధికారి మాటలను తన వ్యాసంలో ఉటంకించారు: 'అరబ్‌ల సమస్యేమిటంటే వారికి సరైన నాయకత్వం కొరవడింది. సంస్థాగత దక్షత తక్కువ. ఈ రెండు అంశాలలో వారిపై యూదులదే పైచేయిగా ఉన్నది. ఏది ఏమైనా పాలస్తీనా అరబ్‌ల భూమి. అంతిమంగా అది వారికి వెళ్లాల్సిందే. యూదులు దురాక్రమణదారులు. అయితే అక్కడ యూరోపియన్లు ఉండడం వల్ల మన (యూరోపియన్) దేశాల ప్రయోజనాలు నెరవేరుతాయి'. యూదులకు పాలస్తీనా సొంత దేశాన్ని ఏర్పాటు చేస్తామన్న బాల్ఫోర్ ప్రకటన (1917 ద్వారా) ఇజ్రాయెల్ ఆవిర్భావానికి బ్రిటిష్ వారు తొలి ప్రేరణనందించారు. అసలు యూదు మతస్థుల నందరినీ సంపూర్ణంగా నిర్మూలించేందుకు పూనుకోవడం ద్వారా జర్మన్లు ఇజ్రాయెల్ ఆవశ్యకతకు రెండో ప్రేరణ కల్పించారు. ఇజ్రాయెల్ ఉనికిలోకి వచ్చిన తరువాత, ముఖ్యంగా 1967 యుద్ధానంతరం పాలస్తీనియన్ల హక్కులు పూర్తిగా ఉల్లంఘించబడడం ప్రారంభమయింది. ఈ విషయంలో ఇజ్రాయెల్‌ను అమెరికా అన్ని విధాల ప్రోత్సహించింది. పాలస్తీనా భూభాగాలలో యూదుల విస్తరణను పూర్తిగా ఉపేక్షించింది. ఐక్యరాజ్యసమితిలో శాంతి ప్రతిపాదనలను వీటో చేసింది. పాలస్తీనాలో దశాబ్దాలుగా ఎడతెగని ఘర్షణలకు బాధ్యత యూదులు, అరబ్‌ల కంటే ఎక్కువగా బ్రిటన్, జర్మనీ, మరీ ముఖ్యంగా అమెరికాదేననడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ నిష్ఠుర సత్యాన్ని అంగీకరించి తీరాలి. కనుక, పాలస్తీనాలో సుస్థిర శాంతి స్థాపనకు చొరవ తీసుకోవల్సింది అమెరికా, యూరోపియన్ దేశాలే అని నేను సునిశ్చితంగా భావిస్తున్నాను.

---

# నిలువెత్తు నిరాడంబరతకు భారతరత్న

కేంద్ర ప్రభుత్వం కర్పూరి ఠాకూర్‌కు ఆలస్యంగా అయినా భారతరత్న అవార్డు ప్రకటించింది. పేద వర్గాలకు ఎనలేని సేవలందించిన బీహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌ను ఆయన చనిపోయిన 35ఏళ్ళ తరువాత కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డుకు ఎంపిక చేయటం హర్షణీయం. అదేవిధంగా తెలుగుజాతికి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వటం సముచితంగా ఉంటుంది.

కర్పూరి ఠాకూర్ సోషలిస్టు పార్టీ నాయకుడు. రామ్ మనోహర్ లోహియా శిష్యుడిగా రాజకీయాల్లో ప్రవేశించారు. భారతీయ క్రాంతిదళ్, స్వతంత్ర పార్టీ, హర్యానా విచార్ మంచ్, బిజూ పట్నాయక్ ప్రగతి పార్టీ, బలరాజ్ మదోక్ తదితర పార్టీలు 1974లో లోక్‌దళ్‌గా మారాయి. 1977 ఎన్నికల ముందు ఇది జనతా పార్టీగా రూపాంతరం చెందింది. 1977 జూన్ 24న కర్పూరి ఠాకూర్ రెండోసారి బిహార్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతకుముందు 1970 డిసెంబర్ 22 నుంచి 1972 జూన్ 24 వరకు మొదటిసారి బిహార్ సీఎంగా పని చేశారు. లోక్‌దళ్, జనతాగా మారిన తరువాత ఠాకూర్ రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అప్పట్లో లోక్‌దళ్ వర్గీయులు జనతా హయాంలో బీసీలు ముగ్గురు కర్పూరి ఠాకూర్ (బిహార్), రామ్ నరేష్ యాదవ్ (ఉత్తరప్రదేశ్), దేవిలాల్ (హర్యానా) ముఖ్యమంత్రులయ్యారు. ఈ ముగ్గురినీ జనతా హయాంలో పదవుల నుంచి తొలగించారు. చరణ్ సింగ్ వర్గీయులుగా ముద్రవేసి వీరిని పదవుల నుంచి దించారు. ఇది చిలికి చిలికి గాలివానగా మారి కేంద్రంలో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం కూలిపోవటానికి దారితీసింది. బిహార్ సీఎంగా కర్పూరి ఠాకూర్ పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంస్కరణలు అమలు చేశారు. బీసీలకు రిజర్వేషన్లను పెంచారు. మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టారు. సామాజిక న్యాయం కోసం పరితపించారు.



పాట్నాలో జయప్రకాష్ నారాయణ జన్మదిన వేడుకలకు కర్పూరి ఠాకూర్ చింపిరిబట్టలతో హాజరయ్యారు. దీనిని గమనించిన చంద్రశేఖర్ 'వాడికి బట్టలు కొనడానికి చందాలివ్వండి' అంటూ వ్యాఖ్యానించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని కర్పూరి ఠాకూర్ 'దాతలు చందాలివ్వండి' అంటూ జోలె పట్టారు. వచ్చిన డబ్బును అందరిముందూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేశారు.

కర్పూరి ఠాకూర్ కులరీత్యా నాయిబ్రాహ్మణులు. ఆయన తండ్రి 85 ఏళ్ళ వయసులో కుమారుడు సీఎంగా ఉండగానే ముతక బట్టలతో వృత్తిని కొనసాగించారు. మీరు ఇంకా ఈ వృత్తిలో కొనసాగటం ఏమిటని అనేక మంది ప్రశ్నించేవారు. కుమారుడు ఏ స్థాయిలో వున్నారో తెలియని తండ్రి 'వాడు జులాయ్‌గా తిరుగుతున్నాడు, మా పని మానుకొంటే ఎట్లా!' అని ప్రశ్నించేవారని మిత్రులు చెబుతుంటారు. బిహార్‌లోని సమస్తపూర్ జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోని పీతాంజియ అనే గ్రామంలో కర్పూరి ఠాకూర్ జన్మించారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా ఐఏయస్ అధికారిగా ఉన్న సమయంలో కర్పూరి ఠాకూర్ వద్ద కార్యదర్శిగా పని చేశారు. బీహార్ కాడర్‌కు చెందిన యశ్వంత్‌సిన్హా ఐఏయస్ అధికారిగా సొంత రాష్ట్రానికి వెళతానని దరఖాస్తు చేశారు. బిహార్ కేడర్‌లో ఉన్న యశ్వంత్‌సిన్హా 1977 లోక్‌సభ ఎన్నికల తరువాత కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న జగన్నాథ మిశ్రా యశ్వంత్‌సిన్హాను బిహార్ పశుసంవర్ధక శాఖ కమిషనర్‌గా నియమించారు. జూన్ 1977 ఎన్నికల తరువాత కర్పూరి ఠాకూర్ అధికారంలోకి వచ్చారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చరణ్‌సింగ్ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు యశ్వంత్ సిన్హాను కార్యదర్శిగా నియమించారు. యశ్వంత్ సిన్హా ఠాకూర్ స్వగ్రామం వెళితే అక్కడ పూరి గుడిసెలో కట్టెల పొయ్యి మీద టీ కాసి ఇచ్చారు. ముఖ్యమంత్రి సతీమణి పూరి గుడిసెలో ఉండటాన్ని చూసి సిన్హా కన్నీరు పెట్టారు. కర్పూరి ఠాకూర్ అంతటి నిరాడంబర జీవితాన్ని గడిపారు.

ఏపీ యువలోక్‌దళ్ బాధ్యతలు నిర్వహించిన నేను కర్పూరి ఠాకూర్‌తో కలిసి పనిచేశాను. జాతీయ స్థాయిలో లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్‌కుమార్, రామ్‌విలాస్ పాశ్వాన్, ములాయంసింగ్ యాదవ్ వంటి అప్పటి యువనేతలు కర్పూరి ఠాకూర్ శిష్యులుగా తెరపైకొచ్చారు. ఓబీసీల ప్రయోజనాల కోసం ఠాకూర్ అప్పట్లో మంగీలాల్ కమిషన్‌ను నియమించారు. ఇది తరువాత మండల్ కమిషన్‌గా మారింది. ఢిల్లీలోని బిహార్ భవన్‌లో ఒకసారి జనతాపార్టీ ఉన్నతస్థాయి నేతల సమావేశం జరిగింది. సమావేశంలో ఏపీ నుంచి గౌతు లచ్చన్న, నేను హాజరయ్యాం. కర్పూరి ఠాకూర్ కింద పడుకొంటారు. దీంతో ఆ రాత్రి లచ్చన్న అక్కడ బస చేయటానికి మంచం లేక అతిథి గృహానికి వెళ్ళారు. అప్పట్లో జరిగిన జాతీయ భద్రతా మండలి సమావేశంలో బిహార్ ప్రజలు కష్టపడి పని చేయరని, కష్టపడి పనిచేసే రాష్ట్రాలు, ప్రజలతో సమానంగా బిహార్, పేదరాష్ట్రాలకు నిధులు ఇవ్వవద్దని కొంతమంది ఇతర రాష్ట్రాల అధికారులు కేంద్రం దృష్టికి తెచ్చారు. తొలిరోజు ఈ చర్చ జరిగిన తరువాత కర్పూరి ఠాకూర్ సమావేశం నుంచి అర్థాంతరంగా మాయమయ్యారు. తరువాత బండెడు పుస్తకాలతో సమావేశానికి హాజరయ్యారు. 'బ్రిటీషు వారి హయాంలో వారితో సఖ్యతగా ఉండి కొన్ని రాష్ట్రాలలో నీటి ప్రాజెక్టులు, రైల్వే, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచుకొన్నారు. దాంతో అక్కడ ప్రజలు కష్టపడే విధానం వచ్చింది. కొన్ని రాష్ట్రాలలో ఆ విధానం లేకపోవటంతో అభివృద్ధి చెందలేదు. దీంతో పేదరికం తొలగలేదు.' అంటూ దానికి సంబంధించిన డాక్యుమెంట్లను సమావేశంలో ప్రవేశపెట్టారు. సమావేశంలో మాట్లాడిన ఐఏయస్ అధికారులు వారి సొంత రాష్ట్రాల్లో పని చేస్తే వాస్తవాలు తెలుస్తాయంటూ కర్పూరి ఠాకూర్ వారి వాదనలను దీటుగా తిప్పికొట్టారు. పాట్నాలో జయప్రకాష్ నారాయణ జన్మదిన వేడుకలకు కర్పూరి ఠాకూర్ చింపిరిబట్టలతో హాజరయ్యారు. దీనిని గమనించిన చంద్రశేఖర్ 'అరె వాడికి బట్టలు కొంటానికి చందాలివ్వండి' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ఆయన 'దాతలు చందాలివ్వండి' అంటూ జోలె పట్టారు. వచ్చిన డబ్బును అందరిముందూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేశారు.

క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్య ఉద్యమం, ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న కర్పూరి ఠాకూర్ నీతివంతమైన రాజకీయాలతో కొనసాగారు. పేద, బలహీన వర్గాలకు చెందిన ఠాకూర్ కుటుంబానికి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. జాతీయ స్థాయిలో బీసీల సంక్షేమానికి, రిజర్వేషన్లకోసం అనేక పోరాటాలు చేసిన కర్పూరి ఠాకూర్ 1987లో చనిపోయారు. ఆయన చనిపోయిన 35 ఏళ్ళ తరువాత కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించటం హర్షణీయం.

• డాక్టర్ యలమంచిలి శివాజి


---

## విరసం మహాసభలు

ఫాసిస్టు సందర్భంలో రాజ్యాంగ పరిరక్షణ ఒక ప్రజాస్వామిక ఆకాంక్షగా ముందుకు వచ్చింది. 'భారత ప్రజలమైన మేము' అని మొదలయ్యే రాజ్యాంగం ఆచరణలో ఆ ప్రజల జీవితాన్ని మార్చలేకపోయింది. ప్రజా ప్రాతినిధ్య రూపంలో పని చేసే భారత రాజ్యం మీద దళారీ బూర్జువావర్గం శాసన అధికారాన్ని నెలకొల్పుకోడానికి రాజ్యాంగం అవసరమైంది. అదే సమయంలో గత డెబై[illegible]ళ్లలో పీడిత ప్రజల జీవితం కొంత మెరుగుపడటంలో రాజ్యాంగం పాత్ర ఉన్నది. పాతికేళ్లుగా అన్ని స్థాయిల్లో రాజ్యాంగ ఆదర్శాలు దెబ్బతినిపోతున్న సందర్భంలోనే పీడిత కులాల్లో, మత మైనారిటీల్లో, ఆదివాసుల్లో రాజ్యాంగ చైతన్యం పెరిగింది. దానికి వ్యతిరేకంగా కూడా ఫాసిస్టు శక్తులు రాజ్యాంగ విధ్వంసానికి పాల్పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగ పరిరక్షణ ఒక బలమైన వ్యక్తీకరణగా మారింది. అదే సమయంలో ఈ రాజ్యాంగ పరిరక్షణ ఆకాంక్ష నుంచి రాజ్యాంగ సర్వస్వవాదం తలెత్తింది. రాజ్యాంగంలో నిరంకుశ పాలకవర్గ ప్రయోజనాలకు రక్షణ కవచంగా ఎన్నో అంశాలు ఉన్నాయనే వాస్తవిక దృష్టి అడుగంటిపోతున్నది. ఆధునికతా వికాసంలో భాగంగా చట్టబద్ధ పాలన అనే ప్రగతిశీల అంశం వచ్చిందని గుర్తించి, దాని అమలు కోసం కృషి చేస్తూనే రాజ్యాంగం మీద విమర్శనాత్మక వైఖరిని ప్రదర్శించాలి. ఇది ఎంత లోపిస్తే అంతగా రాజ్యాంగవాద భావజాలం ప్రబలుతుంది. ఈ దృష్ట్యా జనవరి 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న విప్లవ రచయితల సంఘం 29వ మహాసభలు 'ఫాసిస్టు సందర్భంలో రాజ్యాంగవాదం' అన్న ఇతివృత్తంతో సాగుతాయి. ఈ మహాసభల ప్రారంభోపన్యాసం– సిద్దిఖీ కప్పన్ (ప్రముఖ పాత్రికేయుడు, కేరళ) చేస్తారు; ఆహ్వానోపన్యాసం– గుంటూరు లక్ష్మీనరసయ్య (ప్రముఖ సాహిత్య విమర్శకుడు) చేస్తారు; కీ నోట్– వరలక్ష్మి ఇస్తారు; ఇంకా అరసవిల్లి కృష్ణ, రివేరా, అల్లం రాజయ్య, ప్రొ. హరగోపాల్, కళ్యాణరావు, పాణి తదితరులు మాట్లాడతారు.

– విరసం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





బాపూ మ్యూజియంలో లేజర్ షో

# జనగణమన

## ఘనంగా గణతంత్ర దినోత్సవం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



రెండోస్థానం పొందిన ఆరోగ్యశ్రీ శకటం



మూడో స్థానంలో నిలిచిన సచివాలయాల శకటం



వేడుకల్లో పాల్గొన్న సీఎం జగన్

జాతీయ పతాకం జనకెరటమైంది. జయహో.. నినాదం విజయగీతిక పలికింది. ఎల్లడెలా దేశభక్తి రెపరెపలాడింది. ఊర్లు, వాడలు స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చాయి. వీధుల్లో జాతీయ జెండాలు వినువీధిని తాకాయి. ఆసేతు హిమాచలానికి స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్ని వర్గాలవారు మువ్వన్నెల పతాకాలను ఎగురవేశారు. మహోజ్వలంగా సాగిన నాటి స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుండి నడిపిన మన జిల్లా నేతలను స్మరిస్తూ సెల్యూట్ చేశారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొనగా, కలెక్టరేట్‌లో కలెక్టర్ ఢిల్లీరావు జాతీయ జెండా ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు దేశభక్తిని రగల్చగా, ప్రభుత్వ శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజాసేవలో పునరంకితమైన ప్రభుత్వ అధికారులను ప్రశంసాపత్రాలు వరించాయి.



75 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



ఇందిరాగాంధీ స్టేడియంలో మువ్వన్నెల రెపరెపలు



జాతీయ పతాకాలతో చిన్నారుల స్కేటింగ్

## జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి

గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఢిల్లీరావు



జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కృష్ణలంక) : ఎన్టీఆర్ జిల్లా ప్రగతికి సమష్టిగా కృషి చేద్దామంటూ కలెక్టర్ ఢిల్లీరావు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన 75వ గణతంత్ర దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేశారు. అనంతరం విజయవాడ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీసీపీ వి.అజిత, సబ్ కలెక్టర్ అదితిసింగ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ దేశ పౌరులుగా హక్కులను అనుభవించడంతో పాటు విధులు, బాధ్యతల విషయంలో నిబద్ధతతో వ్యవహరిస్తూ జిల్లా, రాష్ట్రం, దేశ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. అభివృద్ధి చెందిన దేశం భారత్ అని మన పిల్లలు సగర్వంగా చెప్పుకొనేలా, రాసుకునేలా చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# సీట్లు.. పాట్లు..



చంద్రబాబు వద్దకు క్యూ కడుతున్న వైసీపీ సిటింగ్‌లు

'సీటు వస్తుందా.. రాదా..' రెండు జిల్లాల వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల మదిలో మెదులుతున్న మాట ఇది. సీటు ఓకే చేస్తే సరి.. లేదంటే టీడీపీ-జనసేన వైపే వెళ్లాలని తెగ మదనపడిపోతున్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు అధినేత చంద్రబాబుకు టచ్‌లో ఉండగా, వారందరికీ సీట్లు ఎక్కడ సర్దుబాటు చేయాలనేది పెద్ద ఫజిల్‌గానే మారింది. ఇక వైసీపీలో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. సిటింగ్‌లంతా పక్క చూపులు చూస్తుంటే, అసలు అభ్యర్థులే కరువయ్యే దుస్థితి నెలకొంది.

## టీడీపీలో పోటీ.. వైసీపీలో అభ్యర్థులు కావలెను..

- సర్దుబాటు చేయలేక టీడీపీ పెద్దలు సతమతం
- పెనమలూరు ఎమ్మెల్యే సారథికి నూజివీడులో అవకాశం
- క్యూలో మరో ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు
- సీటు ఖరారు చేసిన మరుక్షణం జంప్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైనాట్ 175.. అంటూ హడావుడి చేసిన వైసీపీ ఇప్పుడు అభ్యర్థుల కోసం వెతుకులాడుకోవాల్సిన పరిస్థితికి చేరింది. టీడీపీ తరఫున పోటీ చేసేందుకు సరైన అభ్యర్థులు కూడా లేరంటూ నిన్నటి వరకు వైసీపీ నాయకులు విమర్శలు చేయగా, నేడు అదే టీడీపీ టికెట్ కోసం వైసీపీ ఎమ్మెల్యేలే క్యూ కడుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సీట్లను సర్దుబాటు చేయలేక టీడీపీ పెద్దలు సతమతమవుతుంటే, వైసీపీలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ, జనసేన నడుమ పొత్తు ఉండటంతో ఒక్కో సీటుకు టికెట్ ఆశించే ఆశావహుల జాబితా రోజురోజుకు పెరిగిపోతోంది. పొత్తులో భాగంగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి మూడు లేదా నాలుగు అసెంబ్లీ స్థానాలను, ఒక ఎంపీ స్థానాన్ని జనసేనకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

### ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ, జనసేన నుంచి టికెట్లు ఆశించే వారి సంఖ్య కృష్ణాజిల్లాలో కంటే ఎక్కువగా ఉంది. వైసీపీ నుంచి పలువురు ఎమ్మెల్యేలు టీడీపీలోకి క్యూ కడుతుండటంతో ఇక్కడ టికెట్ల సర్దుబాటు టీడీపీ, జనసేన పెద్దలకు తలనొప్పిగా తయారైంది. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు ఎవరికీ అధికారికంగా టికెట్ ఖరారు చేయలేదు. అయితే, మైలవరం నుంచి దేవినేని ఉమా, సెంట్రల్ నుంచి బొండా ఉమా, తూర్పు నుంచి గద్దె రామ్మోహన్, నందిగామ నుంచి తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట నుంచి శ్రీరాం తాతయ్యకు దాదాపు టికెట్ ఖరారైనట్టే. పశ్చిమ నుంచి టీడీపీ తరఫున జలీల్‌ఖాన్‌తో పాటు పలువురు నేతలు పోటీపడుతున్నారు. జనసేన నుంచి పోతిన మహేశ్, బాడిత శేఖర్ రేసులో

- మిగతా 6లో

### కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో గుడివాడ, గన్నవరం స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులు ఖరారు కాగా, మిగిలిన ఐదు స్థానాల్లో మచిలీపట్నం నుంచి కొల్లు రవీంద్రకు టికెట్ దాదాపు ఖరారైనట్టే. పెడన, అవనిగడ్డ, పెనమలూరు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. పెడన నుంచి టీడీపీ తరఫున కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ టికెట్ రేసులో ఉన్నారు. అవనిగడ్డ నుంచి సీనియర్ నాయకుడు మండలి బుద్ధప్రసాద్ రేసులో ఉండగా, ఈ రెండు స్థానాల నుంచి జనసేన నుంచి కూడా పలువురు ఆశావహులు టికెట్ ఆశిస్తున్నారు. ఇక పెనమలూరు నియోజకవర్గానిది ప్రత్యేక పరిస్థితి. నిన్నటి వరకు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న కె.పార్థసారథి ఇదే స్థానం నుంచి టీడీపీ టికెట్ ఆశించారు. అయితే, సారథికి నూజివీడు స్థానాన్ని ఖరారు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును బుధవారం రాత్రి సారథి హైదరాబాద్‌లో కలిశారు. ఆ సమయంలో నూజివీడుపై సారథికి స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. దీంతో పెనమలూరులో బోడె ప్రసాద్‌కు లైన్‌క్లియర్ అయినట్టే. కాగా, ఎన్టీఆర్ జిల్లాలో స్థానాల సర్దుబాటు ప్రభావం కృష్ణాజిల్లాలో ఉన్న ఈ స్థానంపై పడే అవకాశాలున్నాయి. పామర్రు నుంచి వర్ల కుమార్‌రాజా రేసులో ఉన్నా చివరి నిమిషంలో మార్పులు చేర్పులకు అవకాశం లేకపోలేదు.



జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాల అంశం వీఆర్వోల మెడకు చుట్టుకుంది. డిజిగ్నేటెడ్ అధికారాలున్న తహసీల్దార్లను కాదని.. వీఆర్వోలే ఈ రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం మెలికపెట్టింది. అంతటితో ఆగకుండా వీఆర్వోలు తమ ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని చెప్పడంతో అసలు సమస్య ఏర్పడింది. వ్యక్తిగత వివరాలు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో తాము ఇబ్బందులు పడతామని వీఆర్వోలు తలలు పట్టుకుని కూర్చున్నారు.

# వీఆర్వోలపై ఉచ్చు

## నేటి నుంచి జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

- తహసీల్దార్లు కాకుండా వీఆర్వోలకు బాధ్యతలు
- వ్యక్తిగత సమాచారం ఇవ్వాలని ఆదేశాలు
- అలా అయితే, తమకు ఇబ్బందంటున్న వీఆర్వోలు
- టౌన్ నెంబర్ల ప్రాతిపదికన అధికారాలివ్వాలని డిమాండ్

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీల్లో ఇళ్లు ఇచ్చిన వారికి శనివారం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఈ ప్రక్రియ ఏమో గానీ, గ్రామ రెవెన్యూ అధికారులకు (వీఆర్వోలు) మాత్రం కంటి మీద కునుకు లేకుండాపోయింది. రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో డిజిగ్నేటెడ్ అధికారులుగా ఉండాల్సిన తహసీల్దార్లను కాదని, వీఆర్వోలను అనధికారికంగా నియమించారు. వీఆర్వోలను డిజిగ్నేటెడ్ అధికారులను చేయటం ఒక ఎత్తయితే, వారి ఆధార్, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని కోరటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### సందేహాలు అనేకం

రిజిస్ట్రేషన్లు చేయాల్సిన వీఆర్వోలంతా తక్షణం తమ ఆధార్ కార్డులతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని నిర్దేశించారు. అయితే, ఇలా వ్యక్తిగత సమాచారాన్ని కోరటం వల్ల సమస్యలొస్తాయని వీఆర్వోలు భయపడుతున్నారు. ప్రైవేటుగా రిజిస్ట్రేషన్లు చేసిన వారి జాబితాలో తాము కూడా చేరతామని ఆందోళన చెందుతున్నారు. ఒక్కో వీఆర్వో పరిధిలో సగటున 1,100 మంది జగనన్న ఇళ్ల లబ్ధిదారులుంటారు. ఈ విధానంలో

- మిగతా 6లో

## ఎక్కడి సమస్యలు అక్కడే..!

- ప్రధాన కాలువలు, డ్రెయిన్‌లలో పూడికతీత పనులు శూన్యం
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఆఖరు సమావేశం

- 6లో..



# మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

- మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా బాపిరాజు
- తాడిగడపకు వెంకటేశ్వరరావు, గుడివాడకు శ్రీకాంత్‌రెడ్డి

(విజయవాడ- ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.చంద్రయ్యను బదిలీ చేసి, ఆయన స్థానంలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీవీఎస్ బాపిరాజును నియమించారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.సూర్యప్రకాశరావును మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీకి అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును నియమించారు. గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామచంద్రాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. గుడివాడ మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజాం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న టీవీ కృష్ణారావు నియమితుల య్యారు. గుంటూరు జిల్లా నరసరావుపేట డివిజన్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవోగా ఉన్న జి.మల్లికార్జున రావును తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జి.లోవరాజు.. తిరువూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా ఉన్న ఎం.కృష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీఎంసీలో డిప్యూటీ కమిష నర్‌గా పనిచేస్తున్న డి.వెంకటలక్ష్మిని బదిలీచేసి అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని జి.సృజనను నియమించారు. మచిలీపట్నం అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మిని బదిలీ చేశారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ దిల్లీరావు గణతంత్ర వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందించారు. సునీత (డ్వామా పీడీ), అక్కినేని వెంకటేశ్వరరావు (ఎస్ఈ, పంచాయతీరాజ్), మోహన్‌బాబు, (డీఎస్‌వో), ఎస్‌వీ నాగేశ్వరరావు(డీఆర్వో), ఎం.పురేంద్ర (డీటీసీ), ఎస్.నాగమణెమ్మ (జిల్లా వ్యవసాయ అధికారిణి), జి.వెంకటేశ్వర్లు (జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్), సీఎస్ఎస్ఎన్ రెడ్డి (డీఈవో), పి.బాలాజీ కుమార్ (డీహెచ్‌వో), సతీష్ (కలెక్టరేట్ సీసీ), బీవీ విజయభారతి (సోషల్ వెల్ఫేర్), ఎస్‌వీ మోహనరావు (డీపీఆర్‌వో), కె.రవి (డివిజినల్ పీఆర్‌వో), సుహాసిని (డీఎంఅండ్‌హెచ్‌వో), జయచంద్ర గాంధీ (డీపీవో), జె.సుమన్ (ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్), వి.ప్రసాద్ (పీఆర్‌వో), కె.విద్యాసాగర్ (పశుసంవర్ధక శాఖ), సాయిబాబు (నందిగామ ఆర్డీవో), కేఎస్ రామారావు (దుర్గగుడి ఈవో), ఎల్.రమ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇంద్ర కీలాద్రి), కె.మాధవి (తిరువూరు ఆర్డీవో), పి.రవికుమార్ (ఆర్ఐవో)

## సీట్లు.. పాట్లు..

5వ పేజీ తరువాయి)

ఉన్నారు. తిరువూరు నుంచి శావల దేవదత్ రేసులో ఉన్నారు. అయితే, వైసీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరికి ఎక్కడ అవకాశం కల్పించాలన్న దానిపై టీడీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. వీరితో పాటు టీడీపీలో చురుగ్గా ఉంటున్న వంగవీటి రాధాకు అవకాశం కల్పించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జులుగా కొనసాగుతున్న వారిలో కొందరికి టికెట్లు లభించే పరిస్థితి లేదు.

**వైసీపీలో భిన్నమైన పరిస్థితి**

టీడీపీలో టికెట్ల కోసం విపరీతమైన పోటీ నెలకొంటే, వైసీపీలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. కృష్ణాజిల్లాలో పరిస్థితి కాస్త బాగున్నా ఎన్టీఆర్ జిల్లాలో మాత్రం అభ్యర్థుల వెతుకులాట తప్పేట్టు కనిపించడం లేదు. ఏ ఎమ్మెల్యే ఎప్పుడు పార్టీని వీడుతారో తెలియని పరిస్థితుల్లో వైసీపీ పెద్దలు ప్రత్యామ్నాయం కోసం వెతుకులాడుతున్నారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ఇప్పటికే పార్టీని వీడుతానని ప్రకటించగా, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. టీడీపీ నుంచి టికెట్ ఖరారైన మరుక్షణం వారు పార్టీని వీడటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రెండు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ కొత్త అభ్యర్థుల కోసం వెతుకులాట ప్రారంభించింది. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిపై వైసీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ఎంపీగా బరిలోకి దింపితే, అవనిగడ్డ కోసం కొత్త అభ్యర్థిని అన్వేషించాల్సి ఉంటుంది.

## వీఆర్వోలపై ఉచ్చు

5వ పేజీ తరువాయి)

అయితే వారందరికీ అదే వీఆర్వో వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసినట్టవుతుంది. ఇలా చేయటం వల్ల వీఆర్వోలకు రెండు రకాలుగా ఇబ్బందులు ఉంటాయి. భవిష్యత్తులో ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందుకునే ప్రమాదం ఉంది. వ్యక్తిగతంగా లెక్కకుమించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నందున ఆదాయపు పన్ను శాఖ దృష్టిలో భారీగా ఆస్తులు విక్రయించినట్టుగా భావించే ప్రమాదం ఉంది. ఆదాయపు పన్ను శాఖ నోటీసులు ఇస్తే చిరుద్యోగులమైన తమ పరిస్థితి ఏవిటని భయపడుతున్నారు. ఇక రెండో సమస్య. ఏదైనా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివాదం తలెత్తి కోర్టు కేసుల వరకు వెళ్తే, వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసిన వీఆర్వోలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కోర్టు కేసులకు కూడా వారే హాజరుకావాలి. బదిలీపై వేరేచోటకు వెళ్లినా కోర్టు కేసులకు హాజరు కావాల్సి ఉంటుంది.

**తహసీల్దార్లకే ఇవ్వాలి**

తహసీల్దార్లకు డిజిగ్నేటెడ్ పవర్స్ ఇవ్వడమే ఈ సమస్యకు పరిష్కారంగా ఉంది. తహసీల్దార్లు అయితే వారి టాన్ నెంబర్ల ప్రాతిపదికన ప్రభుత్వం తరఫున రిజిస్ట్రేషన్ చేస్తారు. దీంతో వ్యక్తిగతంగా వారేమీ రిజిస్ట్రేషన్ చేసినట్టుగా నమోదు కాదు. వీఆర్వోల్లో చాలామందికి టాన్ నెంబర్లు లేవు. వారందరికీ టాన్ నెంబర్లు కల్పించటం ద్వారా డిజిగ్నేటెడ్ అధికారాలు ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈ వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా వీఆర్వోలు మరింత ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో తహసీల్దార్లకు, జిల్లాస్థాయిలో డీఆర్వోలకు తమ అభ్యంతరాలను తెలియజేశారు. అయినా తమ సమస్యను వినకపోవటంతో తాజాగా రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాసినట్టు తెలుస్తోంది.

## మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

**సత్యనారాయణపురం, జనవరి 26:** భారత రాజ్యాంగాన్ని మనువాదం నుంచి కాపాడుకుంటామని సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సంయుక్త కిసాన్‌మోర్చా కేంద్రకార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు మీసాల రాజారావు వంతెన నుంచి శుక్రవారం ట్రాక్టర్, బైక్, ఆటో ర్యాలీని పడవల రేవు వరకూ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యాదర్శి యలమందరావు అధ్యక్షతన జరిగిన సభలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడతూ కేంద్రప్రభుత్వం అ నుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బంది లు పడుతున్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 16న సంయుక్త కిసాన్‌మోర్చా, కేంద్రకార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ ర్యాలీలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు, పౌర సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి సీహెచ్ బాబూరావు, గిరిజన సంఘ రాష్ట్ర నేత మంతెన సీతారాం, కౌలు రైతుల సం ఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పోలారీ, భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ భాస్కరరావు, ఏఐటీయూసీ నేతలు కిషోర్, కేవీపీఎస్ రాష్ట్రకార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

## సుబాబుల్ రైతుల ఆందోళన

**చందర్లపాడు, జనవరి 26 :** సుబాబుల్ కర్ర ధర తగ్గించటంతో ఆగ్రహించిన రైతులు కోనాయపాలెం వేబ్రిడ్జి వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. పేపరు కంపెనీలు టన్నుకు రూ.500 వంతున ధర తగ్గించటాన్ని మండలంలోని కోనాయపాలెం రైతులు తీవ్రంగా ఖండించారు. కర్ర సరఫరా ఎక్కువగా ఉందని, ధర తగ్గించటం దారుణమని అన్నారు. టన్నుకు రూ.5300 వంతున ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు అక్కడి వేబ్రిడ్జి వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని, వేబ్రిడ్జిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు గుత్తికొండ రాంబాబు పాల్గొన్నారు.

## జనం తరిమికొడతారని జగన్‌కు భయం : నెట్టెం

**విద్యాధరపురం, జనవరి 26 :** ఓటమి కాదు.. ప్రజా తిరుగుబాటు ఊహించిన సీఎం జగన్‌ను జనం తరిమి కొడతారనే భయంతో తప్పుకుంటానంటూ కథలు చెబుతున్నారని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ విమర్శించారు. శుక్రవారం విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 ఏళ్లుగా ప్రజలను దోచుకుని దాదాపు రూ.4 లక్షల కోట్లను వెనకేసుకున్నావని విమర్శించారు. కేశినేని నాని ఆయన చేతులారా తన రాజకీయ సమాధి తవ్వుకున్నాడని విమర్శించారు.

## వర్తమాన విషయాలపై అవగాహనతో విద్యార్థుల ఎదుగుదల



**పటమట, జనవరి 26 :** ప్రపంచంలో చోటుచేసుకుంటున్న రోజువారీ పరిణామాలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని బీఆర్ అంబేడ్కర్ ఓపేన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగా జోషి అన్నారు. వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలోని పాఠశాల స్థాయి విద్యార్థులకు గొల్లపూడి ఎస్పీఎస్ఆర్‌సి హైస్కూల్‌లో శుక్రవారం క్విజ్, వ్యాసరచన పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందించి, సర్టిఫికెట్లు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ, వడ్లమూడి పద్మ, రవితేజ పాల్గొన్నారు.

# ఘనతంత్రం

● వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు
● పరేడ్ గ్రౌండ్స్‌లో అబ్బుర విన్యాసాలు
● ఆకట్టుకున్న శకటాలు



విజయవాడ బాపూ మ్యూజియంలోని లేజర్ షోలో ఆకర్షణీయంగా ఎర్రకోట రూపం

మది నిండా జాతీయతా భావంతో.. ఎక్కడ చూసినా రెపరెపలాడుతున్న మువ్వన్నెల జాతీయపతాకంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. దేశం కోసం అసువులు బాసిన త్యాగమూర్తులను అధికారులు, రాజకీయ నేతలు స్మరించుకున్నారు. ఆ ఆదర్శమూర్తుల ఆశయాల సాధనకు కంకణబద్ధులవుదామని ప్రతినబూనారు. ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. వేడుకల్లో భాగంగా బందరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చిన్నారుల విన్యాసాలు అబ్బుర పరిచాయి. ఇరు జిల్లాల్లో వివిధ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి.




## పాత కక్షలతో రెచ్చిపోయారు!

● తండ్రీకొడుకులపై వైసీపీ శ్రేణుల దాడి ● సమాచారమిచ్చినా పట్టించుకోని పోలీసులు

**ఉరవకొండ, జనవరి 26 :** అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త మారెన్న, అతడి కుమారుడు శ్రీనివాసులుపై వైసీపీ వర్గీయులు శుక్రవారం దాడి చేశారు. శ్రీనివాసులు పనిమీద పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీకి వెళ్లగా.. పాతకక్షలతోపాటు.. టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం ఉరవకొండలో పర్యటించనున్న నేపథ్యంలో దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. తొలుత శ్రీనివాసులు ఒక్కరే ఉండటంతో అతడితో వైసీపీ వర్గీయులు వాగ్వాదానికి దిగారు. శ్రీనివాసులుపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న అతడి తండ్రి మారెన్న కారులో అక్కడికి చేరుకోగా.. వైసీపీ కార్యకర్తలు మరింత రెచ్చిపోయారు. కారును ధ్వంసం చేశారు. దాడిలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చినా స్పందించలేదని బాధితులు ఆరోపించారు.

స్థానికులు అడ్డుకుని టీడీపీ నాయకులను రక్షించారు. బాధితులు అక్కడి నుంచి నేరుగా పోలీసు స్టేషన్‌కు చేరుకుని, అక్కడే బైఠాయించారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసించారు. పోలీసు వాహనానికి అడ్డంగా పడుకుని, నిరసన తెలిపారు. గాయపడిన వారిని సీఐ తిమ్మయ్య ఆస్పత్రికి తరలించారు. బాధితులు మాట్లాడుతూ.. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ ఇంటిపై రాళ్ల దాడి చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

## ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

**విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) :** ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఎక్సైజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా గుడివాడ డిపోలో పనిచేస్తున్న ఎ.జయశ్రీ, టి.నాగవాణిలను తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని డిస్టిలరీ విభాగానికి బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని గొల్లపూడి డిపోలో ఉన్న వి.వైకుంఠరావును ఉభయగోదావరి జిల్లాల డిస్టలరీ విభాగానికి బదిలీ చేశారు. ఈయన స్థానంలోకి భీమవరం నుంచి ఈఎస్‌వోగా ఉన్న కె.ప్రకాశ్‌ను నియమించారు. గొల్లపూడిలోని ఈఎస్‌వోగా ఉన్న సీహెచ్ తరంగణిని చాగల్లు ఈఎస్‌వోగా బదిలీ చేశారు. నిడమానురు డిపోలో ఉన్న జె.రమేష్‌ను రాజమహేంద్ర వరం ఈఎస్‌వోగా బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కాంటినెంటల్ వైన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉన్న ఎ.పద్మజను భీమవరం బదిలీ చేశారు. పెద్దవరం క్రిక్స్ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉన్న బి.నాగభూషణంను ఉభయగోదావరి జిల్లా డిస్టిలరీ విభాగానికి బదిలీ చేశారు. ఉయ్యూరు కేసీపీ లిమిటెడ్‌లో ఉన్న ఒ.శారదను ఉభయగోదావరి జిల్లాల్లో డిస్టలరీ విభాగానికి పంపారు. గండేపల్లిలోని సెంటినీ బయోటెడ్ ప్రొడక్ట్స్‌లో ఉన్న ఒ.మాధవిని ఏలూరులోని బేవరేజస్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. విజయవాడ ఈఎస్‌వోగా ఉన్న వై.అశోక్‌కుమార్‌ను గుంటూరు జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు బదిలీ చేశారు. విజయవాడ డిస్టిలరీస్ విభాగంలో ఉన్న కె.వనజున మదనపల్లె డిపో ఈఎస్‌వోగా బదిలీ చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట డిపోలో ఉన్న పి.మహత్మరాజును గుడివాడ డిపోకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా విజిలెన్స్ విభాగంలో ఉన్న ఆర్వీ రామశివను గొల్లపూడి ఈఎస్‌వోగా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా డిపోలో ఉన్న ఎన్వీ రమేష్‌ను నిడమా నురు ఈఎస్‌వోగా, పశ్చిమగోదావరి జిల్లా చాగల్లులో ఈఎస్‌వోగా ఉన్న ఎస్.కృష్ణప్రసాద్‌ను కృష్ణా జిల్లా డిస్టిలరీ విభాగానికి పంపారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం ఆర్బోస్ బేవరేజస్‌లో ఉన్న డి.దుర్గాప్రసాద్‌ను గుడివాడ డిపోకు బదిలీ చేశారు.

## వెలంపల్లి నాకు సమ ఉజ్జీ కాదు

● ఐప్యాక్ కుతంత్రాలు తిప్పికొట్టండి

● టీడీపీ నేత బొండా ఉమా

**పాయకాపురం, జనవరి 26:** సెంట్రల్‌లో వెలంపల్లి శ్రీనివాస్ తన కు ఏ మాత్రం సమ ఉజ్జీ కాదని తనకు తానే పోటీ తప్ప తనకెవరూ పోటీలేరని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. పాయకాపురం ప్రకాష్‌నగర్ సెంటర్ వద్ద ఉన్న రవీంద్ర ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ సెంట్రల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ముందుగా ఎన్టీఆర్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు బొండా ఉమా, కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్ (చిన్ని) పూలమాల వేసి నివాళులర్పించా రు. కేశినేని చిన్ని మాట్లాడుతూ వైసీపీ నేత కేశినేని నాని చంద్రబాబు హయాంలో అభివృద్ధే జరగలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. కంచి దుర్గ, పైడి తులసి, లబ్బా దుర్గా, ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, ఎరుబోతు రమణ, పైడి శ్రీను, వైకుంఠం, దుర్గారావు, పెప్సీ ధనశేఖర్, పిరియా సోమేశ్వరరావు, బెజ్జం జైపాల్ పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి నేతల చేరిక

**విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** వైసీపీకి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యకర్తల సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వారిని పార్టీలోకి ఆహ్వానించి కాంగ్రెస్ కండువా వేశారు. వైసీపీ మైనారిటీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న షేక్ బాజీ, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలు ఫాతి మున్నీసా, మాజీ ఎమ్మెల్యే డీవై దాసు, కాంగ్రెస్ నగర కమిటీ మాజీ అధ్యక్షుడు పండూ సాహెబ్ మనవడు తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## 31 నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

**అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 31వ తేదీ నుంచి చేపట్టనున్నట్టు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. 6వ తేదీతో కౌన్సెలింగ్ పూర్తవుతుందని తెలిపింది. గతేడాది జూన్‌లో ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహించగా ఇంతకాలం కౌన్సెలింగ్ లేకుండా జాప్యం చేశారు. చివరికి కొందరు కోర్టును ఆశ్రయించడంతో స్పందించిన ప్రభుత్వం ఇప్పుడు కౌన్సెలింగ్‌కు తేదీలు ప్రకటించింది. ఏడు నెలల పాటు ఎందుకు జాప్యం చేశారో ఉన్నత విద్యాశాఖ వివరించలేదు.




● ప్రధాన కాలువలు, డ్రెయిన్‌లలో పూడికతీత పనులు శూన్యం
● జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు మృగ్యం
● అటకెక్కిన రహదారుల అభివృద్ధి
● నేడు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం
● ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఆఖరు సమావేశం

జిల్లాలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నాలుగున్నరేళ్లుగా ప్రజలు మొత్తుకుంటున్నా రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ధాన్యం కొనుగోళ్లలో చిక్కుముడులు ఇప్పటికీ వీడలేదు. ప్రభుత్వమే కొర్రీలు పెట్టి రైతులను దళారులపాలు చేస్తోంది. జగనన్న కాలనీల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇలా అన్నీ సమస్యలే. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శనివారం జడ్పీ కన్వెన్షన్ హాలులో జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలోనైనా ప్రజా సమస్యలపై చర్చ జరిగితే కొంతైనా మేలు జరుగుతుంది. జిల్లాకు చెందిన మంత్రి, శాసనసభ్యులు, ఎంపీలకు దాదాపు ఆఖరు సమావేశం కానుంది

– మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

# ఎక్కడి సమస్యలక్కడే..!

### ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం అస్తవ్యస్తంగా ఉంది. జిల్లాలో రహదారుల అభివృద్ధి, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులకు ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై ఎలాంటి చర్చ జరుగుతుందో చూడాలి. గత రెండు దఫాలుగా జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు ఏలూరు జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడంపై మాజీమంత్రి పేర్ని నాని తనదైన శైలిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

గతేడాది ఖరీఫ్‌సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 3.20 లక్షలహెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. సాగు ప్రారంభ దశలో కురిసిన భారీవర్షాల కారణంగా వెదజల్లే పద్ధతి ద్వారా నాట్లు పూర్తిచేసిన లక్ష ఎకరాలకుపైగా వరిపైరు నీటమునిగింది. ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేయకపోవడంతో దెబ్బతిన్న వరిపైరుకు పంట నష్టపరిహారం ఇవ్వలేదు. డిసెంబరులో మిచౌంగ్ తుఫాను కారణంగా కురిసిన భారీవర్షాలకు పంట దెబ్బతింది. ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలును ఆఫ్‌లైన్‌లో గత 15 రోజుల వరకు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కృష్ణాజిల్లాలోనే ఆన్‌లైన్ నింధనలను అమలుచేస్తూ, మిగిలిన జిల్లాలో ఆఫ్‌లైన్‌లో ధాన్యం తరలించేస్తున్నారని రైతులు అంటున్నారు. ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసే అంశంపై జడ్పీ సమావేశంలో ప్రశ్నించేందుకు ప్రజా ప్రతినిధులు సమాయాత్తమతున్నారు.

### ● పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

రానున్న వేసవిలో సముద్రతీర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని ఎలా ఎదుర్కొంటారనే అంశంపై అనేక అనుమానాలున్నాయి. పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 15 టీఎంలసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ వేసవిలో తాగునీటి చెరువులను నింపేందుకు నీటి విడుదల ఎప్పటికి చేస్తారనే అంశంపై స్పష్టత లేదు. మార్చి, మే నెలల్లో రెండు విడతలుగా ప్రధాన కాలువలకు నీటిని విడుదలచేస్తే తాగునీటి చెరువులను నింపేందుకు అవకాశం ఉంటుంది. నీటి లభ్యత పూర్తిస్థాయిలో లేకపోవడంతో తాగునీటి ఎద్దడి నివారణ కోసం తీసుకునే చర్యలపైనా ఈ సమావేశంలో చర్చ జరిగి సముచిత నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### ● జగనన్న కాలనీలపై చర్చ జరిగేనా?

ఉమ్మడి జిల్లాలో 1400లకుపైగా జగనన్న లేఅవుట్‌లు ఉన్నాయి. వాటిలో కనీస వసతులు లేవు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ లేఅవుట్‌లలో రహదారుల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్‌లైన్లు ఏర్పాటువంటి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఎంతమేర ఈ పనులు చేస్తారనే అంశంపైనా అనుమానాలున్నాయి. కృష్ణాడెల్టాకు నీటి విడుదలను నిలిపివేశారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల వరకు ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌ల మరమ్మతులు చేసేందుకు అవకాశం ఉంది. డ్రెయిన్‌లలో సక్రమంగా పూడిక తీయకపోవడంతో డిసెంబరు నెలలో కురిసిన భారీవర్షాలకు పొలాల్లో నీరు వారం రోజులకు పైబడి ఉండటంతో వరి పంట దెబ్బతిన్నది. ఈ సమావేశంలో ప్రధాన కాలువలు, డ్రెయిన్‌లలో పనులు చేసేందుకు అంచనాలు, నిధుల కేటాయింపుపై చర్చ జరిపి సముచిత నిర్ణయం తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 119, 127, 138 |
| చికెన్ విత్ స్కిన్ | 226 |
| చికెన్ స్కిన్‌లెస్ | 236 |
| **నెక్ కోడిగుడ్డు ధర** | |
| విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40 | |

## మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

**వన్‌టౌన్:** ముఠా పనులకు వెళడం లేదని కుటుంబసభ్యులు మందలించినందుకు మనస్తాపంతో వంశీకృష్ణ(30) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం రాణిగారితోట తమ్మిన పోతురాజు వీధిలో కుటుంబంతో ఉంటున్న దుమ్మెద్ద పైడిరాజు విశాఖపట్నంలో ఉన్న తన సోదరుడి కుమారుడు వంశీకృష్ణను దగ్గర పెట్టుకుని ముఠా పనిలో పెట్టాడు. అతను ఐదారు రోజుల నుంచి మద్యం తాగి తిరుగుతున్నాడు. పైడిరాజు తల్లి వంశీకృష్ణను మందలించింది. దీంతో మనస్తాపం చెందిన వంశీకృష్ణ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పైడిరాజు కుటుంబసభ్యులు వంశీకృష్ణను ఆర్ఎంపీకి చూపించారు. అయితే అప్పటికే వంశీకృష్ణ చనిపోయినట్లు వైద్యుడు నిర్ధారించారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వంశీకృష్ణ బంధువులను వివరాలు అడిగి తెలుసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పైడిరాజు ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

## సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

### నగరపాలక సంస్థలో ఘనంగా గణతంత్ర వేడుకలు



**చిట్టినగర్, జనవరి 26:** స్వాతంత్ర్యం సాధించుటకు ప్రాణ త్యాగాలు చేసిన సమరయోధులను స్మరించుకోవాలని, వారి స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్‌లు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్‌లు, పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి గాంధీజీ, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు కావల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. ఎంకె బేగ్, పటమట వీఎంసీ స్కూల్ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా, గాంధీజీ స్కూల్ విద్యార్థులు జాతీయ గీతాలను ఆలపించారు. అనంతరం నగరపాలక సంస్థ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 112 మంది అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు ప్రశంసాపత్రాలను అందించారు. నగరపాలక సంస్థ డెస్క్ టాప్ క్యాలెండర్ ఆవిష్కరించారు.

**జిల్లా స్థాయిలో అవార్డులందుకున్న అధికారులు, సిబ్బంది**

నగరపాలక సంస్థ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 15 మంది జిల్లా కలెక్టర్ దిల్లీరావు చేతులు మీదగా అవార్డులు అందుకున్నారు. అవార్డులందుకున్న వారిలో సర్కిల్-2 ఈఈ వీ.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఇక్బాల్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ ఎం.మాధురి, జూనియర్ అసిస్టెంట్‌లు టీ. వరుణ్‌కుమార్, టీ.వీరేంద్ర ప్రసాద్, ఎన్. జయరామకృష్ణ, మలేరియా-4 ఇన్‌స్పెక్టర్ యు.వాసు, శానిటరీ సూపర్‌వైజర్-2 కె.ఆర్. నవకిషోర్, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ డీ. వంశీకృష్ణ, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ గంపా యశ్వంత్, వార్డు శానిటేషన్ సెక్రటరీ షేక్ బాజి, సోషల్ వర్కర్ రాజేష్‌కుమార్, వాచ్‌మెన్ ఎస్.వెంకట చంద్రశేఖర్, పీ. చెన్నయ్య, ఆప్కాస్ వర్కర్ కె.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



రామ్మోహన్ గ్రంథాలయం వద్ద



స్వాతంత్ర్య సమరయోధుల భవన్ వద్ద



పైపులరోడ్డు సెంటర్ వద్ద.



పాలఫ్యాక్టరీ వద్ద



పీబీ సిద్ధార్థలో గౌరవవందనం స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్స్

# ఘనంగా గణతంత్ర వేడుకలు



టీడీపీ జిల్లా కార్యాలయంలో

**గవర్నర్‌పేట, జనవరి 26:** భారత 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం నగర ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ● నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో ప్రభుత్వ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అడ్మిన్ పోలు కిషోర్‌రెడ్డి జెండా ఎగురవేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

● ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయం వద్ద భరత మాత ఫొటోకు దండ వేసి జెండాను ఆవిష్కరించారు. ● ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం వద్ద ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు టి. జమలపూర్ణమ్మ, కార్యదర్శి నగేష్, గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.● బందరు లాకుల సెంటర్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల భవన్ వద్ద సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెజవాడ బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు మట్టా జయకర్ జెండా ఎగురవేశారు.● సూర్యారావుపేటలోని కర్నాటి రామమోహనరావు మున్సిపల్ పాఠశాల, గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ పాఠశాలల వద్ద 23వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామి జెండా ఆవిష్కరణ చేశారు.

**పాయకాపురం:** పైపులరోడ్డు సెంటర్ వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.● 58వ డివిజన్‌లో ఆజాదా ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా జాతీయ జెండా ఎగురవేసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ● 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద చర్మరోగ నివారణ సంస్థలో అసిస్టెంట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ బి. వెంకటేశ్వర్లు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాతీయ జెండా ఎగురవేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

**చిట్టినగర్:** కృష్ణా మిల్క్ యూనియన్ పాలఫ్యాక్టరీలో జరిగిన వేడుకల్లో మిల్క్ యూనియన్ ఎండీ ఈశ్వర బాబు, ఛైర్మన్ చలసాని ఆంజనేయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ● 49వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొలగాని అశోక్ ఆధ్వర్యంలో ఫ్రైజర్‌పేట ఎర్రకట్ట ప్రాంతంలో టీడీపీ నాయకులు ఎం.ఎస్ బేగ్ పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**పాతరాజరాజేశ్వరి పేట:** వించిపేట, నైజాంగేట్ సెంటర్‌లోని శ్రీవిద్యాంజలి హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

**సత్యనారాయణపురం:** ముత్యాలంపాడు ముద్రణాలయంలో ముద్రణాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్ మోహన్‌కుమార్ జెండా వందనం చేశారు. తొలుత ఎస్‌పీఎస్ఎఫ్ ఏఎస్ఐ నరసింహారావు గౌరవ వందనం చేశారు. ● సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లో 33వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు జెండా వందనం చేశారు. ● ముత్యాలంపాడు టీడీపీ కార్యాలయం వద్ద పడమటి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు పాల్గొని జెండా వందనం చేశారు.● సత్యనారాయణపురం చిత్తరంజన్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ జెండా వందనం చేశారు.

**భవానీపురం:** 41వ డివిజన్ 129 సచివాలయం వద్ద కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. **మొగల్రాజపురం:** పీబీ సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ మేకా రమేష్, చుండి వెంకటేశ్వర్లు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఎన్‌సీసీ కేడెట్‌ల కవాతును వీక్షించారు. గౌరవ వందనం స్వీకరించారు. ●వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పాఠశాలలో ముఖ్య అతిథిగా పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ● ఎన్టీయార్ జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయం గాంధీనగర్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. జాతీయ పతాకావిష్కరణ చేశారు.

**పటమట:** మారిస్ స్టెల్లా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖ గణతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ముఖ్య అతిథిగా ఎన్ఐడీఎం డైరెక్టర్ కల్నల్ పి. శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఎన్‌సీసీ, నేవీ, ఆర్మీ కేడెట్స్ నిర్వహించిన కవాతు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది.

**భారతీనగర్:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సాంకేతిక విద్యాశాఖ జేడీ వి.పద్మారావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కోర్సుల్లో వివిధ బ్రాంచ్‌ల్లో ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

**లబ్బీపేట:** ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో లబ్బీపేటలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు షేక్ వలి, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ అలీమ్, ముక్తర్ అలీ, సుభానీ తదితరులు పాల్గొన్నారు. ● సీఐటీయూ ఆధ్వర్యంలో కళానగర్‌లో జరిగిన వేడుకల్లో నాయకులు పి.పోతురాజు జాతీయ జెండా ఆవిష్కరించారు.

**విద్యాధరపురం:** ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాసం మునియ్యలు గాంధీజీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శులు గన్నె వెంకటనారాయణ ప్రసాద్, కనకాచారి, కార్పొరేటర్ ఉషారాణి పాల్గొన్నారు.

● మొగల్రాజపురంలోని టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ కార్యాలయంలో కేశినేని చిన్ని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ● విజయవాడ పండిట్ నెహ్రూబస్టేషన్‌లోని ఆర్టీసీ హౌస్ ఆవరణంలో జరిగిన వేడుకల్లో రవాణా శాఖ ప్రధాన కార్యదర్శి, ఏపీపీటీడీ ఇన్‌చార్జి కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రగతిలో భాగస్వాములైన 24 మంది ప్రతిభను గుర్తించి ప్రశంసించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రం, క్యాష్ అవార్డులు అందజేశారు. ● పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు.

**వన్‌టౌన్:** స్థానిక జెండాచెట్టు సమీపంలోని పశ్చిమ టీడీపీ కార్యాలయంలో సీనియర్ పార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, గణపతిరావు రోడ్డులోని ఇందాద్‌ఘర్ టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు ఫతావుల్లా ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కొత్తపేటలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన మహేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.కేబీఎన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు జాతీయ జెండాను ఆవిష్కరించి ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో కళాశాల ప్రెసిడెంట్ చలువాది మల్లికార్జునరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

### అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో..



**పటమట :** జగన్‌కు రాజ్యాంగం మీద, చట్టం మీద ఎటువంటి గౌరవం లేదని ప్రజాస్వామ్యం అంటే అసలు విలువే లేకుండా, న్యాయ స్థానాలు కూడా తన మాట వినాలనేలా జగన్ ఒంటెద్దు పోకడలు పోతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గద్దె ఆధ్వర్యంలో 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖలీక్ ఆవిష్కరించి, గాంధీజీ చిత్రపటానికి నూలు దండవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ వచ్చే గణతంత్ర దినోత్సవం నాటికి ఆంధ్రరాష్ట్రంలో మార్పులు జరగాలని, రాష్ట్రం బాగుపడాలని ఆకాంక్షించారు.









ఎన్టీఆర్ కాలనీలో, కేశినేని శివనాథ్ కార్యాలయంలో, బస్టేషన్ ప్రాంగణంలో

## జగన్ పాలనకు చరమగీతం పాడాలి: బొండా ఉమా

**సత్యనారాయణపురం, జనవరి 26:** వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 27వ డివిజన్ గులాబితోట అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద నుంచి శుక్రవారం సాయంత్రం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు, ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టాలు అడిగి తెలుసుకొని ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం మాత్రమే మిగిలి ఉందని, టీడీపీ ప్రవేశపెట్టే పథకాలను ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లి జగన్మోహనరెడ్డి పాలనకు చరమగీతం పాడాలని, వైసీపీని బంగాళాఖాతంలో కలిపే సమయం దగ్గరకు వచ్చిందన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎన్. సాంబశివరావు, స్థానిక టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

**పాతరాజరాజేశ్వరి పేట:** స్థానిక 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరి పేటలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ సారధ్యంలో ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, వైసీపీ నాయకులు చేసిన తప్పులకు శిక్ష పడటం ఖాయమని అన్నారు. నాయకులు ధనేకుల వెంకట సుబ్బారావు, ఎస్. సురేష్, పి. శ్యామ్ సుందర్, ధనేకుల హరికృష్ణ, ఎస్కే బడేషా, కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యాధరపురం:** 40వ డివిజన్ పరిధి భవానీపురం కోళ్ళఫారం రోడ్డులో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పి.వి చిన్నసుబ్బయ్య డివిజన్ నాయకులతో కలిసి బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన పనులను, యువతకు కల్పించిన ఉద్యోగాలు గురించి ప్రజలకు వివరించారు. డివిజన్ సెక్రటరీ జి.గణేష్, బూత్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, నాయకులు జె.ప్రసాద్, జి.సురేష్, ఏ వంశీకృష్ణ, ఏ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం రాజీవ్‌నగర్‌లో నిరసన

**పాయకాపురం, జనవరి 26:** నగరంలో మద్యం ఏరులైపారుతోందని నీటి సరఫరా మాత్రం కుదించబడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. పాయకాపురం ప్రాంతంలో గత 15 రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి ఉండటంపై శుక్రవారం రాజీవ్‌నగర్ సెంటర్‌లో ఆ పార్టీ నేతలు నిరసన చేపట్టారు. స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నగరంలో తీవ్రనీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రజా ప్రతినిధులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన విషయం తెలుసుకున్న మంచినీటి విభాగపు డిఈ అక్కడికి చేరుకుని రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన దీక్షను విరమించారు. నేతలు కె. దుర్గారావు, రమణారావు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

**కృష్ణలంక, జనవరి 26:** ఫార్చ్యూన్ మురళి పార్క్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకుతో కలిసి ఏపీ చాంబర్స్ ఫార్చ్యూన్ మురళీ హోటల్‌లో శుక్రవారం మహిళలకు రక్తదానం, బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్ష (కాంటాక్ట్ థర్మోస్కోపీ)ను ఉపయోగించి కేన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఏపీ చాంబర్స్ మాజీ అధ్యక్షుడు ముత్తవరపు మురళి ప్రారంభించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో మహిళలు బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం ముందుకొచ్చారు. ఈ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాంబర్స్ ఆఫీస్ బేరర్లు పొట్లూరి భాస్కరరావు, బి.రాజశేఖర్, అక్కయ్య నాయుడు, కె.వి.చౌదరి, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ ఎండీ డాక్టర్ సుమన, ఇతర చాంబర్ సభ్యులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడు

### నాలుగు గంటల్లో తల్లిదండ్రులకు అప్పగింత

**వన్‌టౌన్, జనవరి 26:** తండ్రి వెంట జిరాక్స్ షాపు వద్దకు వెళ్లిన బాలుడు తప్పిపోయిన గంటలోనే గవర్నరుపేట పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు అప్పగించి సంఘటన శుక్రవారం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగి పుట్టు మండలం వనవసింగి గ్రామాలకు చెందిన పాంగి సరోజిని భర్త, నాలుగేళ్ల కుమారుడితో కలిసి శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చింది. ఆమె అరకు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చింది. పేపర్లు జిరాక్స్ తీయించడానికి ఆమె భర్త సమీపంలో ఉన్న షాపు వద్దకు వెళ్లాడు. అతని వెంట కుమారుడు విశ్వవిజేత్(4) కూడా వెళ్లాడు. అయితే బాలుడు ఆడుకుంటూ తప్పిపోయాడు. బాలుడు తల్లిదండ్రులు స్థానికుల సహాయంతో గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రమీలా ఆధ్వర్యంలో మూడు టీంలు బాలుడి కోసం వెతికారు. కాంగ్రెస్ కార్యాలయం రోడ్డు నుంచి ఒంటరిగా ఏలూరు రోడ్డు విజయటాకీస్ వరకు బాలుడి వెళ్లినట్లు సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రమీల తన సిబ్బందితో అక్కడకు వెళ్లి బాలుడిని స్టేషన్ వద్దకు తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## చిన్నారులకు బిస్కెట్లు, దుప్పట్లు పంపిణీ

**కృష్ణలంక, జనవరి 26 :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కృష్ణలంక నిర్మలా శిశుభవన్‌లోని చిన్నారులకు ఎక్స్ పారామిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దుప్పట్లు, టవల్స్, స్టీలు పళ్లాలు, గ్లాసులు, ఫ్లోర్‌క్లీనింగ్, హ్యాండ్‌వాష్‌కి సంబంధించిన లిక్విడ్‌లు, పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులు సిహెచ్ ఏడుకొండలు, దేవసహాయం, చంద్రకుమార్, జి.వెంకటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, కె.ఎల్.రావు, దుర్గారావు పాల్గొన్నారు.

## పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిపై కేసు

**చిట్టినగర్, జనవరి 26:** యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన యువతి (19)కి అదే ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్‌తో పరిచయం ఉంది. పెళ్లి చేసుకుంటానని రామవరప్పాడు ప్రాంతానికి రమ్మని బాణావత్ దుర్గాప్రసాద్ గురువారం ఉదయం యువతికి ఫోన్ చేయటంతో ఆమె వెళ్లింది. దుర్గాప్రసాద్ ఆ యువతిని హోటల్ రూమ్‌కు తీసుకెళ్లి మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె పెళ్లి చేసుకోమని అడుగగా ముఖం చాటేశాడు. దీంతో ఆ యువతి జరిగిన విషయం తల్లితో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మహిళను తీసుకొస్తామని మోసగించిన మధ్యవర్తిపై కేసు

**అజిత్‌సింగ్‌నగర్, జనవరి 26 :** మస్కట్‌లో ఉన్న మహిళను తిరిగి తీసుకువస్తామని నమ్మించి మోసగించిన మధ్యవర్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ ప్రాంతానికి చెందిన నాగమణి మస్కట్ వెళ్లింది. అక్కడి పరిస్థితులు బాగోక పోవడంతో తిరిగి వచ్చేందుకు చేసిన ప్రయత్నం విఫలమయింది. నాగ మణిని మస్కట్ పంపిన బుడమేరు మధ్యకట్ట ప్రాంతానికి చెందిన సునీతను సంప్రదించగా ఆమె ఏర్పాట్లు చేయిస్తానని నమ్మబలికింది. ఆమెను నమ్మి రూ. లక్ష ముట్టజెప్పారు. ఎంతకీ మహిళను తీసుకు రాకపోవడం, సమాధానం సరిగ్గా చెప్పకపోవడంతో మోసపోయామని గ్రహించి నాగమణి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నోట్ పుస్తకాలు పంపిణీ

**చిట్టినగర్, జనవరి 26:** టీడీపీ 49వ డివిజన్ అధ్యక్షుడు కొలగాని అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ మంత్రి ఎంకె బేగ్ వర్థంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఎస్ బేగ్ తండ్రి ఎంకే బేగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. బెవర సురేష్, కత్తెర సురేష్, పాణిక వెంకట్రావ్, బూర కనకారావు, మక్కెన భాస్కరరావు, నమ్మి భాను పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 27 జనవరి 2024
cinema@andhrajyothy.com



# విభిన్న కోణాల్లో మాస్ మహారాజా

గణతంత్రదినోత్సవ సందర్భంగా రవితేజ నటించిన రెండు సినిమాలకు చెందిన ప్రమోషన్స్ విడుదలయ్యాయి. ఈ రెండు సినిమాల్లో ఒకటి హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్'కాగా, రెండోది కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొంది, ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్'. ఈ రెండు సినిమాలకూ నిర్మాత ఒకరే కావడం విశేషం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ ఈ చిత్రాలను నిరిస్తున్నారు. ఇక 'మిస్టర్ బచ్చన్' విషయానికొస్తే.. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేయగా, ఆ పోస్టర్‌లో రవితేజా బ్లూ షర్ట్, బ్యాగీ ప్యాంట్లో వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నారు. రవితేజతో పాటు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్న బిల్డింగులు, కార్లు ఎయిటీస్, నైన్‌టీస్ నాటి వాతావరణాన్ని తలపిస్తున్నాయి. 'నామ్ తో సనా హోగా' అనే ట్యాగ్‌తో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్'లో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. షూటింగ్ ప్రస్తుతం కారంపూడిలో జరుగుతోంది. మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్. 'ఈగల్' విషయానికొస్తే.. దావ్‌జాంద్ స్వరపరిచిన 'ఈగల్స్ ఆన్ హిస్ వే..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రవితేజ పోషిస్తున్న సహదేవ్ పాత్ర వైల్డ్ నేచర్‌ని పాట రాసిన జార్జినా మాథ్యూ సాహిత్యం అద్దంపడుతోంది. తనే స్వయంగా ఆలపించడం విశేషం. ఈ పాట విజువల్స్ రవితేజ కిల్లర్ అవతార్‌ని చూపిస్తున్నాయి. రవితేజ విభిన్నకోణాలున్న పాత్రను ఇందులో పోషించారని దర్శకుడు చెబుతున్నారు. అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రంలో నవదీప్, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ఎలా ఊహించారో అలాగే చూపించారు..

'నా కెరీర్‌లో ఇంత త్వరగా ఇంతటి గొప్ప పాత్ర దొరుకుతుందని నేను ఊహించలేదు. థ్యాంక్యూ అరుణ్‌మాథేశ్వరన్ సార్.' అంటూ ఆనందం వెలిబుచ్చారు ప్రియాంక అరుళ్‌మోహన్. ఇటీవలే విడుదలైన 'కెప్టెన్ మిల్లర్‌'లో వేల్‌మతి పాత్రలో అద్భుతంగా నటించారు ప్రియాంక. స్వతహాగా అందగత్తె అయిన తను, ఇందులో డీగ్లామరైజ్డ్ పాత్ర పోషించారు. ఈ పాత్రకు వస్తున్న స్పందనపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడారు. 'ఈ కథ విన్నప్పుడు.. ఈ పాత్రకు నేను కరెక్ట్ అని మీకెలా అనిపించింది? అనడిగాను. కథ రాస్తున్నప్పుడే ఆ పాత్రలో నిన్నే ఊహించానని షాకింగ్ ఆన్సరిచ్చారు అరుణ్. ఆయన ఎలా అయితే ఊహించారో.. అలాగే నన్ను చూపించారు. తెరపై నన్ను నేను చూసుకొని షాక్‌లో ఉండిపోయాను. ఈ సినిమా వల్ల అమ్మానాన్నల అభినందనలందుకున్నాను. నాజీవితంలో ఇంతకు మించి ఆనందం మరొకటి ఉండదు. కమర్షియల్‌గా ఆలోచించకుండా కథ అడిగింది చేసుకుంటూ వెళ్లారు అరుణ్. అందుకే.. సినిమాలా కాకుండ జీవితాన్ని చూస్తున్నట్టుంది. ధనుష్ సార్ లాంటి గొప్ప నటుడితో చేస్తే ఎవరైనా గొప్పగా చేస్తారు' అన్నారు ప్రియాంక అరుళ్‌మోహన్.



పద్మవిభూషణుడిపై అభినందనల కుంభవృష్టి కురిసింది. అభిమానులు, ఆత్మబంధువులతో మెగా నివాసం కిటకిటలాడింది. సినీ రాజకీయ ప్రముఖులతోపాటు బంధు, మిత్ర, సపరివారమంతా అభినందన చందనాలతో మెగాస్టార్‌ని అభిషేకించింది. భారతరత్నకు ఒక్కడుగు దూరంలోనే ఉన్న అంజనీపుత్రుడు ఆనందాతిశయాలతో కళకళలాడిపోయారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అగ్రనిర్మాత దిల్‌రాజుతో సహా మెగా నివాసానికి వచ్చి చిరంజీవికి శుభాభినందనలు అందించారు. నేరుగా వందలాది మంది ఆయన్ను అభినందిస్తే.. మీడియా, సాంఘికమాధ్యమాల ద్వారా లక్షలాదిమంది మెగాస్టార్‌కి జేజేలు పలికారు.



# అభినందనల వెల్లువలో తడిసి ముద్దయిన అంజనీపుత్రుడు

## విశ్వంభరతో విజయ పరంపర కొనసాగించాలి

కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డులకు ఎంపికైన వారికి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చిరంజీవి నివాసానికి నిర్మాత దిల్ రాజుతో కలిసి వెళ్లి శాలువాతో సన్మానించారు. అనంతరం మెగాస్టార్‌తో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పునాదిరాళ్లు సినిమాతో చిరంజీవి తన ప్రస్థానాన్ని ప్రారంభించారని, త్వరలో విడుదల కాబోయే విశ్వంభరతో విజయ పరంపర కొనసాగిస్తారన్నారు. రక్తదానం, నేత్రదానం ద్వారా కోట్లాది మంది గుండెల్లో మెగాస్టార్ చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు.

## నాకు దక్కిన ప్రతి గౌరవం అభిమానులదే

- చిరంజీవి

దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారానికి నేను ఎంపికయ్యానని తెలిసినప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో అర్థంకాలేదు. షాక్‌లో ఉండిపోయాను. నిజంగా చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఈ గౌరవానికి కారణం నా అభిమానులే. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా.. నన్ను అన్నలా, బిడ్డలా, సొంత మనిషిగా భావించే కోట్లాది మంది అభిమానులు నాకు ఉండటం నా పూర్వజన్మ సుకృతం. నీడలా నాతో నడిచే కోట్లాది అభిమానుల ప్రేమ, ఆదరణ.. నా సినీకుటుంబం అండదండలు ఈ రోజు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. నాకు దక్కిన ప్రతి గౌరవం వారిదే. 45ఏళ్ల సినీ ప్రయాణంలో విభిన్నమైన పాత్రల ద్వారా వినోదం పంచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాను. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన సమాజం కోసం ఎంతోకొంత చేయాలనే తాపత్రయం నాకెప్పుడూ ఉంటూనేవుంది. అందుకే సేవ చేసి రుణం తీర్చుకుంటున్నాను. వాళ్లిస్తున్న దానితో పోలిస్తే నేను చేస్తున్నది గోరంతే. ఈ నిజం ప్రతిక్షణం నాకు గుర్తొస్తూనేవుంటుంది. అదే నన్ను బాధ్యతగా ముందుకు నడిపిస్తూవుంది. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపికచేసిన భారతప్రభుత్వానికీ, ప్రధాని నరేంద్రమోడీగారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

బాలరాముడి దర్శనానంతరం మీరు పద్మవిభూషణుడవ్వడం చాలా ఆనందంగా ఉంది. మీ విషయంలో నేనెప్పుడూ గర్వపడుతూనేవుంటా

- కె.రాఘవేంద్రరావు

కంగ్రాట్యులేషన్స్ చిరంజీవి భాయ్. మీకు పద్మవిభూషణ్ రావడం చాలా ఆనందంగా ఉంది.

- మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి

శుభాభినందనలు మిత్రమా. నీ కృషికి తగిన గౌరవం ఇది. ఈ అవార్డు నువ్వు అందుకోవడం మనందరికీ గర్వకారణం..

- డా.మోహన్‌బాబు

'పునాదిరాళ్లు' సినిమాతో నటుడిగా తొలి అడుగు వేసిన ఓ సామాన్యుడు. అసామాన్యుడిగా ఎదగడమే కాక, దేశంలోనే రెండో అత్యుత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. పద్మవిభూషణుడైనందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు సార్. మీ ప్రయాణం ఎన్నో తరాలకు స్ఫూర్తిదాయకం..

- ఎస్.ఎస్.రాజమౌళి

ఇక నుంచి 'పద్మవిభూషణ్' మెగాస్టార్ చిరంజీవి. కంగ్రాట్స్ అన్నయ్యా.. మిమ్మల్ని ఎప్పుడూ ప్రేమిస్తూనేవుంటాం..

- రవితేజ

చిరంజీవిగారిని పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికచేశారన్న అద్భుతమైన వార్తతో నిద్రలేచా. తెలుగు సినిమా గర్వపడాల్సిన క్షణాలివి.. కంగ్రాట్స్ సార్..

-మంచు విష్ణు.

మా పట్ల ఆప్యాయత, దయ ఉన్నందుకు.. మనసుకు హత్తుకునే పాత్రలతో మమ్మల్ని రంజింపజేస్తున్నందుకు.. మా మెగాస్టార్‌గా నిలిచినందుకు ధన్యవాదాలు సార్. ఇక నుంచి మీరు పద్మవిభూషణ్ చిరంజీవి.

- అడవి శేషు

సినిమా, సేవ.. ఈ రెండు రంగాలపై మీరు వేసిన ముద్ర చిరస్థాయిగా నిలిచుండిపోతుంది. ఓ తరానికి స్ఫూర్తిదాయకం అయినందుకు.. కొత్త తరానికి మార్గం సుగమం చేసినందుకు ధన్యవాదాలు సార్. దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారానికి మీరు ఎంపిక కావడం పట్ల మనస్ఫూర్తిగా ఆనందాభినందనలు తెలియజేస్తున్నాసార్. కంగ్రాట్స్ మెగాస్టార్

-హీరో శ్రీవిష్ణు

### తండ్రిగా మీ పాత్ర ఓ అద్భుతం

భారతీయ సినిమాపై ముద్ర.. అసంఖ్యాక అభిమానులను ప్రేరేపించడంలో మీపాత్ర అనితరసాధ్యమైనది. ఓ బాధ్యతగల పౌరునిగా నన్ను తీర్చిదిద్దడంలో తండ్రిగా మీ పాత్ర ఓ అద్భుతం. పవిత్రమైన నాదేశ నిష్కళంక పౌరులు మీరు. విమ్మల్ని ఈ స్థాయిలో గుర్తించిన భారతప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- రామ్‌చరణ్

155 సినిమాలు.. లెక్కకు మించి సేవాకార్యక్రమాలు.. నిజంగా నిరంతరశ్రామికుడు మీరు. మీ కృషి, మీ అంకితభావం ఎన్నో తరాలకు మార్గదర్శకం. మా జనరేషన్‌కి మీరే ప్రేరణ సార్. మెనీ మెనీ కంగ్రాట్యులేషన్స్ టు మెగాస్టార్ చిరంజీవి..

- హీరోయిన్ సంయుక్త మీనన్

మెగా ఎవరెస్ట్ కీర్తికిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. నా మనసు ఆనందంతో నిండిపోయింది.. కంగ్రాట్స్ మెగాస్టార్..

- దర్శకుడు సంపత్ నంది



# గీతా ఆర్ట్స్‌లో మరోసారి బోయపాటి

కొన్ని కాంబినేషన్స్ గురించి వినగానే బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అనిపిస్తుంది. అచ్చం అలాంటి కాంబినేషనే దర్శకుడు బోయపాటి శ్రీను, అగ్రనిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌లది. వీరిద్దరి కలయికలో అల్లు అర్జున్ హీరోగా 2016లో 'సరైనోడు' చిత్రం వచ్చిన సంగతి విదితమే. మాసివ్ బ్లాక్‌బస్టర్‌గా ఆ చిత్రం నిలిచి అత్యధిక వసూళ్లు సాధించింది. ఇప్పుడు మళ్లీ బోయపాటి దర్శకత్వంలోనే మరో చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు అరవింద్. అయితే ఇందులో హీరో ఎవరన్నది త్వరలో ప్రకటిస్తారు. వైవిధ్యమైన వాణిజ్య కథాంశాలను అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించి ఎన్నో విజయాలు సొంతం చేసుకున్న అల్లు అరవింద్ మరో హిట్ సినిమా తీయాలనే తపనతో ఈ చిత్ర నిర్మాణ సన్నాహాలు ప్రారంభించారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరికొన్ని వివరాలు తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు.



# దోచుకోవడానికి వస్తున్న నితిన్

'డబ్బు చాలా చెడ్డది. రూపాయి రూపాయి నువ్ ఏం చేస్తావ్ అంటే అన్నదమ్ముల మధ్య, అక్క చెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతాను అంటది. అన్నట్లే చేసింది. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ములు, ఆభరణాలేసుకున్నోళ్లంతా నా అక్కా చెల్లెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే, ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు. అయినా నేను హర్ట్ అవడం లేదు. ఎందుకంటే అయినవాళ్ల దగ్గర డబ్బులు తీయడం నా హక్కు. మై బేసిక్ రైట్. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్..' ఈ హ్యూమరెస్ డైలాగ్ చెబుతున్నది ఎవరో తెలుసా.. నితిన్. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న భారీ చిత్రంలో నితిన్ ఇలా దొంగ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు 'రాబిన్‌హుడ్' అనే టైటిల్ పెట్టినట్లు దర్శకనిర్మాతలు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సినిమాలో నితిన్ గెటప్, నటన ఎంటర్‌టైనింగ్ గా ఉంటాయని దర్శకుడు చెప్పారు. సరికొత్త పాత్రలో ఆయన్ని ప్రజెంట్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, కళ: రామ్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.

# వేసవిలో వస్తున్న టిల్లు



సిద్ధు జొన్నలగడ్డ తన 'డీజే టిల్లు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించారు. 'వీడి స్టైలే వేరు' అనిపించుకున్నారు. మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం కల్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ సినిమాకు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రూపుదిద్దుకుంది. ఇందులో సిద్ధు సరసన అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్నారు. టిల్లుగా సిద్ధు మరోసారి చేసే సందడి కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంగీత దర్శకుడు రామ్ మిరియాల స్వరపరిచిన 'టికెట్టే కొనకుండా', 'రాధిక' వంటి పాటలు ఇప్పటికే సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. వాస్తవానికి ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కావాలి. అయితే అనుకోని పరిస్థితులు కారణంగా విడుదలను వాయిదా వేస్తున్నామనీ, వేసవి సందర్భంగా మార్చి 29న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ చెప్పారు. మల్లిక్ రామ్ దర్శకుడు. ఈ చిత్రానికి సాయిప్రకాశ్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ శాఖలను నిర్వహిస్తున్నారు.



# విభిన్న ప్రేమకథ



మణికందన్, శ్రీగౌరీ ప్రియ , కన్న రవి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'ట్రూ లవర్'. ఓ విభిన్న ప్రేమకథగా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్.కె.ఎన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా 'ట్రూ లవర్' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో గాయాలతో ఉన్న హీరో ఏదో ఆలోచిస్తూ ఎమోషనల్‌గా కనిపించారు. 'ప్రేమికుల రోజున ఈ లవర్‌ను మరిచిపోకండి' అంటూ ఇచ్చిన కాప్షన్ ఆసక్తికరంగా ఉంది. ఒక ఇంటెన్స్ లవ్‌స్టోరీని చూపిస్తామనే భరోసాను మేకర్స్ ఇస్తున్నట్లు ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశారు. త్వరలోనే 'ట్రూ లవర్' విడుదల తేదీని ప్రకటిస్తారు. తెలుగు చిత్రానికి మౌళి మాటలు రాశారు. సంగీతం: సీన్ రోల్డన్. సినిమాటోగ్రఫీ: శ్రేయాస్ కృష్ణ. ఎడిటింగ్: భరత్ విక్రమన్.

# సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలి



నూతన నటుడు కృష్ణవంశీ హీరోగా పరిచయమవుతున్న ప్రేమకథా చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. మోక్ష హీరోయిన్‌గా నటిస్తున్నారు. చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వంలో హైమవతి, శ్రీరామ్ జడపోలు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై టీజర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'మొన్న అయోధ్యలో రాముల వారి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. ఈ రోజు 'అలనాటి రామచంద్రుడు' టీజర్ బయటికి వచ్చింది. యాదృచ్ఛికంగా ఈ సినిమా టైటిల్‌తో అది చక్కగా కుదిరింది. దర్శకుడు, నిర్మాత .. ఇలా అందరూ కొత్త టీమ్‌తో చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయం. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని థియేటర్‌కు తీసుకెళ్లడం గొప్ప విషయం. యూనిట్ అంతా దాని గురించి వర్క్ చేయాలి. సినిమా బాగా ఆడాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా సినిమాలో హీరో తన ప్రేమను వ్యక్తం చేయడానికి ఓ నిర్ణయం తీసుకుంటాడు. అప్పుడు అతను ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి, తనప్రేమను ఎలా పొందాడు అన్నది చిత్ర కథ. హీరో వంశీ ఈ కథకు పూర్తి న్యాయం చేశాడు. మోక్ష ధరణి పాత్రలో ఒదిగి పోయింది. ఈ సినిమా ఒక ఎమోషనల్ రైడ్. ప్రేక్షకులు సినిమా చూసి హాయిగా నవ్వుకుంటూ బయటకి వస్తారు' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన శ్రీరామ్ జడపోలు మాట్లాడుతూ 'చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఇష్టం. ఇది మా తొలి చిత్రం. ఇలాంటివి ఎన్నో తీయాలని బలంగా అనుకుని నిర్మాణం మొదలుపెట్టాం. మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం.' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో కృష్ణవంశీ, హీరోయిన్ మోక్ష తదితరులు పాల్గొన్నారు.

# పొలమే ప్రయోగశాల

**చెల్లమ్మాళ్ చదివింది ఆరో తరగతే. కానీ వ్యవసాయంలో శాస్త్రవేత్తల్ని సైతం ఆకట్టుకొనే ప్రయోగాలు చేశారు.**

**సేంద్రియంగా కొబ్బరి సాగులో, పంటల యాజమాన్యంలో ఆమెది అయిదు దశాబ్దాల అపారమైన అనుభవం ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైన చెల్లమ్మాళ్ వందలాది రైతులకు స్ఫూర్తిప్రదాత.**



దక్షిణ అండమాన్ ప్రాంతంలో 'కామాచ్చి చెల్లమ్మాళ్' అంటే ఎవరన్నట్టు చూస్తారు. కానీ 'నారియల్ అమ్మ' అనగానే వెంటనే గుర్తుపట్టేస్తారు. రంగచంగ్ గ్రామానికి చెందిన అరవయ్యేడేళ్ళ చెల్లమ్మాళ్ జీవితం మొత్తం కొబ్బరి తోటలతోనే పెనవేసుకుపోయింది. ఇక సాగు అనుభవం అయిదు దశాబ్దాలకు పైనే. మొదట్లో పంటకు చీడపీడలు, సరైన దిగుబడి లేకపోవడం వల్ల ఆమె ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. భూమి సారం తగ్గిపోవడానికీ, వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడానికీ కారణం రసాయనాల వాడకమేనని గ్రహించారు. "రసాయనాల వాడకం వల్ల మట్టిలో సారం తగ్గిపోతుంది. అది మన ఆరోగ్యాల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. మట్టిలో కోల్పోయిన పోషకాల్ని భర్తీ చెయ్యడం చాలా కష్టం. కాబట్టి రైతులందరూ సేంద్రియ సాగువైపు మళ్ళాలి" అంటారామె. మాటలకే పరిమితం కాకుండా... తన పది ఎకరాల పొలంలో వివిధ ప్రయోగాలను ఆమె చేపట్టారు. వర్షాకాలం తరువాత పొడిగా ఉండే వాతావరణంలో... మట్టిలో తేమ నిలవడం కష్టం. ఈ సమస్యను అధిగమించడానికి కొబ్బరాకులు, కొబ్బరి పీచును కుళ్ళబెట్టి, ఇతర ఆకులతో పాటు మట్టిని కప్పి ఉంచడం మొదలుపెట్టారు. మట్టిలో తేమ క్షీణించిపోకుండా నిలవడంతో పాటు కలుపు మొక్కల నివారణకు కూడా అది ఎంతో ఉపకరించింది.



> "నేను మారుమూల పల్లెటూర్లో నివసిస్తున్నాను. నాకు 'పద్మశ్రీ' పురస్కారం వచ్చిందని ఎవరో చెప్పినప్పుడు... ఎంతో సామాన్యురాలినైన నాకు అంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఎలా ఇస్తారనుకున్నాను. నన్ను ఆట పట్టిస్తున్నారనుకున్నాను. తరువాత అండమాన్ అధికారి ఒకరు అది నిజమేనని చెప్పారు. ఇప్పుడు నా నోట మాటలు రావడం లేదు"

చీడపీడల నివారణకు వాడే హానికరమైన రసాయనాలకు స్వస్తి చెప్పి... వివిధ సేంద్రియ పదార్థాలతో 'ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజిమెంట్' వ్యూహాన్ని అమలు చేశారు. మరోవైపు అంతర పంటల పెంపకాన్ని చేపట్టారు. "ఒకప్పుడు కేవలం కొబ్బరి మాత్రమే సాగు చేసేదాన్ని. కొన్నిసార్లు దిగుబడి తగ్గడం, మార్కెట్‌లో ధరలు పడిపోవడం వల్ల నష్టపోవాల్సి వచ్చేది. అందుకే... ఒకే పంట మీద ఆధారపడకూడదనుకున్నాను. కొబ్బరితో పాటు దాదాపు 460 తాటి చెట్లు పెంచుతున్నాను. అరటి, వేరు శెనగ, పైనాపిల్, మిర్చి, కంద, చిలగడ దుంపలు, ఆకుకూరలు, పువ్వులు... అలా రకరకాల పంటలు వేశాను" అని వివరించారామె. ప్రస్తుతం ఏటా 27 వేలకు పైగా కొబ్బరికాయల దిగుబడి వస్తోంది.

చెల్లమ్మాల్ చేసిన కొత్త ప్రయోగాలు, ఆచరించిన వినూత్న పద్ధతులు మంచి ఫలితాలు ఇవ్వడంతో పాటు తోటి రైతులకు స్ఫూర్తిగానూ నిలిచాయి. సుమారు 150 మందికి పైగా రైతులు ఈ పద్ధతులు అనుసరించేలా చేశారామె. ఆమె ప్రభావంతో... వారందరూ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపారు. అలాగే రకరకాల పంటలు పండిస్తున్నారు. "ఇలా చేయడం వల్ల ఏడాది పొడుగునా ఆదాయం ఉంటుంది. ఒక పంట దెబ్బ తిన్నా... మరొకటి ఆదుకుంటుంది" అంటారు చెల్లమ్మాళ్. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆమె సాగు విధానాల్ని పరిశీలించి అభినందించారు. గతంలో కొబ్బరి అభివృద్ధి బోర్డుతో సహా పలు సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్న ఆమెకు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'ని ప్రకటించింది. "నేను మారుమూల పల్లెటూర్లో నివసిస్తున్నాను. నాకు 'పద్మశ్రీ' పురస్కారం వచ్చిందని ఎవరో చెప్పినప్పుడు... ఎంతో సామాన్యురాలినైన నాకు అంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఎలా ఇస్తారనుకున్నాను. నన్ను ఆట పట్టిస్తున్నారనుకున్నాను. తరువాత అండమాన్ అధికారి ఒకరు అది నిజమేనని చెప్పారు. ఇప్పుడు నా నోట మాటలు రావడం లేదు" అంటూ స్పందించారామె.

చెల్లమ్మాళ్‌కు వ్యవసాయంలో ఆమె కుమారుడు రామచంద్రన్ సాయం చేస్తున్నారు. తన తల్లికి వచ్చిన ఈ పురస్కారం తమకు మరిన్ని ప్రయోగాలు చెయ్యడానికి స్ఫూర్తినిస్తోందని ఆయన చెబుతున్నారు. "ఇప్పుడు ఆగ్రో-టూరిజం'ను ప్రమోట్ చెయ్యడానికి ప్రణాళికలు వేస్తున్నాం. మా పొలంలో రకరకాల పంటలు వేస్తున్నాం. సుగంధ ద్రవ్యాల్ని సాగు చేస్తున్నాం. ఫిష్ ఫార్మింగ్ కూడా ఉంది. కాబట్టి ఇక్కడ ఆగ్రో-టూరిజానికి మంచి అవకాశం ఉంది. అది స్థానికుల్నీ, విద్యార్థుల్నీ మాత్రమే కాదు... పర్యాటకుల్ని కూడా ఆకర్షిస్తుందని మేం భావిస్తున్నాం" అని ఆ తల్లి కొడుకులు చెబుతున్నారు. చెల్లమ్మాళ్ మునుపటి ప్రయోగాల మాదిరిగానే ఈ ఆగ్రో టూరిజం ఆలోచన కూడా మరింతమంది రైతులను ఆ బాటలో మళ్ళిస్తుందనడంలో సందేహం లేదు.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dJq1yit లో చదవండి.



**బర్మాకు మనకు ఉన్న సారూప్యత ఏవిటి? ఆహారం. ఈ సమాధానం విని చాలా మంది ఆశ్చర్యపోతారు. కానీ బర్మాలో కూడా మనలాగే వెల్లుల్లి, అల్లం, ఎండుమిరపకాయల వంటివి లేకుండా వంట పూర్తి కాదు. ఇంకో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే- బర్మాలో శాఖాహారుల సంఖ్య చాలా ఎక్కువ. దోసెలు, సమోసాల వంటివి అక్కడ కూడా మనకు లభ్యమవుతాయి. మన ఆహారానికి ఇంత దగ్గరగా ఉన్న కొన్ని బర్మా వంటలు ఎలా వండుకోవాలో చూద్దాం.**



# బర్మాలో కూడా మన వంటే!

వంటిల్లు



## స్పైసీ కుకుంబర్ సలాడ్

**కావాల్సిన పదార్థాలు :** బర్మా బర్మాస్ చిల్లి గార్లిక్ ఆయిల్- 4 టేబుల్ స్పూన్, బర్మాస్ బర్మాస్ బలచౌంగ్ (క్రంచీ స్పైయిస్ బ్లెండ్)- 2 టేబుల్ స్పూన్, ఇంగ్లీష్ కుకుంబర్స్- 150 గ్రాములు, చక్కెర- 2 టీ స్పూన్లు, రైస్ వెనిగర్- 1.5 టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, నువ్వులు- 2 టీ స్పూన్స్ (వేయించాలి)

**తయారీ విధానం :** కుకుంబర్స్(కీరాదోసకాయలు) తోలు తీసి మందంగా గుండ్రని ముక్కలు కట్ చేసుకోవాలి. బౌల్‌లో నీళ్ల వేసి ఉప్పు, చక్కెర వేయాలి. ఇందులో దోసకాయల్ని ఐదు నిముషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత నీళ్లను తీసేయాలి. బౌల్‌లోని కుకుంబర్ ముక్కల్లోకి బర్మాస్ చిల్లీ గార్లిక్, నూనె, రైస్ వెనిగర్ వేసిన తర్వాత వేయించిన నువ్వులు వేసి కలపాలి. బాగా కలిపితే కుకుంబర్ ముక్కలకు మిశ్రమం పడుతుంది. ఈ బౌల్‌మీద ప్లేట్ ఉంచి కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఫ్రిజ్‌లోంచి తీసిన తర్వాత బర్మాస్ బలచౌంగ్ కలపాలి. ఈ స్పైసీ చిల్డ్ కుకుంబర్‌ను సైడ్ డిష్‌గా తినాలి.

## స్టిర్ ఫ్రై వెజిటబుల్స్ ఇన్ మలబార్ సాస్

**కావాల్సిన పదార్థాలు :** నీళ్లు- 2 టేబుల్ స్పూన్లు, నూనె- అర టేబుల్ స్పూన్, ఎండు మిరపకాయలు- 2 (నూనెలో వేయించాలి), తరిగిన వెల్లుల్లి ముక్కలు- అర టీస్పూన్, బేబీ కార్న్- 1 కప్పు, క్యారెట్ ముక్కలు- 1 కప్పు, ఆస్పరగస్- 1 కప్పు, బ్రొకోలీ- 1 కప్పు, బాక్ చాయ్- 1 కప్పు, బర్మా బర్మాస్ మలార్ స్టిర్ ఫ్రై సాస్- 1 టేబుల్ స్పూన్

**తయారీ విధానం :** కూరగాయ ముక్కల్ని శుభ్రం చేసిన తర్వాత మంచి నీళ్లలో రెండు నిముషాల పాటు ఉడకబెట్టాలి. ఆ తర్వాత నీళ్లను పారబోసి.. కూరగాయ ముక్కల్ని పక్కన ఉంచుకోవాలి. వెంటనే ప్యాన్‌ను హీట్ చేసి మిరపకాయలు, తరిగిన వెల్లుల్లి ముక్కలను వేయాలి. వెల్లుల్లి రంగు మారేంత వరకూ గరిటెతో కదుపుతుండాలి. ఇందులోకి మలార్ సాస్ వేసిన తర్వాత ప్యాన్ అంతా కలిసేట్లు రెండు టేబుల్ స్పూన్ల నీళ్లను చిలకరించాలి. ఇందులో ఉడకబెట్టిన కూరగాయముక్కల్ని వేశాక.. మలార్ సాస్ వేసి కలపాలి. నిముషం పాటు హైఫ్లేమ్‌లో ఉంచి ప్యాన్‌ను ముందుకు వెనకకు కదపాలి. చివరగా దీన్ని బౌల్‌లో వేసుకుని.. అన్నంతో తింటే రుచిగా ఉంటుంది.

## టాంగీ మలార్ స్పాగెట్టి

**కావాల్సిన పదార్థాలు :** స్పాగెట్టి- 100 గ్రాములు (ఇటాలియన్ పాస్తా నూడిల్స్ ఇవి. గోధుమలతో తయారు చేస్తారు), తురివిన చీజ్- 2 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి- 2 రెబ్బలు (సన్నగా తరగాలి), తరిగిన పుట్టగొడుగుల మిశ్రమం- 50 గ్రాములు, నూనె- 1 టేబుల్ స్పూన్
(గార్నిష్ కోసం- ఆలివ్ ఆయిల్‌తో పాటు ప్రాసెస్డ్ చీజ్ తీసుకోవాలి)

**తయారీ విధానం :** స్పాగెట్టిని ఉప్పునీళ్లలో ఉడికించాలి. నాలుగు టేబుల్ స్పూన్లు నీళ్ల మిగిలి ఉండగా స్పాగెట్టిని తీసేయాలి. ఆ నీళ్లను పక్కన ఉంచుకోవాలి. ప్యాన్‌లో నూనెను వేడిచేసి తరిగిన వెల్లుల్లి ముక్కలతో పాటు పుట్టగొడుగు ముక్కలను వేసి కలపాలి. హైఫ్లేమ్‌లో ప్యాన్‌ను ముందుకు వెనకకు కదుపుతూ రెండు నిముషాల పాటు కలపాలి. ఇందులోకి బర్మా బర్మాస్ మలార్ స్టిర్ ఫ్రై సాస్ వేసుకోవటంతో పాటు మిగిలిన స్పాగెట్టి నీళ్లను పోయాలి. నిముషం పాటు కుక్ చేశాక స్పాగెట్టిని వేయాలి. మిశ్రమం అంతా స్పాగెట్టికి పట్టిన తర్వాత మంటను కట్టేయాలి. తురిమిన చీజ్‌ను చల్లుకుని తినాలి. అవసరం అనుకుంటే కాస్త ఆలివ్ ఆయిల్‌ను చల్లుకున్నా పర్వాలేదు. రుచికంగా ఉంటుంది ఈ టాంగీ మలార్ స్పాగెట్టి.

## అంకుల్ మాంగ్ నూడిల్స్

**కావాల్సిన పదార్థాలు :**
గోధుమ, బియ్యంతో చేసిన నూడిల్స్-200 గ్రాములు, పోక్ చాయ్- 4 టేబుల్ స్పూన్లు, బర్మా బర్మాస్ మౌంగ్ చిల్లీ గార్లిక్ పేస్ట్- 5 టేబుల్ స్పూన్లు, రెడ్ క్యాబేజీ- అర కప్పు, తరిగిన ఫ్రెంచ్ బీన్స్- 4 టేబుల్ స్పూన్లు, తరిగిన క్యారెట్ ముక్కలు- 3 టేబుల్ స్పూన్లు, సిల్కెన్ తోఫు- 30 గ్రాములు, ఇంపోర్టెడ్ తారో- 2 టేబుల్ స్పూన్లు, గ్రీన్ టమోటా- 3 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ ముక్కలు- 3 టేబుల్ స్పూన్లు, ఆస్పరాగస్- 3 టేబుల్ స్పూన్లు, చింతపండు రసం- 2 టేబుల్ స్పూన్లు, బ్లాక్ పెప్పర్- 2 టీస్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, చక్కెర- రుచికి తగినంత, వెజిటెబుల్ స్టాక్- అరకప్పు
గార్నిష్ కోసం- స్ప్రింగ్ ఆనియన్, ఫ్రైడ్ గార్లిక్

**తయారీ విధానం :**
నూడిల్స్‌ను ఉడకబెట్టి పక్కన ఉంచుకోవాలి. కూరగాయలన్నీ మందంగా కట్ చేసుకోవాలి. తోఫును వేలంత పొడవులో కట్ చేసుకుని బ్రౌన్ రంగు వచ్చేంత వరకూ డీప్ ఫ్రై చేసుకోవాలి. కూరగాయ ముక్కల్ని మెత్తగా అయ్యేంత వరకూ ఉడికించాలి. ఒక ప్యాన్ తీసుకుని వేడయ్యాక సగం వెజిటెబుల్ స్టాక్ వేసి బర్మా బర్మాస్ మౌంగ్ చిల్లీ పేస్ట్ వేసి బాగా కలపాలి. ఇందులో కొద్దిగా చింతపండు రసం వేశాక గోధుమ నూడిల్స్ వేసి.. మంటను హైహీట్‌లో ఉంచి కలపాలి. ఈ నూడిల్స్‌ను బౌల్‌లో వేసి చల్లబరచాలి. అదే ప్యాన్‌లో మిగిలిన విజిటెబుల్ స్టాక్‌ను తీసుకుని ఇందులో బర్మా బర్మాస్ చిల్లి పేస్ట్ వేసి కరిగిన తర్వాత మిగిలిన చింతపండు రసం వేసి నిముషం తర్వాత ఉడికిన కూరగాయ ముక్కల్ని వేసి కలిపితే సాస్ వాటికి అంటుకుంటుంది. ఇందులో నూడిల్స్‌తో పాటు మిగిలినవన్నీ వేసి కలిపిన తర్వాత ఇందులోకి ఫ్రైడ్ గార్లిక్ ముక్కలతో పాటు స్ప్రింగ్ ఆనియన్స్ వేసి కలపాలి.

## వా పొటాటో

**కావాల్సిన పదార్థాలు :**
నూనె- 50 గ్రాములు, బంగాళదుంపలు- 350 గ్రాములు, వెల్లుల్లి- 2 టీస్పూన్లు, పచ్చి మిరపకాయల పేస్ట్- 3 టేబుల్ స్పూన్లు, రెడ్ చిల్లీ సాస్- 2 టేబుల్ స్పూన్లు, కాఫిర్ లైమ్ లీవ్స్- 2, చింతపండు రసం- అరకప్పు, సీజనింగ్ పౌడర్- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడినంత, చక్కెర- రుచికి తగినంత, పసుపు- కొద్దిగా, కార్న్‌ఫ్లోర్- కొద్దిగా, స్ప్రింగ్ ఆనియన్- 3 టేబుల్ స్పూన్లు, బర్మా బర్మాస్ బలచౌంగ్- 4 టేబుల్ స్పూన్లు (మార్కెట్లో దొరుకుతుంది. దీన్ని ఎండిన రొయ్యలతో చేస్తారు).

**తయారీ విధానం :**
బంగాళాదుంపలను శుభ్రంగా కడిగిన తర్వాత వేలంత పొడవుతో కట్ చేసుకోవాలి. దీన్ని పసుపు నీళ్లలో వేసి కొద్దిసేపు ఉంచిన తర్వాత నీళ్లను తీసేసి ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. ఆ తర్వాత ఒక బౌల్‌లో బంగాళాదుంప ముక్కల్ని తీసుకుని ఇందులోకి కొద్దిగా నూనె వేయటంతో పాటు కార్న్‌ఫ్లోర్ చల్లుకోవాలి. ఆ తర్వాత ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత బంగాళాదుంప ముక్కలను బంగారు రంగు వచ్చేంత వరకూ ఫ్రై చేసుకోవాలి. మిగిలిన నూనెను వేరే బౌల్‌లోకి వంచుకోవాలి. అదే ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి కాఫిర్ లైమ్ ఆకులు వేయాలి. పచ్చిమిర్చి పేస్ట్ వేసి కలపాలి. అందులోకి చింతపండు రసం వేసిన తర్వాత సీజనింగ్ పౌడర్ చల్లాలి. ఆ తర్వాత బంగాళాదుంప ముక్కల్ని వేసి, రెడ్ చిల్లీ సాస్ వేసి కలపాలి. తరిగిన స్ప్రింగ్ ఆనియన్స్ వేశాక బర్మా బర్మాస్ బలచౌంగ్ వేసిన తర్వాత బంగాళాదుంపలకు పట్టేట్టు కలపాలి. వా పొటాటో రెడీ. దీన్ని ప్లేట్‌లోకి వేసి స్ప్రింగ్ ఆనియన్స్‌తో గార్నిష్ చేసుకుని తినాలి.

క్రెడిట్
**బర్మాబర్మా**
నాలెడ్జ్ సిటీ, హైటెక్‌సిటీ,
హైదరాబాద్

# నిమ్మ రసంతో షడ్రసాలు

*విభావితం శుభ్రసితా మరీచైరేలారజో భావనయాలి రుచ్యమ్!*
*జీవాతవెతస్య భోక్తుర్దంబీర బీజం కేసర మార్దయన్తి!!*

నిమ్మకాయ మనకు కూరగాయే. నిమ్మపండు ఫలాలకు సంబంధించిందైతే, నిమ్మకాయలు, ఆకులు, వేర్లు కూడా ఔషధాలే. ఆయుర్వేదంలో నిమ్మ రసాన్ని లోహాల్లో విష దోషాలు హరించేందుకు, శుద్ధి కోసం ఉపయోగిస్తారు. లోహ విషాలనే హరించే నిమ్మకి శరీరంలో విష దోషాల్ని హరిస్తుంది. నిమ్మ ఇమ్యూనిటీ బూస్టర్ కూడా.

దీని వృక్ష నామం 'సిట్రస్ మెడికా'. అరబ్బీ పదం 'లేమూన్', పర్షియన్ 'లైమూన్', ఇటాలియన్ 'లైమోన్', ఫ్రెంచ్ 'లైమొన్'.. ఇంగ్లీషు 'లెమన్'గా మారింది. ఆహారానికి రుచినిచ్చి, జిడ్డు తొలగించే గుణాలు దీని ప్రసిద్ధికి కారణమయ్యాయి. మన ఆహారంలో తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు... ఈ ఆరు రుచులూ ఉంటేనే అది షడ్రసోపేతమైన భోజనం అవుతుంది. పుల్లని పదార్థంలో కెల్లా శక్తిదాయకమైంది నిమ్మపండు. దీనికి 'తీక్షణ' అనే గుణం ఉంది కాబట్టి అది వేగంగా శరీర ధాతువుల్లోకి చొచ్చుకుపోయి పని చేస్తుంది. ఉష్ణ స్వభావం కలది కాబట్టి, కఫాన్ని అంతం చేయగలుగుతుంది. జిడ్డుని తొలగించే గుణంవల్ల ఇది కొవ్వుని తగ్గించి స్థూలకాయానికి విరుగుడుగా పని చేస్తుంది. చింతపండుకన్నా మెరుగైన పుల్లని ద్రవ్యం ఇది.

నిమ్మ రసంలో కొద్దిగా ఉప్పు కలిపి, ఆ రసాన్ని పుక్కిలిస్తూ ఉంటే నోరు శుభ్రం అవుతుంది. నోటి దుర్వాసన, నాలుక మీద జిగురు పేరుకోవటం తగ్గుతాయి. తీవ్రమైన ఎసిడిటీ ఉన్న వారికి తప్ప నిమ్మ రసం అందరికీ జీర్ణశక్తిని పెంచేదిగా ఉంటుంది. ఎన్ని నీళ్ల తాగినా దప్పిక తీరక పోవటానికి నూనె పదార్థాలు, తీపి పదార్థాలు అతిగా తీసుకోవటం ఓ కారణం కావచ్చు. నిమ్మరసం తాగితే దప్పిక తీరుతుంది. అజీర్తివల్ల కలిగే కడుపు నొప్పిని తగ్గిస్తుంది.

దగ్గు, జలుబు, గొంతులో పుండు లాంటివి వేడివల్ల గానీ కఫంవల్ల గానీ వస్తుంటే... పంచదార కలిసిన నిమ్మ రసాన్ని తాగితే వెంటనే ఉపశమనం లభిస్తుంది. గొంతు లోపల ఉండే మృదువైన మ్యూకస్ పొరని ఇది పదిలపరుస్తుంది. వాంతి వికారాల్ని తగ్గిస్తుంది. నోట్లో నీళ్లూరటం ఆగుతుంది. కడుపులో, గొంతులో, ఊపిరితిత్తుల్లో దాగిన కఫాన్ని వెళ్లగొడుతుంది.

అజీర్తి వలన ఆహారం సరిగా పక్వం కాక, ఏర్పడే దోషాన్ని 'ఆమం' అంటారు. ఇది విష (టాక్సిన్) దోషం! ఈ విష దోషమే కీళ్లలో చేరి కీళ్లవాతాన్ని (రుమాటిజం) కలిగిస్తుంది. నిమ్మరసం ఆమాన్ని జయిస్తుంది కాబట్టి, కీళ్లవాత రోగులకు మేలు చేస్తుంది. వాతాన్ని తగ్గించే గుణం కూడా దీనికి ఉంది. అకారణంగా వచ్చే గుండె నొప్పిని కూడా తగ్గిస్తుంది.

రాత్రి ఒక గ్లాసు పెరుగుని చిలికి, మూడు గ్లాసుల నీళ్ల కలిపి... ఫ్రిజ్‌లో కాకుండా బయటే ఉంచి, ఉదయాన్నే ఆ మజ్జిగలో నిమ్మ రసం, నూరిన అల్లం కలిపి తాగితే జీర్ణకోశానికి మేలు కలుగుతుంది. విరేచనం ఫ్రీగా అవుతుంది. శరీరంలోని విషదోషాలను హరించగలుగుతుంది. శరీరానికి బలాన్నిస్తుంది. ఇనుము లాంటి ఖనిజాలు వంటపట్టేలా చేస్తుంది. చర్మానికి మంచి వర్ఛాన్నిస్తుంది. గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం స్థూలకాయానికి చేసుకోగలిగే గృహ చికిత్స

పచ్చి నిమ్మకాయ రసం ఎక్కువ పుల్లగా ఉండి పైత్యాన్ని పెంచుతుంది. బాగా పండిన నిమ్మపండు రసం మూడు దోషాలనూ హరిస్తుంది. రక్త నాళాలలో కొవ్వుని తగ్గిస్తుంది. గుండెకు, మెదడుకు రక్త సరఫరానీ పెంచుతుంది. కేన్సర్ ఏ అవయవంలో వచ్చినా నిమ్మ రసాన్ని ఆహార పానీయాల్లో కలిపి తీసుకుంటూ ఉంటే దానికి వాడే మందులు బాగా పని చేస్తాయి.

ఎండిన నిమ్మ డొప్పల్ని మంటలో వేసి, భస్మం చేసి, చిటికెడంత భస్మాన్ని తేనెతో కలిపి తీసుకుంటే విరేచనాలు తగ్గుతాయి.

టంకణ భస్మం ఆయుర్వేద షాపుల్లో దొరుకుతుంది. పావు చెంచా భస్మాన్ని తీసుకుని, రెండు మూడు చుక్కలు నిమ్మరసం కలిపి పేస్టులా చేసి, పులిపిడికాయల మీద పెడితే చిన్నవిగా ఉన్నవి త్వరగా రాలిపోతాయి. మామూలు చర్మం మీద ఎక్కువ తగలనీయకండి.

**నిమ్మ రసంతో పానీయం:** నిమ్మ రసంలో తగినన్ని గోరువెచ్చని నీళ్ల కలిపి, తగినంత చక్కెర, మిరియాలు, ఏలకుల పొడి వేసుకుని తాగితే అజీర్తిని పోగొడుతుంది. కొవ్వుని కరిగిస్తుంది. చర్మానికి పోషణ నిస్తుంది. గుండెకు బలాన్నిస్తుంది. వేసవికాలానికి అనుకూలంగా ఉంటుంది. వడకొట్టనీకుండా చేస్తుంది. చలికాలంలో శరీరానికి తగిన వేడినిస్తుంది. సర్వకాలాలకూ అనువైనది.

**నిమ్మ పప్పు:** కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు, శనగపప్పు, మసూర కందిపప్పు... ఈ ఐదింటినీ విడివిడిగా వేగించి, అన్నిటినీ సమానంగా కలిపి ఉడికించి, చల్లారిన తరువాత అందులో తగినంత ఉప్పు, నిమ్మరసం కలపాలి. దానికి ఇంగువ తాలింపు పెడితే నిమ్మ పప్పు చాలా కమ్మగా ఉంటుంది. బలకరమైన ఔషధం. ఈ పప్పన్నంలో ఆరు రుచులూ ఉంటాయి.

**నిమ్మకాయ ఊరగాయ:** నిమ్మకాయల్ని చిన్న ముక్కలుగా తరిగి పసుపు, ఉప్పు, కలిపి మూడు రోజులు ఊరనివ్వాలి. అందులోనే సన్నగా తరిగిన అల్లం ముక్కలు కూడా కలుపుకోవచ్చు. అందులో తగినంత కారం, కొద్దిగా మెంతి పిండి కలిపి ఓ సీసాలో భద్రపరచండి. ఈ నిమ్మ ఊరగాయని మొదటి ముద్దగా తింటే అజీర్తి, భుక్తాయాసం రాకుండా ఉంటాయి.

**నిమ్మ పచ్చడి: బాండీలో కొద్దిగా నూనె తీసుకుని తాలింపు గింజలు, తగినన్ని ఎండు మిరపకాయలు వేగించి మిక్సీ పట్టిన పొడిలో నిమ్మ రసం చేర్చి, కొత్తిమీర కలుపుకోవాలి. ఈ నిమ్మ పచ్చడి ఆరోగ్యదాయకమైంది. అన్నంలోకి మంచి ఆదరువు ఇది. టిఫిన్లలో ఒక చట్నీగా దీన్ని తింటే ఇడ్లీ, దోశ, బజ్జీల్లాంటివి తేలికగా అరుగుతాయి.**

**నిమ్మ పులిహోర:** చింతపండుకు బదులుగా నిమ్మ రసం పోసి తయారు చేసిన పులిహోర చాలా రుచిగా ఉంటుంది. చిటికెడంత ఆవపిండి, మెంతి పిండి కూడా కలిపి, కొంచెం ఊరాక తింటే మరింత రుచిగా ఉంటుంది. ఆరు రుచుల్నీ కలిగి ఉంటుంది.

క్షేమ కుతూహలం

**నిమ్మ తొక్కలతో జామ్:** నిమ్మరసం పిండేశాక ఆ డొప్పల్ని పారేయకుండా సన్నగా కత్తిరించి, కొద్ది నీళ్లలో మగ్గనిచ్చి, ఆ ముక్కలకు సరిపడిన పంచదార వేసి తీగపాకం పట్టి జామ్ తయారు చేస్తారు. ఇది చపాతీ, పూరీ, రోటీల్లో నంజుకోవటానికి బావుంటుంది.

**ఆరు రుచుల స్వీటు:** నిమ్మ, నారింజ లేదా కమలాకాయల తొక్కలు తీసుకుని తగినంత అల్లం కలిపి, మెత్తగా అయ్యేలా ఉడికించి, ముద్దలా చేసి, ఈ ముద్దని గోధుమ పిండితో పూరీ ఒత్తి, దాని మధ్య ఉంచి మూసేసి బంతిలా చేసి దాన్ని నూనెలో వేగించాలి. దాన్ని పంచదార లేదా బెల్లం పాకంలో ముంచి ఆరనివ్వాలి. ఇది ఆరు రుచులతో పరిమళభరితంగా ఉండే మంచి స్వీటు.

● గంగరాజు అరుణాదేవి



# స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 27 జనవరి 2024

భారత్ తొలి ఇన్నింగ్స్ 421/7

# మన చేతుల్లోకి..

## ఇంగ్లండ్‌కిక కష్టాలే!

### రాహుల్, జడేజా హాఫ్ సెంచరీలు

### ప్రస్తుత ఆధిక్యం 175.. తొలి టెస్టు



కేఎల్ రాహుల్ (86)

జడేజా (81 బ్యాటింగ్)

హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆటలోనూ పర్యాటక జట్టు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఆ జట్టు బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ కేఎల్ రాహుల్ (86), జడేజా (81 బ్యాటింగ్), అర్ధసెంచరీలతో జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డారు. దీంతో ప్రస్తుతం రోహిత్ సేన 175 పరుగుల స్పష్టమైన ఆధిక్యంతో దూసుకెళ్తోంది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 110 ఓవర్లలో 7 వికెట్లకు 421 పరుగులు చేసింది. క్రీజులో జడ్డూతో పాటు అక్షర్ పటేల్ (35 బ్యాటింగ్) ఉన్నాడు. ఓవర్‌నైట్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ (80) మరో నాలుగు పరుగులే చేసి అవుటవగా, భరత్ (41), శ్రేయాస్ (35) ఫర్వాలేదనిపించారు. మూడో రోజు వీలైనంత వేగంగా ఆడి 250+ ఆధిక్యం సాధించగలిగితే ప్రత్యర్థిపై పూర్తి పట్టు సాధించినట్టే. హార్ట్లీ, రూట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

**నాలుగో బంతికే జైస్వాల్ అవుట్:** వేగవంతమైన ఆటతీరుతో సెంచరీ సాధించేలా కనిపించిన జైస్వాల్ తొలి ఓవర్‌లోనే వెనుదిరిగాడు. స్పిన్నర్ రూట్‌తో రెండో రోజు బౌలింగ్‌ను ఆరంభించిన కెప్టెన్ స్టోక్స్ ఫలితం సాధించాడు. భారీ షాట్‌కు వెళ్లిన జైస్వాల్.. రూట్‌కే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. అదే ఓవర్‌లో రాహుల్ క్యాచ్‌ను కీపర్ ఫోక్స్ అందుకోలేకపోయాడు. అనంతరం హార్ట్లీ ఓవర్‌లో వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. కాసేపటికే గిల్ (23) అనవసర షాట్‌కు వెళ్లి వికెట్ సమర్పించుకున్నాడు. అటు ఉడ్ ఓవర్‌లో రాహుల్ మూడు ఫోర్లతో జోరు తగ్గకుండా చూశాడు. శ్రేయా‌స్‌కు పేసర్ ఉడ్‌తో చెక్ పెట్టాలని చూసినా అతను ఓపిగ్గా ఎదుర్కొన్నాడు. అలాగే రాహుల్‌కు చక్కగా సహకరించడంతో ఓవరాల్‌గా ఈ సెషన్‌లో భారత్‌దే పైచేయి కనిపించింది.

**కీలక భాగస్వామ్యాలు:** లంచ్ బ్రేక్ తర్వాత ఆరంభంలోనే శ్రేయాస్ వికెట్‌ను స్పిన్నర్ రెహాన్ పడగొట్టడంతో నాలుగో వికెట్‌కు రాహుల్-శ్రేయాస్ 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ ఆ తర్వాత రాహుల్‌కు జడేజా జత కలవడంతో పరుగుల వేగం తగ్గలేదు. రెహాన్‌ను లక్ష్యంగా చేసుకున్న రాహుల్ 55వ ఓవర్‌లో రెండు ఫోర్లు, 57వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో జట్టు స్కోరును 250కి చేర్చాడు. అటు జడ్డూ కూడా భారీ షాట్లతో చెలరేగాడు. అయితే ఆత్మవిశ్వాసంతో ఆడుతున్న రాహుల్‌ను హార్ట్లీ దెబ్బతీశాడు. ఐదో వికెట్‌కు ఈ ఇద్దరు 65 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఆ తర్వాత జడేజా, భరత్ ఆచితూచి ఆడడంతో టీ విరామానికి ముందు 11 ఓవర్లలో ఒక్క ఫోర్ మాత్రమే నమోదైంది.

**భారీ ఆధిక్యం దిశగా..:** ఆఖరి సెషన్‌లో జడ్డూతో కలిసి భరత్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరూ అనవసర షాట్లకు వెళ్లకుండా ఆధిక్యం పెంచే పనిలో పడ్డారు. అటు జడ్డూ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా.. భరత్ కూడా కెరీర్‌లో తొలి హాఫ్ సెంచరీ చేస్తాడనిపించింది. కానీ మరోసారి బౌలింగ్‌కు వచ్చిన జో రూట్.. భరత్‌ను అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పడింది. ఆ వెంటనే అశ్విన్ (1) రనౌట్ అయినా.. అక్షర్ తన బ్యాటింగ్ నైపుణ్యంతో జడేజాతో కలిసి చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రెండో రోజు ఆఖరి ఓవర్‌లో అక్షర్ వరుసగా 4,6,4తో అదరగొట్టడంతో ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 63 పరుగులు జత చేరాయి.

### ఒకే ఎండ్‌లో ఇద్దరూ..

బ్యాటింగ్‌కు చక్కగా సహకరిస్తున్న పిచ్‌పై అశ్విన్ ఒక్క పరుగు వద్దే దురదృష్టవశాత్తు రనౌట్ కావాల్సి వచ్చింది. 91వ ఓవర్‌లో కవర్స్ వైపు షాట్ ఆడి అశ్విన్ సింగిల్ కోసం వెళ్లాడు. అయితే నాన్‌స్ట్రయికర్ ఎండ్ నుంచి జడేజా సగం దూరం వెళ్లి.. వెనక్కి వచ్చాడు. అశ్విన్ కూడా అదే వైపునకు రావడంతో, అటు హార్ట్లీ నుంచి త్రో అందుకున్న కీపర్ ఫోక్స్ వికెట్లను గిరాటేశాడు. దీంతో అసహనంతో అశ్విన్ క్రీజును వీడాడు.

### స్కోరుబోర్డు

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 64.3 ఓవర్లలో 246 ఆలౌట్.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి అండ్ బి) రూట్ 80; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (సి) డకెట్ (బి) హార్ట్లీ 23; రాహుల్ (సి) రెహాన్ (బి) హార్ట్లీ 86; శ్రేయాస్ (సి) హార్ట్లీ (బి) రెహాన్ 35; జడేజా (బ్యాటింగ్) 81; భరత్ (ఎల్బీ) రూట్ 41; అశ్విన్ (రనౌట్) 1; అక్షర్ (బ్యాటింగ్) 35; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 110 ఓవర్లలో 421/7; వికెట్ల పతనం:** 1-80, 2-123, 3-159, 4-223, 5-288, 6-356, 7-358; **బౌలింగ్:** ఉడ్ 13-0-43-0; హార్ట్లీ 25-0-131-2; లీచ్ 25-6-54-1; రెహాన్ 23-3-105-1; రూట్ 24-2-77-2.

## విహారి, రికీ శతక మోత

రాయ్‌పూర్: హనుమ విహారి (119 నాటౌట్), కెప్టెన్ రికీ భుయ్ (120) శతకాల మోత మోగించారు. శుక్రవారం చత్తీస్‌గఢ్‌తో ఆరంభమైన రంజీ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 6.4 ఓవర్లలో 41 పరుగులకే మూడు వికెట్లు నష్టపోయి కష్టాల్లో పడింది. ఈ దశలో జత కలిసిన విహారి-రికీ జోడీ ద్విశతక (231) భాగస్వామ్యాన్ని నెలకొల్పి, ఆంధ్ర ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టింది. దీంతో తొలి రోజు ఆట ముగిసేసరికి ఆంధ్ర 90 ఓవర్లలో 277/4 స్కోరు చేసింది. క్రీజులో విహారితో పాటు కరణ్ షిండే (3) ఉన్నారు.

## కిరణ్ కూడా అవుట్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ తరఫున బరిలో మిగిలిన కిరణ్ జార్జ్ పోరాటం కూడా ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ చాంపియన్ కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్) 21-14, 21-6తో కిరణ్‌ను ఓడించాడు. స్టార్ షట్లర్లు ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్యసేన్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

## ఆసీస్ 289/9

### విండీస్‌కు స్వల్ప ఆధిక్యం

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ 35 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 7.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 13 పరుగులు చేసింది. అంతకుముందు విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులు చేసింది. సింక్లెయిర్ (50) అర్ధసెంచరీ సాధించాడు. స్టార్క్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. అనంతరం ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను 289/9 వద్ద డిక్లేర్ చేసింది. గాయంతో హాజెల్‌వుడ్ బ్యాటింగ్ చేయలేదు. జోసెఫ్‌కు నాలుగు, రోచ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

## షోయబ్ మాలిక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు

ఢాకా: పాకిస్థాన్ వెటరన్ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్ మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల్లో ఇరుక్కున్నాడు. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో ఫార్చ్యూన్ బరిషల్ ఆటగాడైన మాలిక్ ఈనెల 22న ఖుల్నా టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో మూడు నోబాల్స్ వేయడం సందేహాలకు తావిచ్చింది. ఆ ఓవర్‌లో తను 18 రన్స్ ఇచ్చుకున్నాడు. అటు జట్టు కూడా ఓటమిపాలైంది. అలాగే అర్ధంతరంగా తను దుబాయ్‌కు వెళ్లిపోయాడు. ఓ ఆఫ్ స్పిన్నర్ ఇన్ని నోబాల్స్ వేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ఫ్రాంచైజీ యాజమాన్యం మాలిక్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్టు ఓ క్రీడా విలేఖరి ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. అయితే షోయబ్ మాత్రం ఈ కథనాలను తోసిపుచ్చాడు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో ఆంధ్రకు 3 పతకాలు



భవాని



నీరజ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ వెయిట్ లిఫ్టర్లు 3 పతకాలు సాధించారు. శుక్రవారం చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా పోటీల బాలికల 45 కిలోల కేటగిరీలో భవాని రజతం, 40 కిలోల విభాగంలో నీరజ కాంస్యం సాధించారు. చండీగఢ్‌లో జరిగిన ఆలిండియా వర్సిటీ పోటీల్లో 55 కిలోల విభాగంలో కోటేశ్వరరావు (ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం) కాంస్యం గెలిచాడు.

# తన్మయ్..ఫాస్టెస్ట్ ట్రిపుల్

### 147 బంతుల్లోనే బాదేసిన హైదరాబాద్ ఆటగాడు

### రంజీలో రికార్డుల మోత



తన్మయ్ అగర్వాల్ (160 బంతుల్లో 323 బ్యాటింగ్)

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ ట్రోఫీలో హైదరాబాద్ ఆటగాడు తన్మయ్ అగర్వాల్ శివాలెత్తాడు. శుక్రవారం సొంతగడ్డపై అరుణాచల్‌ప్రదేశ్‌తో ఆరంభమైన రంజీ ప్లేట్ గ్రూప్ పోరులో తన్మయ్ పరుగుల సునామీ సృష్టించాడు. క్రికెట్ చరిత్రలోనే వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ (33 ఫోర్లు, 21 సిక్సర్లతో 160 బంతుల్లో 323 బ్యాటింగ్) బాది సరికొత్త రికార్డు సృష్టించాడు. టీ20 మ్యాచ్ తరహాలో చెలరేగుతూ 147 బంతుల్లోనే 300 పరుగులు పూర్తిచేసి ఈ అరుదైన ఘనత అందుకున్నాడు. ఈ క్రమంలో 2017లో సౌతాఫ్రికా దేశవాళీ క్రికెట్‌లో బోర్డర్ జట్టు ఆటగాడు మార్కో మరైస్ (191 బంతుల్లో ట్రిపుల్ సెంచరీ) నెలకొల్పిన ఫాస్టెస్ట్ ట్రిపుల్ రికార్డును తన్మయ్ బద్దలు కొట్టాడు. ఇక, ఒకేరోజు 300పైగా పరుగులు చేయడం, ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ (119 బంతుల్లో) చేసిన తొలి భారత ఆటగాడిగా తన్మయ్ మరో రెండు రికార్డులు నెలకొల్పాడు. గతంలో రవిశాస్త్రి (123 బంతుల్లో) పేరిటవున్న ఫాస్టెస్ట్ డబుల్ రికార్డు కనుమరుగైంది. కాగా, అరుణాచల్‌తో మ్యాచ్‌లో తన్మయ్‌కు తోడుగా కెప్టెన్ రాహుల్ సింగ్ (185) సెంచరీతో కదం తొక్కడంతో తొలిరోజు ఆట ముగిసేసరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో వికెట్ నష్టానికి 529 రన్స్ చేసింది. తన్మయ్, రాహుల్ తొలి వికెట్‌కు 449 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడం విశేషం. క్రీజులో తన్మయ్, అభిరథ్ రెడ్డి (19) ఉన్నారు. అరుణాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లు మిలింద్, కార్తికేయ చెరో 3, తనయ్ 2 వికెట్లు తీశారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్

# జొకోవిచ్‌కు ఝలకిచ్చాడు



సిన్నర్

జొకోవిచ్

### చాంపియన్‌ను చిత్తుచేసిన సిన్నర్

### ఫైనల్లో మెద్వెదేవ్‌తో అమీతుమీ

మెల్‌బోర్న్: చిరకాల ప్రత్యర్థి నడాల్ టోర్నీలోనే లేడు.. తనకు పోటీ ఇస్తాడనుకున్న యువ కెరటం అల్కారజ్ వెనుదిరిగాడు.. ఇంకేం, అతనిదే ఆస్ట్రేలియన్ ఓపెన్.. పైగా, ఇక్కడ సెమీస్ చేరిన పదిసార్లూ టైటిల్ కొట్టిన ఘన చరిత్ర తనది.. ఇలా, ఎన్నో సానుకూలతలతో కోర్టులోకి అడుగుపెట్టిన డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు ఊహించని రీతిలో షాకిచ్చాడు ఇటలీ కుర్రాడు జానిక్ సిన్నర్. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోవున్న ప్రపంచ నెంబర్‌వన్ జొకో 33 మ్యాచ్‌ల జైత్రయాత్రకు బ్రేక్‌వేస్తూ నాలుగోసీడ్ సిన్నర్ తొలిసారి ఓ మేజర్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 22 ఏళ్ల సిన్నర్ 6-1, 6-2, 6-7(6), 6-3తో 36 ఏళ్ల జొకోవిచ్‌ను చిత్తుచేశాడు. నిరుడు వింబుల్డన్ సెమీస్ చేరడమే గ్రాండ్‌స్లామ్‌లో సిన్నర్ అత్యుత్తమ ప్రదర్శన. అంతేకాదు.. ఆనాడు సెమీస్‌లో జొకో చేతిలోనే ఎదురైన ఓటమికి తాజా గెలుపుతో ప్రతీకారం తీర్చుకున్నట్టయింది. 3 గంటలా 22 నిమిషాల పాటు సాగిన పోరులో మూడోసెట్ వినహా ఏ దశలోనూ సిన్నర్‌కు జొకో పోటీ ఇవ్వలేకపోయాడు. 4 డబుల్‌ఫాల్ట్స్ చేసిన జొకో.. 54 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకున్నాడు. జొకో 7 ఏస్‌లు, 32 విన్నర్లు సంధించగా.. సిన్నర్ 9 ఏస్‌లు, 31 విన్నర్లతో బెంబేలెత్తించాడు. 2018లో నాలుగో రౌండ్ ఓటమి తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇప్పటిదాకా ఆడిన ప్రతిసారీ జొకో చాంపియన్‌గా నిలిచాడు. కానీ, ఈసారి సిన్నర్ చేతిలో ఓటమితో జొకో జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ఆదివారం జరిగే ఫైనల్లో రష్యా స్టార్ డానిల్ మెద్వెదేవ్‌తో సిన్నర్ తలపడనున్నాడు. మరో సెమీస్‌లో మూడో సీడ్ మెద్వెదేవ్ 5-7, 3-6, 7-6 (4), 7-6 (5), 6-3తో ఆరోసీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై గెలుపొందాడు. కాగా, జొకోవిచ్ (2008) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ ఆడనున్న పిన్న వయసు ఆటగాడిగా సిన్నర్ రికార్డులకెక్కనున్నాడు.

**మహిళల సింగిల్స్ ఫైనల్ నేడు**
సబలెంకా × కిన్వెన్ జెంగ్ — మధ్యాహ్నం 2 గం. నుంచి

**పురుషుల డబుల్స్ టైటిల్ పోరు**
రోహన్ బోపన్న/ఎబ్డెన్ — మధ్యాహ్నం 3.15 నుంచి

**ప్రత్యక్ష ప్రసారం సోనీ నెట్‌వర్క్‌లో**

# బిజినెస్

## పాలసీదారుల ప్రయోజనాలే ముఖ్యం

» బలవంతంగా పాలసీలు అంటగట్టొద్దు

» ఐఆర్‌డీఏఐ చీఫ్ దేబాశిష్ పాండా



హైదరాబాద్: బీమా కంపెనీల అనైతిక విధానాలపై భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ దేబాశిష్ పాండా మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలసీదారుల ప్రయోజనాలే పరమావధిగా పని చేయాలని కంపెనీలను కోరారు. బీమా పాలసీల విక్రయంలో అనైతిక విధానాలను కట్టిపెట్టి, నిబనంధనలకు కట్టుబడి పని చేయాలన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో పాండా ఈ వ్యాఖ్యలు చేశారు. బీమా కంపెనీల సీఈఓలు, పలువురు పరిశ్రమ ప్రముఖులు ఈ సదస్సుకు హాజరయ్యారు. బీమా పాలసీల మార్కెటింగ్, తప్పుడు హామీలు లేదా బలవంతంగా పాలసీల విక్రయం, క్లెయిమ్‌ల సత్వర పరిష్కారం వంటి అనేక అంశాలు ఈ సదస్సులో చర్చకు వచ్చాయి. అన్ని వర్గాలకు అందుబాటు ధరల్లో బీమా పాలసీల అంశమూ ఈ సదస్సులో చర్చకు వచ్చింది.

## టీసీఎస్‌తో డీల్‌కు ఆక్స్‌ఫర్డ్ గుడ్‌బై

న్యూఢిల్లీ: విద్యార్థుల ప్రవేశ పరీక్షల కోసం గత ఏడాది టీసీఎస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ రద్దు చేసుకుంది. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షల్లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్టు విద్యార్థులు, టీచర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ చర్య తీసుకుంది. బ్రిటన్‌లోని 30 కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఏటా ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ టెస్టుల నిర్వహణ కాంట్రాక్టును ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ ఏడాది నుంచి టీసీఎస్ అనుబంధ సంస్థ టీసీఎస్ అయాన్‌కు అప్పగించింది. అయితే తొలి ఏడాదే పలు సాంకేతిక సమస్యలు ఎదురైనట్టు విద్యార్థులు, టీచర్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఏకంగా ఈ కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

## భారత్‌లో తొలి ఏఐ యూనికార్న్ కృత్రిమ్

న్యూఢిల్లీ: ఓలా గ్రూప్‌నకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ కృత్రిమ్ తాజాగా 100 కోట్ల డాలర్ల క్లబ్‌లోకి చేరింది. తద్వారా దేశంలో తొలి ఏఐ యూనికార్న్ సంస్థగా అవతరించింది. కనీసం 100 కోట్ల డాలర్ల మార్కెట్ విలువను కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. తొలి రౌండ్ నిధుల సమీకరణలో భాగంగా మ్యాట్రిక్స్ పార్ట్‌నర్స్ సహా పలు ఇన్వెస్టర్ల నుంచి కృత్రిమ్ 5 కోట్ల డాలర్లు సమీకరించింది. ఈ సందర్భంగా కంపెనీ మార్కెట్ విలువను వంద కోట్ల డాలర్లుగా లెక్కించారు. కృత్రిమ్ పూర్తి ఏఐ కంప్యూటింగ్ స్టాక్‌ను అభివృద్ధి చేస్తోంది. దేశంలో ఇదే తొలి పూర్తి ఏఐ కంప్యూటింగ్ స్టాక్ కానుంది. దేశంలోని అన్ని భాషల కోసం చాట్‌జీపీటీ లాంటి జనరేటివ్ అప్లికేషన్లను రూపొందిస్తోంది.

## ఈ-కామర్స్ మార్కెట్లో ఫ్లిప్‌కార్ట్ నం.1

### ఈ ప్లాట్‌ఫామ్‌దే 48% మార్కెట్ వాటా





» వేగంగా వృద్ధి చెందుతున్న పోర్టల్ మీషో

» వెల్లడించిన అలియన్స్ బెర్న్‌స్టీన్ నివేదిక

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2022-23) నాటికి వాల్‌మార్ట్ గ్రూప్‌నకు చెందిన ఫ్లిప్‌కార్ట్ 48 శాతం మార్కెట్ వాటాతో భారత ఈ-కామర్స్ రంగంలో అగ్రగామి సంస్థగా నిలిచిందని అలియన్స్ బెర్న్‌స్టీన్ తాజా నివేదిక వెల్లడించింది. అలాగే, సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన మీషో దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆన్‌లైన్ కామర్స్ పోర్టల్ అని రిపోర్టు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. ఫ్లిప్‌కార్ట్ వినియోగదారులు వార్షిక ప్రాతిపదికన 21 శాతం వృద్ధి చెందగా.. మీషో యూజర్ బేస్ 32 శాతం పుంజుకుంది. అమెజాన్ కస్టమర్ల వృద్ధి 13 శాతానికి పరిమితమైంది. విఁగతా పోర్టళ్లతో పోలిస్తే అమెజాన్ కొంత ప్రీమియం ఉత్పత్తులను ఆఫర్ చేస్తుండటం ఇందుకు కారణం. మరిన్ని విషయాలు..

ఫ్లిప్‌కార్ట్ ఇండస్ట్రీ కంటే వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో మొబైల్స్ (50 శాతం), వస్త్రాలే (30 శాతం) అత్యధికంగా అమ్ముడవుతున్న కేటగిరీలు. ఈ సంస్థ ఆన్‌లైన్ స్మార్ట్‌ఫోన్ విభాగంలో 48 శాతం, ఫ్యాషన్ విభాగంలో 60 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

నెలకు సగటున 12 కోట్ల మంది యాక్టివ్ యూజర్లతో మీషో వేగంగా వృద్ధి చెందుతున్న పోర్టల్‌గా నిలిచింది. ద్వితీయ, చిన్న నగరాలపై దృష్టి సారించడం, జీరో కమీషన్ మోడల్ మీషో వినియోగదారుల శరవేగ వృద్ధికి దోహదపడుతోంది.

గడిచిన ఏడాదికాలంలో మీషో ఆర్డర్లు 43 శాతం వృద్ధి చెందగా.. రెవెన్యూ 54 శాతం పెరిగింది. రిపీట్ కస్టమర్ల రేటు 80 శాతంగా ఉంది.

నీల్సన్ మీడియా అధ్యయనం ప్రకారం.. అమెజాన్ ఇండియా ప్రాధాన్యమైన ఆన్‌లైన్ కామర్స్ బ్రాండ్‌గా ఉంది.

ఫ్యాషన్ ఈ-కామర్స్ విభాగంలో రిలయన్స్ అజియో కస్టమర్లను వేగంగా పెంచుకోగలుగుతోంది. నెలవారీ యాక్టివ్ యూజర్ల పరంగా ఈ పోర్టల్ 30 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. అయితే, ఈ విభాగంలో యాక్టివ్ యూజర్ల పరంగా 50 శాతానికి పైగా మార్కెట్ వాటాతో ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన మింత్రా అగ్రగామి పోర్టల్‌గా కొనసాగుతోంది.

ఆన్‌లైన్‌లో కిరాణా సరుకుల విక్రయ (ఈ-గ్రాసరీ) ప్లాట్‌ఫామ్స్ విషయానికొస్తే.. బ్లింకిట్ 40 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉంది. ఇన్‌స్టామార్ట్ 37-39 శాతం, జెప్టో 20 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి.

## భారత్‌లో ఎయిర్‌బస్ హెలికాప్టర్ల తయారీ కేంద్రం

» టాటా గ్రూప్ సంస్థ టీఏఎస్‌ఎల్‌తో ఒప్పందం

» హెచ్125 హెలికాప్టర్ల తయారీ





ముంబై: భారత్‌లో హెలికాప్టర్ల తయారీ కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్‌తో ఫ్రాన్స్‌కు చెందిన విమాన తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా టాటా గ్రూప్ అనుబంధ సంస్థ సంస్థ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ సంయుక్తంగా ఈ హెలికాప్టర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దేశీయంగా తయారీ సామర్థ్యాలను మరింతగా విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఇరు సంస్థలు పేర్కొన్నాయి. కాగా ఎయిర్‌బస్ ఇప్పటికే గుజరాత్‌లోని వడోదరలో సీ295 మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. తాజాగా పౌర అవసరాల కోసం హెచ్125 హెలికాప్టర్ల తయారీ కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్ సహా పొరుగు దేశాలకు ఈ హెలికాప్టర్లను ఇక్కడి నుంచి ఎగుమతి చేయనున్నారు. భారత్‌లో ఎయిర్‌బస్ ఏర్పాటు చేస్తున్న రెండో ప్లాంట్ ఇది. అంతేకాకుండా ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద దేశీయంగా ప్రైవేట్ రంగంలో ఏర్పాటు అవుతున్న తొలి హెలికాప్టర్ తయారీ కేంద్రం కూడా ఇదే. ఈ ప్లాంట్‌ను రెండేళ్లలో పూర్తి చేసి 2026 నాటికి తొలి మేడిన్ ఇండియా హెచ్125 హెలికాప్టర్ డెలివరీలను ప్రారంభించాలని టీఏఎస్ఎల్, ఎయిర్‌బస్ భావిస్తున్నాయి. అయితే ఈ హెలికాప్టర్ తయారీ కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేసేది తర్వాత నిర్ణయించనున్నారు.

కాగా ఈ ప్లాంట్ పెట్టుబడుల వివరాలను కూడా ఇరు కంపెనీలు వెల్లడించలేదు. మేడిన్ ఇండియా సివిల్ హెలికాప్టర్ తయారీ ద్వారా సరికొత్త భారత్ ఆవిష్కృతం అవటమే కాకుండా దేశీయంగా హెలికాప్టర్ మార్కెట్లో ఉన్న అవకాశాలను దక్కించుకునే అవకాశం లభిస్తుందని ఎయిర్‌బస్ సీఈఓ గులియమ్ ఫౌరీ అన్నారు. భారత్‌లో ఏరోస్పేస్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయటానికి ఎయిర్‌బస్ కట్టుబడి ఉందని చెప్పటానికి ఇది ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలో తొలి హెలికాప్టర్ అసెంబ్లింగ్ కేంద్రాన్ని టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తుండటం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు.

## హైదరాబాద్‌లో ఓలా ఈ-బైక్ ట్యాక్సీ సేవలు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ద్వారా వాహనాల బుకింగ్ సేవలందించే ఓలా మొబిలిటీ.. ఢిల్లీ, హైదరాబాద్‌లో ఈ-బైక్ ట్యాక్సీ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబరులోనే కంపెనీ పైలట్ ప్రాజెక్టుగా ఈ సర్వీసును బెంగళూరులో ప్రారంభించింది. ఈ సేవలందించేందుకు వచ్చే రెండు నెలల్లో మూడు నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ టూవీలర్లను అందుబాటులోకి తేనున్నట్లు ఓలా మొబిలిటీ వెల్లడించింది. తద్వారా దేశంలో అతిపెద్ద ఈవీ టూ వీలర్ రెంటల్ నెట్‌వర్క్‌గా అవతరించనుంది. అంతేకాదు, ఈ ఏడాది చివరినాటికి ఈ-బైక్ ట్యాక్సీ సర్వీసును దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 5 కిలోమీటర్ల ప్రయాణానికి రూ.25 ప్రారంభ రుసుముతో ఓలా ఈ-బైక్ సర్వీసును ఆఫర్ చేస్తోంది. 10 కిలోమీటర్లకు రూ.50, 15 కిలోమీటర్లకు రూ.75 చెల్లించాల్సి ఉంటుంది.

## ‘జీ’తో డిస్నీ స్టార్ అమీతుమీ!

### రూ.11,650 కోట్ల డీల్ నుంచి తప్పుకున్న జీ గ్రూప్

### న్యాయస్థానంలో తేల్చుకునే యోచనలో డిస్నీ స్టార్

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో న్యాయ పోరాటానికి డిస్నీ స్టార్ సిద్ధమవుతోంది. భారత్‌లో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల టీవీ ప్రసారం కోసం గతంలో కుదుర్చుకున్న 140 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11,650 కోట్లు) విలువైన సబ్-లైసెన్సింగ్ అగ్రిమెంట్ నుంచి జీ గ్రూప్ తప్పుకున్న నేపథ్యంలో డిస్నీ స్టార్ ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. అగ్రిమెంట్ నుంచి తప్పుకున్నందుకు నష్టపరిహారం చెల్లించాలంటూ ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా సోనీకి తొలి విడతగా 20 కోట్ల డాలర్ల చెల్లింపుల్లో విఫలమైన జీ.. ఒప్పందంపై ముందుకెళ్లలేమని ఈ వారంలోనే చేతులెత్తేసింది. ఈ పరిణామం జీ గ్రూప్ ప్రస్తుత ఇబ్బందులను మరింత పెంచనుంది. ఎందుకంటే, జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రెండేళ్ల క్రితం కుదుర్చుకున్న విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సోనీ గ్రూప్.. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు మధ్యవర్తిత్వం కోరిన నేపథ్యంలో బ్రేకప్ ఫీజు కింద 9 కోట్ల డాలర్లు (రూ.747 కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించి సోనీ గ్రూప్ సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌లో పిటిషన్ కూడా దాఖలు చేసింది.

## టెక్ దిగ్గజాల కొలువుల కోత

### మైక్రోసాఫ్ట్‌లో 1,900 మంది ఔట్

న్యూయార్క్: అమెరికాలో కొలువుల కోత కొనసాగుతోంది. టెక్ దిగ్గజాలు వరుస పెట్టి ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కంపెనీ తన గేమింగ్ డివిజన్‌లో 1,900 మందిని ఇంటికి పంపిస్తున్నట్టు ప్రకటించింది. గేమింగ్ డివిజన్‌లో ఉన్న మొత్తం 22,000 మంది ఉద్యోగుల్లో ఇది 8 శాతానికి సమానం.

**సేల్స్‌ఫోర్స్‌లో 700 మంది:** క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ సేవలు అందించే ‘సేల్స్‌ఫోర్స్’ మరోసారి ఉద్యోగాల కోతకు దిగింది. దాదాపు 700 మందిని తీసివేస్తున్నట్టు తెలిపింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఇది దాదాపు ఒక శాతానికి సమానం. ఖర్చులు తగ్గింపు పేరుతో గత ఏడాది కూడా సేల్స్‌ఫోర్స్ 8,000 మందిని ఇంటికి పంపించింది. అది చాలదన్నట్టు ఈ సంవత్సరం మళ్లీ కొత్తగా మరో 700 మందిపై వేటు వేస్తోంది.

**లెవిస్ స్ట్రాస్‌లోనూ:** ప్రముఖ దుస్తుల కంపెనీ లెవిస్ స్ట్రాస్ కూడా కొలువుల కోతకు దిగింది. వ్యాపార పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగుల్లో 10 నుంచి 15 శాతం మందిని తీసివేస్తున్నట్టు ప్రకటించింది. ఈ సంవత్సరం కూడా మార్కెట్ పరిస్థితులు అంత అనుకూలంగా లేకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. ఈ ఏడాది జూన్‌లోగా ఈ కోతలు అమలు చేయనున్నట్టు ప్రకటించింది.

**స్విగ్గీలో 400 మంది ఔట్:** మన దేశానికి చెందిన స్విగ్గీ కూడా కొలువుల కోతలకు సిద్ధమైంది. టెక్నాలజీ, కాల్ సెంటర్, కార్పొరేట్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో 350 నుంచి 400 మందిని ఇంటికి పంపించేందుకు సిద్ధమైంది. వచ్చే కొద్ది వారాల్లోనే ఈ కోతలు ఉంటాయని సమాచారం.

## అదానీ గ్రూప్‌లోకి మరో 6 జెట్ విమానాలు

» రూ.300 కోట్లకు కొనుగోలు

ముంబై: అపర కుబేరుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ తన టాప్ ఎగ్జిక్యూటివ్‌ల ప్రయాణ సౌలభ్యం కోసం మరో 6 బిజినెస్ జెట్ విమానాలను రూ.300 కోట్లకు కొనుగోలు చేయనుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన పిలాటస్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీ నుంచి పిలాటస్ పీసీ-24 మోడల్‌కు చెందిన ఆరు జెట్ విమానాల కోసం గ్రూప్ ఇప్పటికే ఆర్డర్ చేసినట్లు తెలిసింది. తద్వారా గ్రూప్ నెట్‌వర్క్‌లోని బిజినెస్ జెట్ విమానాల సంఖ్య 12కు చేరుకోనుంది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ 27 జనవరి



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 540 | విజయవాడ | 540 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 565 |
| గోదావరి | 540 | వరంగల్ | 542 |

డజను గుడ్లు రూ.72

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 107 | గోదావరి | 111 |
| వరంగల్ | 107 | విజయవాడ | 111 |
| కరీంనగర్ | 107 | గుంటూరు | 112 |
| మహబూబ్‌నగర్ | 107 | ఒంగోలు | 112 |
| కర్నూలు | 107 | చిత్తూరు | 115 |
| విశాఖపట్నం | 108 | | |

## నిజాన్ని గెలిపించే శక్తి మీకే ఉంది!

**తూర్పున ముగిసిన భువనేశ్వరి 'నిజం గెలవాలి'**


తూర్పుగోదావరి జిల్లా పందలపర్రులో చిన్నారిని ఎత్తుకున్న భువనేశ్వరి

రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నిజాన్ని గెలిపించాలని.. ఆ శక్తి మీ చేతుల్లోనే ఉందని నారా భువనేశ్వరి అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆమె మూడు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. టీడీపీ అధినేత, చంద్రబాబును స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టు చేయడంతో పలువురు మృతిచెందారు. ఆయా కుటుంబాలను పరామర్శించేందుకు 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో మూడు రోజులు పరామర్శించారు. కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 16మంది కార్యకర్తల కుటుంబాలను కలుసుకుని ధైర్యం చెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున రూ.48 లక్షలు అందజేశారు. పర్యటన అనంతరం మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు.

## మాగుంటతో బాలినేని భేటీ

**వారిద్దరినీ కలిసిన మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి**

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 26: వైసీపీ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమావేశమయ్యారు. శుక్రవారమిక్కడ ఎంపీ కార్యాలయంలో సుమారు గంటన్నర పాటు చర్చలు జరిగాయి. వీరు చర్చలు జరుపుతున్న సమయంలోనే దర్శి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వచ్చి కలిశారు. చర్చల అనంతరం బయటకు వచ్చిన బాలినేని.. భోజనానికి మాత్రమే వచ్చానని, తమ మధ్య ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదని విలేకరులకు చెప్పారు. ఒంగోలు ఎంపీ సీటుపై సీఎం నిర్ణయమే ఫైనల్ అని తెలిపారు. మాగుంట మాత్రం నా దారి నేను చూసుకోక తప్పదుగా అని వారితో అన్నట్లు తెలుస్తోంది.

## నా సత్తా ఏమిటో చూపిస్తా: ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి, జనవరి 26: 'నేను ఇక్కడే ఉంటా.. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో నా సత్తా ఏమిటో చూపిస్తా.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా' అని ఏలూరు జిల్లా చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తేల్చి చెప్పారు. శుక్రవారం ఎమ్మెల్యే కారుపై ఉన్న 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లు తొలగించడాన్ని గమనించిన విలేకరులు ఆయనను పలకరించగా.. వైసీపీ అధిష్ఠానంపై ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తనకు సీటు కేటాయించకపోవడంపై అభిమానులు ఫోన్ చేసి అడుగుతున్నారని, 30 వరకు వేచి చూడండి.. తరువాత ఏం జరుగుతుందో మీరే తెలుసుకుంటారని వారికి చెబుతున్నట్లు వివరించారు. గెలుపు, ఓటమి కాదని, తన సత్తా ఏమిటో చూపించడమే తన లక్ష్యమన్నారు.

## వైసీపీ, టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలకు నోటీసులు

**29న విచారణకు రావాలని స్పీకర్ ఆహ్వానం**

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ, టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు విచారణకు హాజరుకావాలని స్పీకర్ నోటీసులు జారీ చేశారు. 29న స్పీకర్ కార్యాలయంలో అనర్హత పిటిషన్లపై విచారణ జరగనున్నది. ఆ రోజు ఉదయం వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు, మధ్యాహ్నం టీడీపీ రెబల్స్ స్వయంగా వచ్చి, వివరణ ఇవ్వాలని స్పీకర్ పేషీ కోరింది. కాగా, వివరణ ఇవ్వడానికి 30 రోజుల గడువు కావాలని వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు లేఖ రాశారు.

## 92 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో 92 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలతో ప్రమేయమున్న అధికారులను, సొంత జిల్లాకు చెందిన అధికారులను బదిలీలు చేయాలన్న కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# అడ్డొస్తే చెల్లెలైనా.. అంతే!


షర్మిలపైనా వైసీపీ సోషల్ మీడియాలో దాడి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రశ్నిస్తే... వేధిస్తారు. నిలదీస్తే... కేసులు పెడతారు. తప్పులు ఎత్తి చూపితే... సహించలేరు. చివరికి... సోషల్ మీడియాలో రకరకాల దూషణలు, నీచమైన వ్యాఖ్యలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడతారు. మహిళలైతే మరింత దారుణంగా వేధిస్తారు. ఇది... వైసీపీ మార్కు 'సోషల్ మీడియా' అరాచకం! ఇప్పటిదాకా విపక్ష నేతలు, సానుభూతిపరులకు మాత్రమే ఎదురైన ఈ అనుభవం... ఇప్పుడు స్వయంగా వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ సోదరి వైఎస్ షర్మిలకూ ఎదురవుతోంది. పీసీసీ అధ్యక్షురాలి హోదాలో జగన్ సర్కారు లోపాలను ఎత్తిచూపడం మొదలుపెట్టగానే... షర్మిలపై వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ మద్దతుదారుల దాడి మొదలైంది. వ్యక్తిగత జీవితాన్ని కూడా టార్గెట్ చేస్తున్నారు. చివరికి... తన కుమారుడి వివాహానికి ప్రతిపక్ష నేతలను ఆహ్వానించడంపైనా నీచ వ్యాఖ్యలే!

### స్పందించని జగన్...

తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎవరైనా చిన్న పోస్టు పెడితే సీబీడీని ప్రయోగించి అరెస్టు చేయించిన జగన్.. ఇప్పుడు తన సొంత చెల్లెలిపై సోషల్ మీడియాలో దారుణమైన కామెంట్లు చేస్తున్నా స్పందించడం లేదు. అంటే... ఇది జగన్ దృష్టికి రాలేదా? లేక... అన్నీ తెలిసీ మౌనంగా ఉన్నారా? పరోక్షంగా 'తాడేపల్లి' శిబిరమే దీనిని ప్రోత్సహిస్తోందా? అనే అంశంపై చర్చ జరుగుతోంది.

### గతాన్ని మరిచిపోయి..

గతంలో అవినీతి కేసుల్లో జగన్ జైలుకు వెళ్లినపుడు, వైసీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు షర్మిల అండగా ఉన్నారు. 'జగనన్న బాణాన్ని' అంటూ వైసీపీ తరఫున ఊరూరా ప్రచారం చేశారు. పాదయాత్ర కూడా చేశారు. జగన్ కోసం, వైసీపీ కోసం షర్మిల ఎంతో కష్టపడ్డారు. అయితే చెల్లి షర్మిల సేవలను పార్టీకి వినియోగించుకోవడమే కానీ జగన్ ఏనాడూ ఆమెకు రాజకీయ పదవులు ఇవ్వలేదు. ఇక ముఖ్యమంత్రి అయ్యాక ఆమెను పూర్తిగా పక్కన పెట్టారు. షర్మిలను రాజకీయంగా ఎదగనివ్వలేదు. దీంతోపాటు పలు కారణాల వల్ల వారిద్దరి మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది. ఇది ఒక్క రోజులో జరిగింది కాదు. తొలుత ఏపీలో అన్నను నేరుగా ఢీకొట్టడానికి ఇష్టపడని షర్మిల తెలంగాణకు పరిమితమయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి... పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో... కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలి హోదాలో జగన్ సర్కారుపై ప్రశ్నలు సంధిస్తున్నారు. దీనిని వైసీపీ నేతలు, జగన్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

### ఇరకాటంలో జగన్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నీచరాజకీయాలు చేస్తోందని, తమ కుటుంబంలో చీలిక తెస్తోందని పరోక్షంగా షర్మిలను ఉద్దేశిస్తూ జగన్ తాజాగా వ్యాఖ్యానించారు. దీంతోపాటు వైసీపీ తరఫున సజ్జల రామకృష్ణా రెడ్డి తదితరులు చేస్తున్న విమర్శలకు షర్మిల ఎప్పటికప్పుడు ఘాటుగా బదులిస్తున్నారు. సొంత చెల్లెలు చేస్తున్న విమర్శలు, లేవనెత్తుతున్న అంశాలు జగన్‌ను ఇరకాటంలో పెడుతుండటం నిజం. ఈ నేపథ్యంలోనే షర్మిలపై సోషల్ మీడియాలో రోజురోజుకూ దాడి తీవ్రమవుతుండటం గమనార్హం!

### ఈ ప్రశ్నలకు బదులేదీ?

పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత షర్మిల లేవనెత్తిన అంశాలివి..

- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎందుకు తేలేదో ప్రజలకు చెప్పాలి. గతంలో టీడీపీ ఎంపీలను రాజీనామా చేయాలన్న జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నారు?
- మద్య నిషేధం చేసి ఓటు అడుగుతామన్నారు. మద్యనిషేధం లేదు. రోడ్లు లేవు. పోలవరం లేదు. మెట్రో లేదు. ఇప్పుడు ఓటు అడిగే అర్హత లేదు.
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా మైనింగ్, ఇసుక, మద్యం మాఫియానే. దోచుకోవడం.. దాచుకోవడమే.
- మూడు రాజధానులు కాదు కనీసం ఒక్క రాజధాని అయినా కట్టారా? విజయవాడలో మెట్రో ఉందా?
- బీజేపీకి జగన్ తొత్తుగా మారారు. ఆ పార్టీతో కంటికి కనిపించని పొత్తు ఉంది. స్వలాభం కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. మోదీకి వైసీపీ ఎంపీలు ఊడిగం చేస్తున్నారు. బీజేపీకి వైసీపీ అమ్ముడుపోయింది.
- పోలవరం ప్రాజెక్టుకు 90 శాతం నిధులు ఇస్తామన్న కేంద్రాన్ని జగన్ ప్రభుత్వం ప్రశ్నించలేకపోతోంది.
- జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. గత 10 ఏళ్లలో 10 లక్షల కోట్ల అప్పులు చేశారు.
- దాదాపు 70 వేల కోట్లు విలువ చేసే గంగవరం పోర్టును స్వలాభం కోసం అదానీకి 600 కోట్లకే కట్టబెట్టావు. స్వప్రయోజనం కోసం ప్రజల సొమ్మును, ప్రజలను కూడా తాకట్టు పెడతావా?
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సర్వనాశనం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులకు భరోసా ఏదీ?
- రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉంది. ప్రత్యేక హోదా ఉంటే పరిశ్రమలు వచ్చేవి. ఐదేళ్లుగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు.
- ఐదేళ్లలో ఒక్క జాబ్ కేలండర్ కూడా లేదు. యువతను మోసం చేశారు.
- రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వైవీ సుబ్బారెడ్డి చూపిస్తామన్నారు. మెట్రో, పోలవరం, రాజధాని, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడెక్కడ చేశారో చూపించండి.
- దళితులపై వంద శాతం దాడులు పెరిగాయి.
- మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరిగినా ఓ క్రిస్టియన్‌గా జగన్ స్పందించారా? అసలు వీళ్లు మనుషులేనా?

# కాదని అమ్మతో చెప్పించగలరా?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తా.. నేను నమ్మిన దేవుడిపైనా చేస్తా. అక్రమంగా సంపాదించుకోవడానికి భర్తతో కలిసి జగన్ వద్దకు వెళ్లానని అభాండాలు వేస్తున్న మీరు ప్రమాణం చేస్తారా? లేక... కుటుంబ విషయాలన్నీ తెలిసిన మా అమ్మతో చెప్పించగలరా? అభాండాలు వేస్తే పైన దేవుడున్నాడు జాగ్రత్త" అని షర్మిల హెచ్చరించారు.

### 'రెడ్డి'ని కాకుండా ఎలా ఉంటా..

'వైఎస్' ఇంటి పేరు, 'పేరు చివర 'రెడ్డి' అని ఎలా పెట్టుకుంటారంటూ వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. పులి కడుపున పులే పుడుతుందని, ఎవరు అవునన్నా.. కాదన్నా వైఎస్ కుమార్తెనైన తాను మాత్రం వైఎస్ షర్మిలారెడ్డినేనని స్పష్టం చేశారు. 'నాలో ఉన్నది వైఎస్ రక్తమే. నేను ఆయన కుమార్తెను అయినప్పుడు వైఎస్ షర్మిలను కాకుండా ఎలా ఉంటాను? నాకు కుమారుడు పుడితే తన తండ్రి పేరు పెడతానని వైఎస్ స్వయంగా 'రాజారెడ్డి' అని పేరు పెట్టారు' అని చెప్పారు.

### విగ్రహాలు సరే... సామాజిక న్యాయం ఏదీ?

భారీ విగ్రహాలు పెట్టినంత మాత్రాన పేదల ఆకలి తీరదని షర్మిల అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం రూపొందించారని.. కానీ ఆయన ఇచ్చిన రాజ్యాంగాన్ని కొంత మంది నియంతల్లా కాలరాస్తున్నారని జగన్‌పై పరోక్ష విమర్శలు చేశారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. కొంతమంది అంబేడ్కర్‌కు పెద్దపెద్ద విగ్రహాలు పెడుతున్నారని, కానీ 100 శాతం సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. 'ప్రశ్నించిన దళిత యువకుడికి గుండు గీసి అవమానించారు. దళిత డ్రైవర్‌ను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి పడేసిన ఎమ్మెల్సీని పక్కన పెట్టుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించి సొంత అవసరాలకు ఉపయోగించుకున్నారు' అని మండిపడ్డారు. దళితులపై కపట ప్రేమ చూపిస్తున్నవారికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇతర అంశాలపై షర్మిల వ్యాఖ్యలు ఆమె మాటల్లోనే...

### జగన్ క్రైస్తవుడైనా..

జగన్ ఒక క్రైస్తవుడై ఉండి మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు జరిగితే బీజేపీపై వేలెత్తి మాట్లాడలేదు. కట్టుబానిస మాదిరిగా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఈ రాష్ట్ర ప్రజలను కూడా ఆ పార్టీకి బానిసలుగా మారుస్తున్నారు. క్రైస్తవులకు, ముస్లింలకు భరోసా లేకుండా పోయింది.


### అభివృద్ధి లేదు.. ఉద్యోగాలు రావు

రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి కూడా లేదు. ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ కేలెండర్ అని చెప్పి జగన్ మాట తప్పారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి కాబట్టి నోటిఫికేషన్ ఇస్తామంటున్నారు. మరి ఉద్యోగాలు ఎప్పుడిస్తారు? జగనన్న తానేదో బటన్ నొక్కుతున్నాను.. ప్రజలకు డబ్బులొస్తున్నాయంటున్నారు. అసలు ఆ డబ్బులకు, ప్రజలకు నెలవారీగా అవుతున్న ఖర్చులకు పొంతన ఎక్కడుంది?

### ప్రాజెక్టులు కొట్టుకుపోయాయ్..

రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంపై ప్రత్యేక దృష్టి పెట్టి.. ఇరిగేషన్‌కు పది శాతం నిధులిస్తే.. చంద్రబాబు తొమ్మిది శాతం నిధులు ఇచ్చారు. జగన్ ఐదు శాతం ఇచ్చి, అందులో 31 శాతమే ఖర్చు చేశారు. ప్రాజెక్టులు కొట్టుకుపోయినా మరమ్మతు చేయించుకోలేని దారుణమైన స్థితిలో ఉన్నారు. రైతులకు వైఎస్ చేసిన దానితో పోల్చితే జగన్ చేసింది సున్నా. రైతులకు సాయం, పంటనష్టం రెండూ లేవు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వైఎస్ కల. జగన్ జమానాలో దాని ఊసేలేదు. ఒక్క అవకాశం ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానంటే ప్రజలు ఆయన్ను సీఎంను చేశారు. 22 మంది ఎంపీలను గెలిపించినా.. హోదా అడగని జగన్.. స్వప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ దగ్గర మోకరిల్లారు. కనీసం పోలవరం పనులైనా పూర్తయితే పంటలు పండేవి. జగన్ చివరకు దానినీ తాకట్టు పెట్టేశారు. మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించి ఇప్పుడు ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారు. రూ.8 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌ను రుణ ఊబిలో ముంచేశారు. కనీసం స్పెషల్ ప్యాకేజీ కూడా తీసుకురాలేని దుస్థితిలో ఉన్న వైసీపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి.

# పొత్తుతోనే ముందుకు..!



**ఒంటరిగా వెళ్తే సీట్లు వచ్చినా.. ప్రభుత్వం రాదు: పవన్**

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 'ఒంటరిగా వెళ్తే కచ్చితంగా కొన్ని సీట్లు సాధిస్తాం. కానీ ప్రభుత్వంలోకి అడుగు పెడతామో లేదో తెలియదు' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. పొత్తులతోనే వెళ్దామని తన పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. గతంలో ఎదురైన ఓటమి తన ఆలోచనావిధానాన్ని మార్చేసిందని.. ఈసారి టీడీపీతో కలిసే పనిచేద్దామని తెలిపారు. జగన్ టీడీపీని టార్గెట్ చేసి మనల్ని వదిలేస్తే అప్పుడు ఒంటరిగా పోటీ చేసేవాడినేమోనని వ్యాఖ్యానించారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనసేన కార్యాలయంలో జెండా వందనం అనంతరం ఆయన ప్రసంగించారు. ఎన్ని విపత్కర పరిస్థితులు వచ్చినా, జగన్ నడిపే ఈ ప్రభుత్వం 2024లో మనకు కనిపించకూడదని తేల్చిచెప్పారు. '2019లో 153 స్థానాల్లో పోటీ చేశాం. 30-40 స్థానాల్లో మనల్ని గెలిపించి ఉంటే ఇప్పుడు ఒంటరిగా వెళ్లడానికి సంపూర్ణ హక్కు ఉండేది. కనీసం నన్ను గెలిపించి, 30 స్థానాలిచ్చి ఉంటే ఒంటరిగా నిలబడండి అన్న మీ మాట వింటాను. ఫలితాలు చూపించకుండా ఎలా అడుగుతారు' అని ప్రశ్నించారు. మండపేట నుంచి చాలామంది నాయకులు వచ్చారని.. మనతో పొత్తులో ఉండీ చంద్రబాబు మండపేట సీటుకు అభ్యర్థిని ప్రకటించారని చాలా బాధపడ్డారని.. వారితో తాను ఏకీభవిస్తున్నానని తెలిపారు. 'ఆ నియోజకవర్గంలో మనకు 28శాతం ఓటు బ్యాంకు ఉంది. నిన్ననే టీడీపీ వాళ్లతో దీనిపై మాట్లాడాను. పొత్తు ధర్మం ప్రకారం అలా ప్రకటించకుండా ఉండాల్సింది. మండపేట నాయకులకు క్షమాపణ చెబుతున్నాను' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

నాలుగు దశాబ్దాలుగా సొంతంగా పార్టీని నడుపుతున్న వ్యక్తులు. పొత్తు అనేది వారికి ఇరుకు చొక్కా తొడిగినట్లు ఉంటుంది.

పొత్తులో కొన్ని ఆటుపోట్లు తప్పవు.. భరించాలి. మనకు కావలసింది ప్రజా సంక్షేమం.

బీజేపీ నేతలు మనందరితో మర్యాదగా మాట్లాడుతున్నారు. గౌరవిస్తున్నారంటే 18 లక్షల ఓట్లు సాధించగలిగాం కాబట్టే!

\- పవన్ కల్యాణ్

### స్థానిక సంస్థల్లో మూడో వంతు మనకే!

టీడీపీతో పొత్తు విషయానికి వస్తే ఒక మాట ఎక్కువ తక్కువ ఉండవచ్చు. పైస్థాయి నాయకులు మాట్లాడే మాటలతో కింద స్థాయిలో కొంచెం ఇబ్బందికర పరిస్థితులు ఉండవచ్చు. ఉమ్మడి రాజకీయ కార్యాచరణలో స్థానిక సంస్థల నుంచి కార్పొరేషన్ల వరకు జనసేన మూడో వంతు సీట్లు తీసుకుంటుంది. కనీసం మూడో వంతు మనం వార్డు మెంబర్లుగా ఉండాలి. ఓటు బదిలీ అవ్వాలంటే ఇది కచ్చితంగా ఆమోదించాలి. నేను ఎమ్మెల్యే సీట్ల వద్ద ఆగిపోవడం లేదు. గ్రామ, వార్డు, పంచాయతీ స్థాయికి పార్టీ ఉండాలి. ప్రత్యేక పరిస్థితుల్లో టీడీపీ వాళ్లు రెండు సీట్లు ప్రకటించారు. రిపబ్లిక్ డే రోజున ప్రత్యేక పరిస్థితుల్లో ఈ రోజు 'ఆర్' బాగుంటుందనే రాజోలు, రాజానగరం సీట్లు ప్రకటిస్తున్నాను. ఈ పర్యాయం నన్ను నమ్మండి. వ్యూహం నాకు వదిలేయండి. ఐదేళ్ల సమయం ఇవ్వండి. మీ గౌరవానికి ఏమాత్రం భంగం కలుగకుండా గుర్తించే బాధ్యత తీసుకుంటా. విడిపోయి పలుచపడ్డాం. కలిసి పనిచేసి ప్రభుత్వాన్ని సాధించుకుందాం.

### టీడీపీ వాళ్లనూ అర్థం చేసుకోవాలి..:

కొన్ని ప్రత్యేక పరిస్థితులుంటాయి. టీడీపీ వాళ్లను కూడా మనం అర్థం చేసుకోవాలి. లోకేశ్ ఆ రోజు మా నాన్నే ముఖ్యమంత్రి అని అన్నారు. కానీ ఇలాంటివి పెద్ద మనసుతో వదిలేస్తాను. ఒక పార్టీని నడుపుతూ.. మూడు సార్లు సీఎంగా ఉన్న వ్యక్తుల నోట సహజంగానే మాట వచ్చేస్తుంది. మనం నిలబడితే ఇంట్లో వాళ్లే ఓటు వేయని వ్యక్తులు చాలా మంది ఉన్నారు. అందరినీ కన్విన్స్ చేయలేం. ప్రజాస్వామ్యంలో తప్పు జరిగితే అభిప్రాయం చెప్పే హక్కు ఉంది. అసలు అభిప్రాయమే చెప్పకూడదంటే ఎలా? ఇది ప్రజల హక్కు. నాయకుడి ముఖ్య లక్షణం తిట్లు భరించడం. ఎవరూ తిట్టకూడదు, ఎదురు తిరగకూడదంటే ఇది రాజరికం కాదు జగన్‌రెడ్డీ! ఇది ప్రజాస్వామ్యం.. జగన్‌స్వామ్యం కాదు. ప్రజలు ఎదురు తిరుగుతారు.. మాట్లాడతారు.. విను, భరించు. పద్ధతులు మార్చుకో. జగన్ సొంత చెల్లినే వదిలిపెట్టడం లేదు. మనల్నెలా వదిలి పెడతాడు? ఊరంతా శత్రువులను పెట్టుకున్న నాయకుడితో వైసీపీ నాయకులు పని చేస్తున్నారు. అత్యంత జాగ్రత్తంగా ఉండాలి. మీకు కష్టాలు వస్తే పవన్ దగ్గరకే రావాలని గుర్తుపెట్టుకోండి. నాది చాలా పెద్ద మనసు. క్షమించడం మానవ ధర్మం.

### మార్చి చివర్లో ఎన్నికలు..

మార్చి చివర్లో రాష్ట్రంలో ఎన్నికలు రాబోతున్నాయి. ఏపీ చాలా కష్టాల్లో కూరుకుపోయింది. ఐదేళ్లలో మన వీర మహిళలు, జనసైనికులు, మననాయకుల పోరాట పటిమ చాలా బలంగా చూపించాం. ఆ పోరాట బలం 2024లో రాజకీయ బలం కావాలన్న దిశగా మనం అడుగులు వేస్తున్నాం. ఓట్ల కోసం మతాన్ని వాడను. క్రైస్తవ సోదర, సోదరీమణులకు నావైపునుంచి హామీ ఇస్తున్నాను. నా అభిమానుల్లో భిన్నమైన మతాలు, కులాల వారున్నారు. నా ఇంట్లో నా భార్య క్రిస్టియన్. సెక్యూరిటీలో అత్యధిక మంది ఇస్లాం మతానికి చెందిన వారున్నారు. ఒకటీ రెండు కాదు.. అత్యధికంగా దళితులపై దాడులు జరిగిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులు అత్యధికంగా నమోదయ్యాయి. 30వేల మంది ఆడపిల్లలు అదృశ్యమయ్యారు? ఏం జరిగిందన్న దానిపై వివరణ ఇవ్వాలి.. కానీ ముఖ్యమంత్రి ఇవ్వరు. అకారణంగా కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్నారు.

# పవన్ ప్రకటనను స్వాగతిస్తున్నాం

- **జనసేన పోటీ చేసే సీట్లనే ప్రకటించారు**
- **టీడీపీకి ఎలాంటి ఇబ్బందీ లేదు**
- **రెండు పార్టీల మధ్య చాలా సీట్లపై స్పష్టత**
- **వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోంది**
- **టీడీపీ, జనసేన శ్రేణులు నమ్మొద్దు: టీడీపీ**

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జనసేనాని పవన్ కల్యాణ్ ఆ పార్టీ పోటీ చేసే సీట్లనే ప్రకటించారని టీడీపీ పేర్కొంది. ఆయన ప్రకటనతో తమ పార్టీకి ఏ ఇబ్బందీ లేదని, ఆ ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలిపింది. 'ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక సీటును మా పార్టీ అధినేత ప్రకటించారు. పవన్ అదే జిల్లాలో రెండు సీట్లు ప్రకటించారు. అవగాహనలో భాగంగానే ఈ ప్రకటనలు జరిగాయి' అని టీడీపీ పేర్కొంది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రెండు పార్టీల మధ్య ఏదో అయిపోయిందని భ్రమించి సీఎం జగన్ రెడ్డి పెంపుడు కుక్కలు ఉదయం నుంచి టీవీల ముందు మొరుగుతున్నాయని, పొత్తు చూసి వైసీపీ ఎంత భయపడుతోందో ఇదే నిదర్శనమన్నారు. 'వైసీపీలోని కాపు నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ ఏదేదో మాట్లాడుతున్నారు. కాపులకు తీవ్ర అన్యాయం జరిగిపోతోందని పెడబొబ్బలు పెడుతున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కాపులకు 5% రిజర్వేషన్ ఇచ్చారు. జగన్ రాగానే దానిని రద్దు చేశాడు. ఈ కాపు నేతలు దీనిపై ఏనాడైనా మాట్లాడారా? కులం పేరు చెప్పుకొని బతుకుతున్న మీకు రిజర్వేషన్లపై మాట్లాడాల్సిన బాధ్యత లేదా? ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి మాదిరిగా మా సీట్లు మేం ప్రకటించుకొంటే వీళ్లకేమిటి బాధ? టీడీపీ, జనసేన పార్టీల పొత్తుతో వైసీపీ నేతలకు ప్యాంట్లు తడిసిపోతున్నాయి. ఈ పొత్తును ఎలా విడగొట్టాలి, చెడగొట్టాలని గోతికాడ నక్కల మాదిరిగా కూర్చున్నారు. పొత్తు దెబ్బకు కనీసం ఇరవై సీట్లు అయినా వస్తాయా రావా అనే భయం వారిలో పట్టుకొంది. తాను ఇంటికి పోతున్నానని జగన్ బహిరంగంగా చెబుతున్నారు. మీ పార్టీలో ఎవరు ఎక్కడ పోటీ చేస్తారో తెలియదు. మీ సీట్లు మీకు వస్తాయో లేదో తెలియదు. సీట్లు వచ్చిన వారిలో కొందరు మీరూ వద్దు... మీ సీటూ వద్దని వదిలేసి పోతున్నారు. జగన్ ఫోన్ చేస్తాడేమోనని కొందరు నాయకులు ఫోన్లు స్విచాఫ్ చేసుకొని తిరుగుతున్నారు. ముందు మీసంగతి చూసుకోండి' అని అన్నారు.

### ఆ ప్రచారాన్ని నమ్మొద్దు

టీడీపీ, జనసేన పార్టీలు బహిరంగంగా పొత్తు పెట్టుకొన్నాయని, వైసీపీ మాదిరిగా తమకు చీకటి పొత్తులు లేవని బొండా ఉమా అన్నారు. అధికారంలోకి వస్తే కేంద్రం మెడలు వచ్చి హోదా తెస్తామన్న పెద్ద మనుషులు సొంత కేసుల కోసం రాష్ట్రాన్ని ముంచేశారని విమర్శించారు. టీడీపీ, జనసేన పార్టీలు ఏది చేసినా బహిరంగంగా చేస్తాయన్నారు. సీట్ల వివరాలు అందరి ముందే ప్రకటిస్తాయని వెల్లడించారు. ఇరు పార్టీల మధ్య చాలా సీట్ల విషయంలో స్పష్టత వచ్చిందని తెలిపారు. వైసీపీ వదులుతున్నసోషల్ మీడియా జాబితాలను రెండు పార్టీల శ్రేణులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

### నేడు ఉరవకొండ, పీలేరులో బాబు సభలు

'రా కదలిరా' కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు నేడు పీలేరు, అనంతపురం జిల్లా ఉరవకొండలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తిరుపతికి చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 11.40 గంటలకు పీలేరు చేరుకుని వేపులబైలు గ్రామంలో నిర్వహించే రా కదలిరా బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 4 గంటలకు ఉరవకొండ మండలంలోని లత్తవరం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నిర్వహించే రా కదలిరా సభకు హాజరై చంద్రబాబు ప్రసంగిస్తారు.

### షర్మిల వ్యాఖ్యలతో బాబుకేం సంబంధం

**నక్కా ఆనంద్‌బాబు**

అన్న జగన్‌పై షర్మిల చేసిన ఆరోపణలకు, చంద్రబాబుకీ ఏంటి సంబంధమని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు వైసీపీ నేతలను ప్రశ్నించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బాబాయి హత్య తర్వాత తల్లి, చెల్లితో జగన్‌కు దూరం పెరిగిన విషయం లోకమంతా తెలుసన్నారు. 2019లో కోడికత్తి డ్రామా ఆడిన జగన్, ఇప్పుడు ఫ్యామిలీ డ్రామాకు తెరలేపాడనన్నా, షర్మిల వ్యాఖ్యలపై సజ్జల, వైసీపీ నేతల మాటలు జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

## టీడీపీలోకి వీరశివారెడ్డి, కొలికపూడి

**బాబు సమక్షంలో పలువురు చేరిక**

టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు నేతలు శుక్రవారం టీడీపీలో చేరారు. కడప జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, ఏపీ పరి రక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు, ఆదోనికి చెందిన ఏసీ శ్రీకాంత్‌రెడ్డిలు పార్టీలో చేరగా, వారికి చంద్రబాబు కండువాలు వేసి స్వాగతం పలికారు. టీడీపీలో చేరిన నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం, యువత భవిష్యత్ కోసం వైసీపీ ప్రభుత్వ విధ్వంసపాలనకు చరమగీతం పాడేందుకు, టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

### జేసీ కుమారుడికి సీటు ఇవ్వలేం

జేసీ దివాకర్‌రెడ్డి కుటుంబం శుక్రవారం చంద్రబాబును కలిసింది. జేసీ దివాకర్‌రెడ్డి, ఆయన తనయుడు పవన్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. అస్మిత్‌రెడ్డి ప్రస్తుతం తాడిపత్రి ఇన్‌చార్జిగా ఉన్నారు. పవన్‌కు ఎక్కడా అవకాశం దొరకలేదు. రాబోయే ఎన్నికల్లో ఆయనకు అనంతపురం ఎంపీ సీటు ఇవ్వాలని వారు కోరారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు ఎంపీ సీట్లనూ ఈసారి బీసీలకే ఇవ్వాలని నిర్ణయించామని.. ఎంపీ సీటు ఇవ్వడం సాధ్యం కాదని బాబు చెప్పినట్లు సమాచారం.

## షర్మిలకు పరువు ఉందా?: ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి, జనవరి 26: 'వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెగా పుట్టిన షర్మిలకు పరువు ఉందో? లేదో? తెలియదుగానీ... మొత్తం ఆ కుటుంబం పరువు తీసిన వ్యక్తి ఆమె. వైఎస్ కుటుంబానికి పెద్ద మచ్చ' అని విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మహాభారత సంగ్రామంలో శిఖండిలా షర్మిల వ్యవహరిస్తోంది. ప్రతిపక్షాలు అలా ఆమెను వాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి. జగన్.. ఎమ్మెల్యేలకు, ప్రజలకు దొరకరని, ఎక్కడికీ వెళ్లరని, బీజేపీతో కుమ్మక్కయ్యారని చేస్తున్న విమర్శలు సరికావు. షర్మిల గురించి ఎలాంటి భాష మాట్లాడినా తప్పులేదు. తెలంగాణ నుంచి తగిలేస్తే... జగన్‌కు రావాల్సిన ఓట్లలో కొన్నింటినైనా చెడగొడదామన్న కుట్రతో ఇక్కడకు వచ్చింది. చంద్రబాబు, పవన్, పురందేశ్వరి... ఇలా అందరూ ఒక్కటైనా జగన్‌ను ఏమీ చేయలేరు' అని శంబంగి అన్నారు.


సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న బొత్స, అమర్‌నాథ్, వైవీ

## టార్గెట్ 3 లక్షలు.. ఏర్పాట్లు 50 వేలకే!

**విశాఖలో నేడు వైసీపీ 'సిద్ధం సభ'**

విశాఖపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): "మీరు ఏం చేస్తారో తెలీదు. ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 10 వేల మంది చొప్పున ప్రజలను తీసుకురావాల్సిందే. వారి ప్రయాణ, భోజన ఖర్చులు భరించాల్సిందే. సభను విజయవంతం చేయాల్సిందే" ఇదీ.. విశాఖ శివారులోని సంగివలసలో అధికార పార్టీ వైసీపీ శనివారం 'సిద్ధం' పేరిట నిర్వహించనున్న బహిరంగ సభకు ఆ పార్టీ పెద్దలు క్షేత్రస్థాయి నాయకులకు పెట్టిన టార్గెట్. ఏకంగా 3 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయ కర్తలు పార్టీ తీరుపై గుర్రుగా ఉన్నారు. ఇంత మందిని తరలించలేమని, ఖర్చులు కూడా భరించలేమని అంతర్గత చర్చల్లో చెబుతున్నారు. మరోవైపు, జనాన్ని తరలించేందుకు ఉత్తరాంధ్రలోని మూడు ప్రధాన రీజియన్ల నుంచి వెయ్యికి పైగా ఆర్టీసీ బస్సులను సిద్ధం సభ కోసం ప్రభుత్వ పెద్దలు కేటాయించారు. వీటితోపాటు మూడు జిల్లాల్లోని ప్రైవేటు విద్యాసంస్థల నుంచీ వాహనాలను బలవంతంగా తరలించారు. దీంతో శుక్రవారం రాత్రికే ఆయా బస్సులు నిర్దేశిత ప్రాంతాలకు తరలి వెళ్లిపోయాయి.

### ఎందుకింత హడావుడి?

'సిద్ధం' సభకు ఇంత హడావుడి చేయడం వెనుక.. ఇటీవల టీడీపీ 'యువగళం-నవశకం' పేరుతో నిర్వహించిన భారీ సభే కారణమని తెలుస్తోంది. భోగాపురం మండలం పోలిపల్లిలో 'యువగళం-నవశకం' పేరుతో టీడీపీ ఎన్నికల సమర శంఖం పూరించిన విషయం తెలిసిందే. టీడీపీ సభకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు లక్షల సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ సభను మించిపోయేలా, అంతకుమించి జనాలను ఈ సభకు తరలించాలని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. అందుకే నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు జనాన్ని తరలించే టార్గెట్లు విధించి భారీ హడావుడి చేస్తున్నారు. ఉత్తరాంధ్రాలోని 34 నియోజకవర్గాలకు కలిపి ఇక్కడ సభ నిర్వహిస్తున్నందున, పైగా ఎన్నికలకు ముందు కావడంతో ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 10 వేల మంది చొప్పున జనాలను సమీకరించాలని ఆయా నేతలకు పైనుంచి గట్టి ఆదేశాలు అందాయని తెలిసింది. సభకు వచ్చే వారి రవాణా, భోజన ఖర్చులను నియోజకవర్గ బాధ్యులే చూసుకోవాలని పార్టీ స్పష్టం చేసింది. మొత్తంగా మూడు లక్షల మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### 50 వేల మందికే ఏర్పాట్లు

సంగివలసలోని అనిట్స్ మెడికల్ కాలేజీ సమీపంలో 'సిద్ధం' సభకు స్థలాన్ని ఎంపిక చేశారు. 3 లక్షల మందిని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న నాయకులు కేవలం 50 వేల మందికే ఏర్పాట్లు చేయడంపై పైనపటారం..లోనలొటారమేనా? అని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## అమర జవాన్‌కు శౌర్య పతకం

సత్తెనపల్లి రూరల్, జనవరి 26: ఛత్తీస్‌గఢ్‌లో 2021లో నక్సల్స్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించిన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శాఖమూరి మురళీకృష్ణకు శౌర్య పతకాన్ని ప్రకటించారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా అందుకున్న మెడల్ కాపీని శుక్రవారం సీఆర్‌పీఎఫ్ అధికారులు గుడిపూడి వచ్చి మురళీకృష్ణ తల్లిదండ్రులు రవీంద్రబాబు, విజయకుమారిలకు అందజేశారు. సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఆర్‌కే పాండా, డిప్యూటీ కమాండెంట్ ఎంపీ రజిత గ్రామంలోని మురళీకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సత్తెనపల్లి పట్టణ, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.


మురళీకృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు


ప్రథమ బహుమతి పొందిన పాఠశాల విద్యాశాఖ శకటం



ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆకట్టుకున్న ఏపీ శకటం


గవర్నర్‌తో ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్, చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్ తదితరులు

## సవాళ్లను అధిగమించి పురోగతి

▸▸ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు: గణతంత్ర వేడుకల్లో గవర్నర్

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనేక సవాళ్లను అధిగమించి వివిధ రంగాలలో పురోగతిని సాధించిందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఓపెన్ టాప్ జీపుపై నుంచి వివిధ సాయుధ దళాల పరేడ్‌ను పరిశీలించారు. ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శనను తిలకించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దంపతులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ నజీర్ రాష్ట్ర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. సెక్యులరిజం, సోషలిజం, ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలను ప్రతిబింబిస్తూ ప్రభుత్వం.. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిబద్ధత, అంకితభావాలతో ప్రజలకు సేవలందిస్తోందని తెలిపారు. వారం రోజుల క్రితమే విజయవాడలో ఆవిష్కరించిన 206 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం... ఆయన రచించిన రాజ్యాంగం పట్ల ఉన్న విధేయతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. వివక్ష లేకుండా ప్రతి మారుమూల గ్రామానికి సంతృప్తికర స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు రూ.16 వేల కోట్లతో రాష్ట్రంలో కొత్తగా నాలుగు (రామయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే) ఓడరేవుల నిర్మాణం, రూ.3,200 కోట్లతో భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గవర్నర్ తన ప్రసంగాన్ని ముగిస్తూ... 'రాజ్యాంగ సూత్రాల పట్ల నిబద్ధతతో రాష్ట్రం, దేశ పురోగతి, ప్రజల శ్రేయస్సు కోసం సమష్టిగా పని చేద్దాం. అందరికీ ఉజ్వల భవిష్యత్తును, పెంపొందిస్తూ, ఐక్యత, శాంతి, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేద్దాం' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

### రాజ్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోం

రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం ఘనంగా జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానం మేరకు సీఎం జగన్, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులు తేనీటి విందులో పాల్గొన్నారు. మంత్రులు రోజా, జోగి రమేశ్, ఎమ్మెల్యే , ఎంపీ పాల్గొనగా ప్రతిపక్ష నాయకులు హాజరు కాలేదు.

# న్యాయానికి సవాళ్లు

అందరికీ న్యాయ సహాయం కోసం మరింత కృషి.. హైకోర్టులో గణతంత్ర వేడుకల్లో సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

▸▸ సచివాలయంలో వేడుకల్లో సీఎస్, అసెంబ్లీలో చైర్మన్, స్పీకర్...

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): విభిన్న సంస్కృతులు ఉన్న భారతదేశంలో న్యాయం అందించడం సవాళ్లతో కూడుకున్న వ్యవహారమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ అన్నారు. హైకోర్టు వద్ద శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు భద్రతా సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం సీజే మాట్లాడుతూ, 'కుప్పలుగా వచ్చి పడుతున్న కేసుల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలను, సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకోవాలి. సమాజంలో ఇప్పటికీ చాలామందికి న్యాయ సహాయం అందడం లేదు. అలాంటివారికి న్యాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మరింత కృషి జరగాల్సిన అవసరం ఉంది. ఈ దిశలో ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయం' అని అన్నారు. అంతకు ముందు హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకీరామిరెడ్డి, అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరాం, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు, వారి సతీమణులు, విశ్రాంత న్యాయమూర్తులు, రిజిస్ట్రార్‌లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సీజే, న్యాయమూర్తులు హైకోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసనసభాపతి తమ్మినేని సీతారాం విడివిడిగా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. సచివాలయంలోని మొదటి భవనం వద్ద కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తాడేపల్లిలోని వ్యవసాయ, అటవీ అనుబంధ శాఖల కార్యాలయాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు జాతీయ జెండా ఎగురవేశారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ శారదా జయలక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఏపీ ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్‌తో పాటు భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


హైకోర్టు వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్



### విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి

ఈసారి గణతంత్ర వేడుకల్లో మొత్తం 12 శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వాటిలో విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వితీయ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ శకటం తృతీయ బహుమతికి ఎంపికయ్యాయి. విజేతలకు రాష్ట్ర గవర్నర్ బహుమతులు అందజేశారు. 2019 తరువాత తొలిసారిగా ఈసీ శకటానికి చోటు దక్కింది. 'ఓటుకు సాటి లేదు... నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో పాల్గొన్న ఎన్నికల సంఘం శకటం పలువురిని ఆకర్షించింది.

# కలిసి మురిసిన పద్మవిభూషణులు


వెంకయ్య నాయుడిని సత్కరిస్తున్న చిరంజీవి

▸▸ ప్రతిష్ఠాత్మక పురస్కారం నేపథ్యంలో వెంకయ్య ఇంటికెళ్లి కలిసిన చిరంజీవి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి శుక్రవారం సాయంత్రం కలుసుకున్నారు. ఒకరికొకరు అభినందనలు తెలుపుకొన్నారు. చిరంజీవి స్వయంగా వెంకయ్య నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జై ఆంధ్ర ఉద్యమం సమయంలో తాను కాలేజీలో చదువుతున్నానని, నాడు విద్యార్థి నేతగా ఉన్న వెంకయ్య నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు తరగతులను బహిష్కరించి ఉద్యమంలో పాల్గొన్నామని తెలిపారు. అప్పటి నుంచీ వెంకయ్య తనకు తెలుసని నాటి కాలేజీ రోజుల్ని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత తాను సినిమాల్లోకి రాగా, ఆయన రాజకీయాల్లో ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగారని మెగాస్టార్ పేర్కొన్నారు. 'మేమిద్దరం పార్లమెంట్‌లో కొలీగ్స్‌గా ఉన్నాం. అనేక విషయాలు ఆయనను అడిగి తెలుసుకొనేవాడిని. వెంకయ్య నాయుడు గారు స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి. ఆయనను చూసి అందరూ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఆయనతోపాటు నాకు కూడా పద్మవిభూషణ్ లభించటం నా సంతోషాన్ని ద్విగుణీకృతం చేసింది. ఇద్దరు తెలుగువాళ్లం. స్నేహితులం. మాకు ఒకేసారి ఒకే అవార్డు రావటం థ్రిల్లింగ్ అనిపించింది. మేమిద్దరం కలుసుకొని జ్ఞాపకాలు నెమరువేసుకున్నాం' అని చిరంజీవి చెప్పారు.

### 'సో ప్రౌడ్ ఆఫ్ యూ మెగాస్టార్'

తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు రెండు కళ్లు అయితే చిరంజీవి మూడో కన్ను అని వెంకయ్య నాయుడు అభివర్ణించారు. 'మీరు కష్టపడి ఒక్కో అడుగు వేసుకుంటూ ఎవరూ ఊహించని ఎత్తుకు ఎదిగారు. పద్మవిభూషణ్ అవార్డు రావటానికి కావలసిన అన్ని అర్హతలు మీకు ఉన్నాయి. సో ప్రౌడ్ ఆఫ్ యూ మెగాస్టార్' అని చిరంజీవిని వెంకయ్య నాయుడు ప్రశంసించారు. సరైన సమయంలో ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుందన్నారు.

# బెరైటీస్‌ను బొక్కేశారు



(మొదటి పేజ తరువాయి)

బెరైటీస్‌ను దోచుకున్నారు. మంగంపేట బెరైటీస్ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుసగా కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. కంపెనీలు, వ్యాపారులతో అధికారులు కుమ్మక్కవడం ఒక ఎత్తయితే, సొంతంగా బినామీ కంపెనీలను రంగంలోకి దింపి వ్యాపారం చేయడం మరో ఎత్తు. నిబంధనలకు పాతరేసి ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండికొట్టారు. ఫిర్యాదులు వచ్చినా గనుల శాఖ, ఏపీఎండీసీ చర్యలు తీసుకోలేదు. బెరైటీస్ దోపిడీపై విజిలెన్స్ విచారణ జరిపి చర్యలకు సిఫారసు చేసింది. ఏపీఎండీసీలో అసలు దొంగలను కనిపెట్టేందుకు కీలకమైన ఫైళ్లు, సమాచారం ఇవ్వాలని కోరింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మంగంపేట ప్రాజెక్టు అధికారి సహా పలువురిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించింది. అవసరమైతే అరెస్ట్ చేయించి, చర్యలు తీసుకోవాలని కూడా సిఫారసు చేసింది. అధికారులతో పాటు వ్యాపారుల నుంచి కోట్ల రూపాయలు రికవరీ చేయాలని సిఫారసు చేసింది. కానీ ఒక్కరిపైనా చర్యలు లేవు. కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. అంతా సేఫ్‌గా ఉన్నారు. ఇంకేముంది.. మంగంపేట బెరైటీస్ దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.

### బినామీలకు బెరైటీస్

మంగంపేటలో బెరైటీస్ నిల్వలున్న పట్టా భూములను రైతులు మైనింగ్ కోసం ఏపీఎండీసీకి అప్పగించారు. వీరికి పరిహారంగా బెరైటీస్ అమ్ముకునే అవకాశం ఇచ్చారు. అంటే.. మంగంపేట ఏపీఎండీసీ విభాగమే భూములు ఇచ్చిన రైతులకు బెరైటీస్ కేటాయిస్తే, వారు వ్యాపారులకు అమ్ముకుంటారు. తద్వారా వారికి సొమ్ము వస్తుంది. ఇది గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం. దీన్ని ఏపీఎండీసీ అధికారులు దుర్వినియోగం చేశారు. నిర్వాసితుల కింద 225 మందికి బెరైటీస్ కేటాయించగా, అందులో 167 మంది బోగస్ అని విజిలెన్స్ తేల్చింది. వాస్తవానికి 58 మంది నిర్వాసితులకే పరిహారం కింద బెరైటీస్ కేటాయించగా, మిగిలిన వారు అధికారులు, కాంట్రాక్టర్లు సృష్టించిన బినామీలేనని విజిలెన్స్ తేల్చింది. 167 మందిలో 109 మందికి 2.02 లక్షల టన్నుల ఏ గ్రేడ్ బెరైటీస్‌ను సరఫరా చేశారు. ప్రగతి మినరల్స్ సంస్థ ఏపీఎండీసీ ఇచ్చిన అనుమతి కంటే ఎక్కువగా ఏ గ్రేడ్ బెరైటీస్‌ను తరలించుకుపోయింది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విభాగం సమగ్ర విచారణ చేపట్టి సర్కారుకు నివేదిక ఇచ్చింది.

### ముగ్గురిపై కేసులకు సిఫారసు

మంగంపేటలో అప్పట్లో మైన్స్ సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన హెచ్‌డీ నాగరాజపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని విజిలెన్స్ సిఫారసు చేసింది. ఆయన తప్పిదాలు ఏమిటో, వాటి వల్ల జరిగిన నష్టం ఏమిటో వివరంగా పేర్కొంది. మరో సీనియర్ మేనేజర్ డి.వెంకటరమణపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని విజిలెన్స్ సిఫారసు చేసింది. అంతకన్నా ముందు శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. మంగంపేట ప్రాజెక్టులో సీనియర్ సర్వే ఆఫీసర్‌గా పనిచేసిన కె.రామచంద్రారెడ్డిపై కూడా శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని ఆదేశించింది. ప్రగతి మినరల్స్ నుంచి 26.33 కోట్ల రూపాయలను సీనరేజీ ఫీజు కింద రికవరీ చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ వ్యవహారంలో ఇంకా పలు సిఫారసులు చేస్తూ అధికారులపై తీసుకొనే చర్యలను తమకు నివేదించాలని విజిలెన్స్ కోరింది.

### సిఫారసులు బుట్టదాఖలు

గనుల శాఖ ఆదేశం మేరకే విజిలెన్స్ విచారణ జరిగింది. దాదాపు 28 కోట్ల అక్రమాలు జరిగాయని నిగ్గు తేల్చింది. కేవలం ముగ్గురు అధికారుల నిర్వాకం వల్లే 26 కోట్ల విలువైన బెరైటీస్ దోచుకున్నారని లెక్క తేల్చింది. విజిలెన్స్ చేసిన సిఫారసులను అమలు చేయాల్సింది గనుల శాఖనే. ముగ్గురు అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ఏపీఎండీసీని ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన ఏపీఎండీసీ ఆ ముగ్గురిని కాపాడింది. ఆయా అధికారుల నుంచి వివరణ తీసుకొని వదిలేసింది. క్రమశిక్షణ చర్యలే కాదు.. అరెస్ట్, క్రిమినల్ కేసులకు అవకాశమే లేకుండా చేసింది. నాటి మంగంపేట సీనియర్ మేనేజర్, ఏపీఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెచ్.డి.నాగరాజ ఇటీవల రిటైరయ్యారు. పదవీ విరమణ చేసే వరకు ఆయనపై ఏ చర్యలూ తీసుకోలేదు. కనీసం అభియోగాలు కూడా నమోదు చేయలేదు. దీంతో ఆయన సేఫ్‌గా రిటైరయ్యారు. ఇదే కేసులో తీవ్ర చర్యలు ఎదుర్కోవాల్సిన మరో మేనేజర్ డి.వెంకటరమణను మంగంపేట నుంచి చీమకుర్తికి మార్చారు. దీంతో ఆయన కూడా సేఫ్‌గా బయట పడిపోయారు.

### మళ్లీ మంగంపేటకు..

వెంకటరెడ్డి ఏపీఎండీసీ ఎండీ అయిన తర్వాత ఏరి కోరి వెంకటరమణను తిరిగి మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు చీఫ్ ఆఫీసర్ (సీపీఓ)గా పోస్టింగ్ ఇచ్చారు. అప్పట్లో ఈ చర్యపై తీవ్ర విమర్శలు వచ్చినా వెంకటరెడ్డి ఏ మాత్రం లెక్క చేయలేదు. ఆ తర్వాత మంగంపేట బెరైటీస్‌లో సీ గ్రేడ్ బెరైటీస్ స్థానంలో ఏ గ్రేడ్‌ను డంప్ చేసి అక్రమంగా కంపెనీలు తరలించడానికి సహకరించారన్న ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణ జరిగింది. దీనిపై ప్రభుత్వం స్పందించి వెంకటరమణను సస్పెండ్ చేయాలని ఆదేశించింది. వెంకటరెడ్డి ఎందుకో ఆ పని చేయలేదు. దీంతో ప్రభుత్వమే రంగంలోకి దిగి ఆయన్ను సస్పెండ్ చేసింది. నిజానికి మొదట్లోనే బెరైటీస్ అక్రమాలపై విజిలెన్స్ సిఫారసు మేరకు ఆయనపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకొని ఉంటే ఆయన రెండోసారి మంగంపేటకు వచ్చేవారు కాదు. అక్రమాలకు ఆస్కారం ఏర్పడేది కాదు. మొదటిసారి కాపాడినా, రెండోసారి సస్పెన్షన్ తప్పలేదు. ఇప్పుడు ఈ కేసును కూడా గుట్టుచప్పుడు కాకుండా మూసేందుకు గనుల ఘనుడు బంగారుకొండ ప్రయత్నిస్తున్నారు.


ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థల ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ. చిత్రంలో ఏబీఎన్ డైరెక్టర్ కె.భాను, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సిబ్బంది.

# బిహార్ విద్యార్థులు.. ఏపీలో ఓట్లు!

వైసీపీ అభ్యర్థి నడిపే కాలేజీలో ఇతర రాష్ట్రాల నర్సింగ్ విద్యార్థులు

వారికి ఎటువంటి ఆధారం లేకున్నా ఇక్కడ ఓటర్లుగా నమోదు

ఎమ్మెల్యే అనగాని లేఖ రాసినా స్పందించని ఎన్నికల అధికారులు


గుళ్ళపల్లి 231 బూత్‌లో ఇతర రాష్ట్రాల విద్యార్థుల ఓట్లు

రేపల్లె/హిరమండలం, జనవరి 26: ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు బాపట్ల జిల్లాలో ఓట్లు ఉన్న విషయం వెలుగు చూసింది. రేపల్లె నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్‌కు చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలో శృతి నర్సింగ్ కాలేజీ ఉంది. ఇక్కడ బిహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు నర్సింగ్ కోర్సు చేస్తున్నారు. వీరు స్థానికంగా నివాసం ఉంటున్నట్లు ఎలాంటి ఆధారం లేకపోయినా దాదాపు 80 ఓట్లకు పైగా తొలుత నమోదు చేశారు. వాటిని తొలగించాలని గతేడాది డిసెంబరు 14న ఆర్డీవోకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ లేఖ రాశారు. అయినా ఎన్నికల అధికారులు, బీఎల్వోలు కనీసం విచారణ చెయ్యకుండా 2-23 అనే డోర్ నంబర్‌తో సబ్ కేటగిరీగా చేసి 59 మంది విద్యార్థుల ఓట్లను అలాగే ఉంచారు. శుక్రవారం ఈ విషయం బయటపడింది. దీనిపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు దృష్టిసారించి ఇతర రాష్ట్రాల విద్యార్థుల ఓట్లు తొలగించాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం మేజర్ పంచాయతీలోని పోలింగ్ కేంద్రం నం.268లో మొత్తం 847 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా విడుదల చేసిన తుది జాబితాలో 18మంది మృతులు ఓటర్లుగా కొనసాగుతున్నారు.

# ఎన్నికల వేళ కులగణన ఎందుకు..?

## ఈ ఆలోచన మీకు ఇప్పుడే ఎందుకొచ్చింది?

▸▸ డేటా భద్రతపై శ్వేతపత్రం విడుదల చేయాలి

▸▸ జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కులగణన ఎందుకో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వానికి ఆయన కొన్ని ప్రశ్నలు సంధించారు. ఈ కులగణన ఆలోచన మీకు ఎన్నికల ముందే ఎందుకు వచ్చింది..? కులగణనకు కారణాలు వివరిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయలేదు..? రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తిగత గోప్యత, భద్రత, స్వేచ్ఛను కులగణన ద్వారా హరించడం కాదా..? కులగణనలో కోళ్లు, మేకలు, ఆవులు, గేదెల వివరాలన్నీ ఎందుకు..? బిహార్ ప్రభుత్వం చేసిన కులగణన అంశం సుప్రీం కోర్టులో ఉన్న నేపథ్యంలో ఇంకా తీర్పు ప్రకటించక ముందే ఈ ప్రక్రియ ద్వారా ప్రజాధనాన్ని ఎందుకు వృథా చేస్తున్నారు..? జనగణన నిపుణులతో నిర్వహించే ఒక సంక్లిష్ట ప్రక్రియ. మీ వలంటీర్లకు ఆ అర్హత, సామర్థ్యాలు ఉన్నాయని ఎలా నిర్ధారించారు..? సేకరించిన డేటా దుర్వినియోగం కాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటి..? ప్రభుత్వ వనరులు, యంత్రాంగాన్ని స్వీయ ప్రయోజనాలకు వాడుకోవడం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం కాదా..? అని పవన్ ప్రశ్నించారు. వలంటీర్ల ద్వారా వైసీపీ ప్రభుత్వం సేకరిస్తున్న కులగణన, ఇతర వివరాలను ఏ కంపెనీ భద్రపరుస్తుందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


జనసేన కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి, సెల్యూట్ చేస్తున్న పవన్ కల్యాణ్


ఉండవల్లిలోని తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న చంద్రబాబు



బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి


Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
# దిక్సూచి
విజయవాడ ● శనివారం 27 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

## ఫుట్‌వేర్ డిజైన్ సంస్థలో డిగ్రీ, పీజీ

**కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)'-బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ డిగ్రీలో బీ డిజైన్, బీబీఏ; మాస్టర్ డిగ్రీలో ఎం డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.**

దేశవ్యాప్తంగా నిర్వహించే ఆలిండియా సెలెక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్, చెన్నై, చింద్వారా, చండీగఢ్, అంకలేశ్వర్, నోయిడా, ఫుర్సత్‌గంజ్, గుణ, జోధ్‌పూర్, పట్నా, కోల్‌కతా, రోహతక్ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నారు. మొత్తం 2360 సీట్లు ఉన్నాయి.



### బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్)

- ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, లెదర్-లైఫ్ స్టయిల్-ప్రొడక్ట్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్ విభాగాలు ఎంచుకోవచ్చు.
- ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్ విభాగానికి సంబంధించి హైదరాబాద్, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 80 సీట్లు; మిగిలిన అన్ని క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. లెదర్-లైఫ్ స్టయిల్-ప్రొడక్ట్ డిజైన్ విభాగానికి సంబంధించి హైదరాబాద్, నోయిడా, కోల్‌కతా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఫ్యాషన్ డిజైన్ విభాగానికి సంబంధించి హైదరాబాద్, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 80 సీట్లు; గుణ మినహా అన్ని క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి.

### బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ)

- రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్ విభాగంలో ఈ ప్రోగ్రామ్ చేయవచ్చు. దీని వ్యవధి మూడేళ్లు, ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, నోయిడా, పట్నా, చండీగఢ్ క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి.

### మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎం డిజైన్)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ఫ్యాషన్ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్ స్పెషలైజేషన్‌కు సంబంధించి చెన్నై, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు; ఫ్యాషన్ డిజైన్ స్పెషలైజేషన్‌కు సంబంధించి హైదరాబాద్, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి.

### మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)

- ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, నోయిడా, పట్నా, చండీగఢ్, చింద్వారా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి.

### అర్హత వివరాలు

- బీ డిజైన్, బీబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదు సబ్జెక్టులతో నేషనల్ ఓపెన్ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు, పదోతరగతి తరవాత ఏఐసీటీఈ గుర్తింపు పొందిన మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 2024 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 25 ఏళ్లు మించకూడదు.
- ఎం డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి ఏడాది చదువుతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

### ఏఐఎస్‌టీ 2024

- ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ). ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.
- బీ డిజైన్, బీబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. అనలిటికల్ ఎబిలిటీ నుంచి 25, జనరల్ అవేర్‌నెస్ నుంచి 35, కాంప్రహెన్షన్ నుంచి 25, గ్రామర్ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒక్కోదానికి ఒక మార్కు ఉంటుంది. బిజినెస్ ఆప్టిట్యూడ్ నుంచి 25, డిజైన్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు.
- ఎం డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో మొత్తం 175 ప్రశ్నలు ఇస్తారు. అనలిటికల్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. ఇంగ్లీష్ కాంప్రహెన్షన్&గ్రామర్, జనరల్ నాలెడ్జ్&కరెంట్ అఫైర్స్, మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ & డిజైన్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.

FDDI

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 ఏప్రిల్ 20
- **ఎడిటింగ్ విండో ఓపెన్:** 2024 మే 1, 2
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **ఏఐఎస్‌టీ 2024 తేదీ:** 2024 మే 12న
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** 2024 మే 31న
- **కౌన్సెలింగ్:** జూన్ రెండు, మూడు వారాల్లో
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** 2024 జూలై 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2024 జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.fddiindia.com

రిమైండర్

## సంబల్‌పూర్ ఐఐఎంలో పీహెచ్‌డీ

**సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తి చేయాలి. స్టయిపెండ్ సౌకర్యం ఉంది. జాతీయ పరీక్ష స్కోర్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.**



**స్పెషలైజేషన్‌లు:** ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పాలసీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్.

**అర్హత వివరాలు:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ లేదా ఐఐటీలు/ఐఐఎం సంస్థల నుంచి రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఆర్క్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయి నుంచి పీజీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. పీజీ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం కోర్సులు, ఈవెనింగ్ కోర్సులు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. క్యాట్ (2021/2022/2023) లేదా జీఆర్‌ఈ/గేట్/జీమ్యాట్/జేఆర్‌ఎఫ్ (యూజీసీ/సీఎస్ఐఆర్) వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

**స్టయిపెండ్:** ట్యూషన్, కంప్యూటర్, లైబ్రరీ, మెడికల్ ఇన్సూరెన్స్, అలూమ్నీ తదితర ఫీజుల నిమిత్తం కాంప్రహెన్సివ్ ఫెలోషిప్ ఇస్తారు. దీనితోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.35,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000 చొప్పున సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇస్తారు.

- ఐఐఎం సంస్థల నుంచి రెండు/మూడేళ్ల వ్యవధి గల ఫుల్ టైం పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణులకు; ఐఐటీలు/ఢిల్లీ ఎఫ్ఎంఎస్ సంస్థల నుంచి ఎంబీఏ పూర్తిచేసినవారికి; ఎంబీఏ/పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్నవారికి పీహెచ్‌డీ మొదటి ఏడాది కోర్సు నుంచి మినహాయింపు ఇస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000+జీఎస్‌టీ
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.iimsambalpur.ac.in

### జాబ్ కార్నర్

**రా**మగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

## ఆర్ఎఫ్‌సీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

**మొత్తం ఖాళీలు: 39**

1. అటెండెంట్ గ్రేడ్-1(మెకానికల్): **15 పోస్టులు**
2. అటెండెంట్ గ్రేడ్-1(ఎలక్ట్రికల్): **15 పోస్టులు**
3. అటెండెంట్ గ్రేడ్-1(ఇన్‌స్ట్రుమెంటేషన్): **9 పోస్టులు**

**ట్రేడులు:** ఫిట్టర్, డీజిల్ మెకానిక్, మెకానిక్- హెవీ వెహికల్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్.

**అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత. ఐటీఐలో జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.

**వయోపరిమితి:** 2024 జనవరి 31 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులకు అయిదేళ్లు; దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

**బేసిక్ పే:** నెలకు రూ.21,500 - రూ.52,000

**ఎంపిక ప్రక్రియ:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్(ట్రేడ్), మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

**దరఖాస్తు రుసుము:** రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, నాగ్‌పూర్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22

**వెబ్‌సైట్:** https://www.rfcl.co.in/careers2.php

## లిటిల్స్



### బుద్ధి హీనులు

అనగనగా ఓ పిసినారి ఉండేవాడు. బాగా ధనికుడు. చిన్న విషయం కూడా పదులసార్లు ఆలోచించేవాడు. ఒక రోజు తన కొడుకును తీసుకుని ఓ సంతకు వెళ్లాడు. అక్కడ ఇద్దరికీ ఏమీ నచ్చలేదు. కొడుక్కు ఏదైనా వస్తువు నచ్చితే అది బాగలేదనేవాడు తండ్రి. ఏదైనా తండ్రికి నచ్చిన వస్తువు కనపడితే 'మనకు పనికి రాదు' అన్నాడు కొడుకు. అలా ఇద్దరూ ఏ వస్తువు కొనకుండా వెళ్తుంటే వారికి ఓ గుర్రాల సంత కనపడింది. ఆ సంతలోకి వెళ్లారు. ఆ రోజు ఎందుకో బలిష్ఠంగా ఉండే నల్లని గుర్రం వారికి నచ్చింది. సొమ్ము ఇచ్చి కొన్నారు. తాడును కూడా అమ్మిన వారితో ఇప్పించుకుని ఇంటికి బయలుదేరారు తండ్రీకొడుకులు.

ఇద్దరూ నడుస్తున్నారు. మాట్లాడుకుంటూ నడుస్తుంటే గుర్రం ఇకిలిస్తోంది. ఓ గుట్ట కనపడింది. ఇక లాభం లేదనుకుని.. ఇద్దరూ గుర్రం ఎక్కారు. ఆ గుర్రం కొంచెం వేగంగా పరిగెత్తి.. గుట్ట దగ్గర మెల్లగా నడిచింది. నీళ్లు, ఆహారం తిన్నదో లేదో అని తెలుసుకోకుండా అలానే గుర్రాన్ని ఉరికెత్తించారు. నోటిలో లాలాజలం కక్కుతూ గుర్రం కష్టంగా నడుస్తోంది. దారిలో ఉండేవాళ్లు కొంతమంది ఇలా అన్నారు.. 'చూడటానికి దున్నల్లా ఉన్నారు. నడవలేరా? పాపం గుర్రం బరువుగా నడుస్తోంది' అన్నారు. వెంటనే ఇద్దరూ కిందకు దిగారు.

అలానే ఇద్దరూ గుర్రం తీసుకుని నడుస్తూ వెళ్తున్నారు. కొద్దిసేపయ్యాక పెద్దాయన గుర్రమెక్కాడు. తన కుమారుడు నడుస్తూ వస్తున్నాడు. కొందరు ఆడవాళ్లు నీళ్లకు పోతున్నారు. పాపం.. పసివాడు నడుస్తుంటే.. ఆయన గుర్రం మీద ఊరేగుతున్నాడు అన్నారు. అది విన్న తండ్రి బాధపడ్డాడు. నేను వద్దు.. నువ్వు గుర్రం ఎక్కు అని కొడుకును ఎక్కించాడు. మరో ఊరిలోకి వెళ్తానే.. 'చూడటానికి గున్నలా ఉన్నాడు కొడుకు. పాపం ముసలాయన్ని నడిపిస్తున్నాడు. ఈ కాలం పిల్లలంతే. తండ్రి చచ్చినా పర్వాలేదు' అన్నాడు ఓ తెలిసిన చుట్టం. దీంతో వెంటనే కొడుకు కిందకు దిగాడు.

చివరగా ఇద్దరూ నడుస్తూ ఉన్నారు. ఎవరూ గుర్రం ఎక్కలేదు. ఆ ఊరి చివరకు వస్తూనే ఓ వాగు వంతెన దాటుతుండగా బలంగా గుర్రాన్ని నీళ్లలోకి తోశారు. పాపం ఆ గుర్రం నీళ్లలోంచి ఈది వెళ్లిపోయింది. ఈ బుద్ధి హీనులు ఇంటికి వచ్చి గర్వంగా కనిపించారు. అయితే తాము కొన్న గుర్రం ధరను మరిచిపోయి సంతోషించారు.


### దారి కనుక్కోండి



### 7 తేడాలను గుర్తించండి



### చుక్కలు కలిపి రంగులు వేయండి



### డైలీ సుడోకు - 214

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 7 | 5 | | | 8 | | | |
| 9 | | | | | | | | |
| | | | 4 | 5 | | | 6 | 7 |
| 4 | | 3 | | | 2 | | 1 | |
| | 8 | | | | | | 4 | |
| | 1 | | 7 | | | 3 | | 6 |
| 8 | 5 | | | 3 | 6 | | | |
| | | | | | | | | 2 |
| | | | 2 | | | 8 | 5 | 9 |

**సుడోకు - 213 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 7 | 1 | 2 | 4 | 9 | 3 | 8 | 6 |
| 2 | 4 | 3 | 5 | 8 | 6 | 7 | 1 | 9 |
| 8 | 6 | 9 | 7 | 1 | 3 | 4 | 2 | 5 |
| 1 | 5 | 4 | 6 | 7 | 2 | 9 | 3 | 8 |
| 7 | 2 | 8 | 3 | 9 | 4 | 6 | 5 | 1 |
| 9 | 3 | 6 | 8 | 5 | 1 | 2 | 4 | 7 |
| 6 | 1 | 7 | 4 | 3 | 5 | 8 | 9 | 2 |
| 3 | 9 | 2 | 1 | 6 | 8 | 5 | 7 | 4 |
| 4 | 8 | 5 | 9 | 2 | 7 | 1 | 6 | 3 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

## భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

***పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.***



**భారత ప్రభుత్వచట్టం - 1935:** దీనిని భారత రాజ్యాంగానికి మాతృకగా చెప్పవచ్చు. ఈ చట్టంలో దాదాపు 70 శాతం అంశాలను భారత రాజ్యాంగంలో చేర్చారు. ఈ చట్టంలో పది షెడ్యూల్స్, 321 అధికరణలు ఉన్నాయి.

**ముఖ్యాంశాలు**

ప్రభుత్వ పాలనా అంశాలను మూడు జాబితాలుగా విభజించారు. వాటిలో

1) కేంద్ర జాబితా - 59 పాలనా అంశాలు
2) రాష్ట్ర జాబితా - 54 పాలనా అంశాలు
3) ఉమ్మడి జాబితా - 36 పాలనా అంశాలు

- అవశిష్ట అధికారాలు గవర్నర్ జనరల్‌కు లభిస్తాయి. రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తిని కల్పించారు.
- కేంద్రంలో ద్వంద్వ పాలన విధానాన్ని ప్రవేశపెట్టారు.(రాష్ట్రాల్లో ద్వంద్వపాలన రద్దు) రాష్ట్రాల్లో ద్వి శాసనసభా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఢిల్లీలో ఫెడరల్ కోర్టును ఏర్పాటుచేశారు.
- ముంబై కేంద్రంగా ఆర్‌బిఐ(రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా) ఏర్పాటుచేశారు. అలాగే జాతీయ స్థాయిలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రస్థాయిలో ప్రొవెన్షియల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటుచేశారు.
- ఇండియా నుంచి బర్మాను వేరు చేశారు. ఎస్సీలకు, క్రిస్టియన్లకు, యురోపియన్లకు, ఆంగ్లో-ఇండియన్‌లకు, కార్మికులకు ప్రత్యేక నియోజక వర్గాలు కొనసాగించారు. మహిళలకు ఓటుహక్కును కల్పించారు.

**విమర్శ**

1. ఇది బానిసత్వానికి మరోరూపం, భారతీయులపై బలవంతంగా రుద్దారు. గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం లాంటిదని నెహ్రూ అన్నారు.
2. బయటకు ప్రజాస్వామ్య రూపం ఉన్నట్లు కనిపించినా అంతర్గతంగా అంతా శూన్యం. ఇది భారతీయులపై బలవంతంగా రుద్దిన చట్టం అని మదన్ మోహన్ మాలవ్యా పేర్కొన్నారు.
3. ఇది కచ్చితంగా చెడ్డది, పూర్తిగా పిచ్చిది, అయినా అంగీకృతమైందని మహమ్మదాలి జిన్నా పేర్కొన్నారు.
4. ఈ చట్టంతో వైస్రాయ్‌కి ముస్సోలినీ, హిట్లర్‌ను తలపించే నియంత్రణ అధికారాలను కల్పించారు. ఇది పొట్టి మనుషులు కట్టిన అపురూప కట్టడమని విన్‌స్టన్ చర్చిల్ అన్నారు.
5. మన దేశంలో నూతన బానిసత్వానికి నాంది వంటిది అని నెహ్రూ ఉద్ఘాటించారు.
6. భారత ప్రజలపై బ్రిటిష్ ప్రభుత్వం బలవంతంగా రుద్దిన చట్టమని కె.టి.షా చెప్పారు.

**ఆగస్టు ప్రతిపాదన-1940:** అప్పటి వైస్రాయ్ లిన్‌లిత్ గో 1940 ఆగస్టున కొన్ని ప్రతిపాదనలు చేశారు. వాటిలోని ముఖ్యాంశాలు.

- రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఇండియాకి అధినివేశ ప్రతిపత్తి కల్పిస్తారు.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు రూపొందించారు.
- ఈ కమిటీ సూచనల మేరకు రాజ్యాంగ నిర్మాణ సభ ఏర్పడింది.

**క్రిప్స్ రాయబారం - 1942:** రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సైన్యాల తరఫున భారత సైన్యాలు పాల్గొనాలి. దానికిగానూ

1. రాజ్యాంగ నిర్మాణసభను ఏర్పాటు చేస్తారు.
2. స్వయం ప్రతిపత్తితో కూడిన పాలనా వ్యవస్థను ఇస్తారు.

- ఈ ప్రతిపాదనలను కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తిరస్కరించింది.
- క్రిప్సు రాయబారాన్ని దివాలా తీసిన బ్యాంకు చెక్కు మీద ముందు తేదీ వేసి ఇచ్చినదిగా గాంధీ అభివర్ణించారు.
- క్రిప్సు రాయబారాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ బొంబై సమావేశంలో క్విట్ఇండియా తీర్మానాన్ని చేసింది.

**క్విట్ ఇండియా ఉద్యమం-1942:** బ్రిటిష్ వారు ఇండియాను వదిలివెళ్లాలని డిమాండ్ చేసింది. ఈ ఉద్యమకాలంలో ఇచ్చిన నినాదాలు..

1. డూ (లేదా) డై (విజయమో వీర స్వర్గమో) - గాంధీ
2. క్విట్ ఇండియా - భారత జాతీయ కాంగ్రెస్
3. డివైడ్ - క్విట్ (విభజించండి - వెళ్లిపోండి) - ముస్లిం లీగ్
4. స్ట్రెంథ్ అవర్ ఫోర్స్ అండ్ క్విట్ (మా బలాన్ని పెంచండి, వెళ్లిపోండి)- స్వదేశీ సంస్థానాలు.

**సి.ఆర్.ఫార్ములా - 1944:** కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య ఐక్యత సాధించడం ద్వారా స్వాతంత్ర్య సిద్ధిని పొందవచ్చుననే ఉద్దేశంతో రాజగోపాలచారి ఈ పథకాన్ని రూపొందించారు.

- స్వాతంత్ర్యానంతరం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్ ఏర్పాటు.
- మైనారిటీ ప్రజాభిప్రాయం ద్వారా పాకిస్థాన్ నిర్ణయం జరుగుతుంది.
- దీనిని కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు రెండూ విమర్శించాయి.
- రెండో ప్రపంచయుద్ధం అనంతరం బ్రిటన్‌లో జరిగిన ఎన్నికల్లో లేబర్‌పార్టీ నాయకుడైన క్లెమెంట్ అట్లీ బ్రిటిష్ ప్రధాని అయ్యారు. ఈయన బ్రిటన్ పార్లమెంటులో ఇండియాకు స్వాతంత్ర్యం ఇవ్వబోతున్నామని ప్రకటన చేశారు. అట్లీ మంత్రివర్గంలోని ముగ్గురు సభ్యులను భారతదేశానికి పంపించారు. దీనినే మంత్రి త్రయ రాయబారం అంటారు.

**వేవెల్ ప్రణాళిక-1945:** నాటి గవర్నర్ జనరల్ దీనిని రూపొందించారు. దేశ సార్వభౌమాధికారం, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, రక్షణ వంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలపై బ్రిటిష్ ప్రభుత్వానికి అధికారం కల్పించి మిగిలిన అంశాలను భారతీయులకు అధికారం ఇవ్వడం. ఇండియాలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక యుద్ధ సలహా మండలిని ఏర్పాటు చేయడం. వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరిస్తుంది.

**సిమ్లా సమావేశం-1945:** కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య సయోధ్యను భూలాభాయ్ దేశాయ్, లియాఖత్ అలీఖాన్ మధ్య సామరస్యం కుదర్చడం దీని లక్ష్యం.

- పాకిస్థాన్ ప్రస్తావన లేదని ముస్లింలీగ్, స్వాతంత్ర్యంపై నిర్మాణాత్మక ప్రతిపాదన లేదని కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించాయి.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

# ఐఫోన్‌కు అనువైన అయిదు యాప్స్



**స్మార్ట్ ఫోన్... స్మార్ట్ వర్క్ ఇప్పటి ట్రెండ్. పెరుగుతున్న సాంకేతికత పనిభారాన్ని తగ్గిస్తే మంచిదే కదా...! అలా అనుకున్నప్పుడు ప్రత్యేకించి ఈ యాప్‌లు ఐఫోన్‌లో ఉంటే పని ఏదైనా సులువుగా పూర్తవుతుందని నిపుణులు చెబుతున్నారు. నోట్స్ తీసుకోవడం నుంచి కంటెంట్ క్రియేషన్, డ్రాఫ్టింగ్ ఈ మెయిల్స్, ఫొటోల ఎడిటింగ్ వరకు అన్నింటికీ అనువైన ఈ యాప్‌లు ఏమిటో చూద్దాం.**




**పెప్లెక్సిటీ:** వెబ్ ఇండెక్స్‌లను ఇది ఏఐ మోడల్స్‌తో ఇంటిగ్రేట్ చేస్తుంది. సంప్రదాయ సెర్చ్ ఇంజన్ల మాదిరిగా కాకుండా చాట్‌బోట్‌కు అవకాశం ఉంది. దాంతో నేచురల్ లాంగ్వేజ్‌లో ప్రశ్నలు అడిగి, సమాధానాలను రాబట్టుకోవచ్చు. దీనికోసం ఓపెన్ ఏఐకి చెందిన జీపీటీ-3.5 సహకారం ఉంది. కచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తుంది. ఫలితంగా ప్రశ్నకు తగ్గ సమాధానాలను రాబట్టుకునే అస్కారం ఉంటుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్‌కు భిన్నంగా ఉంటుంది. లింకులను డిస్‌ప్లే చేయదు. పోటీ ప్రపంచంలో యూనిక్ సమాధానం ఇచ్చే యత్నం చేస్తుంది.

**చాట్‌సోనిక్:** ఇదో సంభాషణలకు అవకాశం ఇచ్చే ఏఐ చాట్‌బోట్. చాట్ జీపీటీకి ఉన్న పరిమితులను ఇది అవకాశంగా మలుచుకుంది. లేటెస్ట్ డేటా ఆప్షన్. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషీన్ లెర్నింగ్, జీపీటీ-4, స్టేబుల్ డిఫ్యూజన్ వంటివన్నీ ఉపయోగించుకుంటుంది. టైప్ ఆఫ్ పర్సనాలిటీ, ఎనేబుల్ మెమెరీ వంటివి కూడా ఎంపిక చేసుకోవచ్చు. మొత్తమ్మీద రియల్ పర్సన్ సమాధానం ఇస్తున్న ఫీలింగ్‌ను కలిగిస్తుంది.

**ఒట్టర్:** ఏఐ పవర్డ్ వాయిస్ టు టెక్ట్స్ ట్రాన్స్‌క్రిప్షన్ టూల్ ఇది. మాట్లాడే పదాలను టెక్ట్స్‌కు అనువర్తించడం ద్వారా చదువుకోవచ్చు, సులువుగా అర్థం చేసుకోవచ్చు. ఏఐ అల్గోరిథమ్ సహాయంతో ఇది టెక్ట్స్‌ని జనరేట్ చేస్తుంది. ఈ యాప్‌ని పలువిధాలుగా అంటే మొబైల్ యాప్ వెర్షన్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు. సమావేశాలను రికార్డ్ చేసుకోవచ్చు. ఆడియో, వీడియో రూపంలో అప్‌లోడ్ చేస్తే మాటలు ట్రాన్స్‌క్రైబ్ అవుతాయి. ఒట్టర్ బాట్ ఉపయోగించి ఆడియో రికార్డింగ్, నోట్స్ రాసుకోవడం, యాక్షన్ ఐటెమ్స్ పట్టుకోవడం, సమ్మరీలను జనరేట్ చేయడం వరకు అన్నింటికి ఉపయోగకరంగా ఉంటుంది.

**రెమిని:** ఏఐ ఫీచర్లను గత ఏడాది జతచేసిన తరవాత ఈ యాప్ ట్రాక్‌లోకి వచ్చింది. ఇదో ఫొటో ఎడిటింగ్ యాప్. దీన్లోని జనరేటివ్ ఏఐ ఫీచర్‌తో ఫొటోలకు ప్రొఫెషనల్ లుకింగ్ తీసుకురావచ్చు. ముఖ్యంగా సీవీ, పోర్ట్ ఫోలియోలు, లింక్డిన్ కోసం ఇది బాగా ఉపయోగపడుతుంది. సెల్ఫీని అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. మిగిలిన పనంతా యాప్ చూసుకుంటుంది. పాతవి, బ్లర్‌గా ఉన్నవి, స్క్రాచ్ ఫొటోలను కూడా మార్చగలదు. ఫొటోలను హెచ్‌డీలోకి మారుస్తుంది. మొత్తమ్మీద షేర్ చేసుకునేందుకు వీలుగా రూపొందిస్తుంది.

**చాట్‌జీపీటీ:** దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీ ఉండదు. ఇప్పటికే జనాదరణ పొందింది. ఇందులో ఏ ప్రశ్న అడిగినా జవాబు వస్తుంది. ఐఫోన్లలో ఏఐ ఆధారిత చాట్‌బోట్ ఉంటుంది. చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐకి చెందిన స్పీచ్ రికగ్నిషన్ సిస్టమ్‌తో వాయిస్ ఇన్‌పుట్‌కు సపోర్ట్ అందిస్తుంది. జీపీటీ-4తో అడ్వాన్స్‌డ్ ఫీచర్ల యాక్సెస్ కూడా ఉంటుంది.

## గేమింగ్ యాప్‌లతో అలెర్ట్ ప్లీజ్

గేమింగ్ యాప్స్‌తో జరుగుతున్న మోసాలను గమనించిన కేంద్ర హోంమంత్రిత్వశాఖ దేశంలోని పౌరులకు అలెర్ట్ జారీ చేసింది. డివైజుల్లోని గేమింగ్ యాప్స్‌లో ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. మినిస్ట్రీ సైబర్ వింగ్ 'ద ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రత్యేకించి 'ప్లే స్మార్ట్, ప్లే సేఫ్ - స్టే సెక్యూర్ వైల్ గేమింగ్ ఆన్‌లైన్' అంటూ కాషన్ మెసేజ్‌ని జారీచేసింది. అదే సందర్భంలో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లను అథెంటిక్ సోర్సులు అంటే గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. గేమ్ యాప్ పబ్లిషర్‌ని ఎప్పటికీ చెక్ చేసుకుంటూ ఉండాలి. వెబ్‌సైట్ లెజిటమసీ(చట్టబద్ధత)ను కూడా చెక్ చేసుకోవాలి. సబ్‌స్క్రిప్షన్ విషయంలో డిస్కౌంట్స్ తదితరాలంటూ ఇచ్చే ఆఫర్ల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. అదే సమయంలో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసుకోరాదు. ప్లేయర్లను మోసపుచ్చే యత్నాలను స్కామర్లు చేస్తూనే ఉంటారు. వీరి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. అవసరమైనంత వరకే అనుమతులు ఇవ్వాలి. మోసం జరిగినట్టు భావిస్తే, వెంటనే 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలి అని ఆ సూచనలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ 15 నాటికి 581 గేమింగ్ యాప్‌లను ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఇంతకుమునుపే కొన్ని చట్టాలను చేయడమే కాకుండా, పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగు చర్యలను సైతం కేంద్ర హోం మంత్రిత్వశాఖ తీసుకుంటున్న విషయం విదితమే.

## రిటైల్ ఫుడ్ వేస్టేజీని అరికట్టే 'టూ గుడ్ టు గో' యాప్

వినూత్నం



అటు వినియోగదారులకు చౌకగా అలాగే ఎక్స్‌పైరింగ్ ఐటెమ్స్‌ను సూపర్ మార్కెట్లు తొందరగా అమ్ముకునేందుకు వీలుగా అంటే ఉభయుల ప్రయోజనార్థం ఒక యాప్ వచ్చింది. అదే 'టూ గుడ్ టు గో యాప్'. రిటైల్ ఫుడ్ వేస్టేజీని సైతం దీంతో అరికట్టవచ్చు. ఎనిమిదేళ్ళ క్రితం ఆరంభమైన డానిష్ కంపెనీ ఒకటి ఈ యాప్‌ను తీసుకువచ్చింది. ఎక్స్‌పైరీ డేట్ దగ్గరలో ఉన్న వాటిని వినియోగదారులకు తెలియజేసేందుకు ఉద్దేశించిన ఏఐ ఆధారిత సొల్యూషన్ ఇది. సూపర్ మార్కెట్లకు సహాయపడేందుకు దీన్ని అభివృద్ధిపర్చారు. షార్ట్ కట్‌లో ఈ యాప్ పేరు టీజీటీజీ. ఇంటర్నేషనల్ సూపర్ మార్కెట్ చైన్ స్పార్(ఎస్‌పీఏఆర్)తో దీన్ని ఉనికిలోకి తీసుకు వస్తున్నారు. ఎక్స్‌పైరీ డేట్ అయిపోతున్న వస్తువుల గుర్తింపు, అవసరం ఉన్న వారికి సమాచారం చేరవేత, డిస్కౌంట్ పెంపు వంటి అంశాలను ఏఐతో ఇందులో పరిష్కరిస్తారు. 30 శాతం మేర ఆహార పదార్థాలు వృథా అవుతున్నాయన్నది ఐరాస అంచనా. ఆ వృథా ఎనిమిది నుంచి పది శాతం మేర గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎమిషన్స్‌కు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ఒక సొల్యూషన్‌గా ఈ యాప్‌ను టీజీటీజీ అభివృద్ధిపర్చింది.

## 20 దేశీ భాషలకు ట్రాన్స్‌లేటర్ సపోర్ట్




మైక్రోసాఫ్ట్ ట్రాన్స్‌లేటర్ సపోర్ట్ తాజాగా మరో రెండు భారతీయ భాషలకు అందింది. చత్తీస్‌గఢి, మణిపురి భాషలకు లభించింది. ఈ రెంటితో కలిపి మొత్తం ఇరవై భారతీయ భాషలకు మైక్రోసాఫ్ట్ ట్రాన్స్‌లేటర్ సపోర్ట్ అందించినట్లయింది. తెలుగు, తమిళం సహా 18 భాషలకు ఇంతకుమునుపు నుంచే ఈ సదుపాయం ఉంది. దీంతో దేశంలో 95 శాతం ప్రజానీకానికి ట్రాన్స్‌లేటర్ వెసులుబాటు లభించింది. భారతీయ భాషలకు సంబంధించి తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఈ సందర్భంలో మైక్రోసాఫ్ట్ పేర్కొంది. అజ్యూర్ ఏఐ ట్రాన్స్‌లేటర్ కేవలం కంప్యూటింగ్ అందుబాటుకే పరిమితం కాదని, మంచి విద్య, గవర్నెన్స్, కమ్యూనికేషన్, ఆర్థిక అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించింది.



## మైక్రోసాఫ్ట్ టీమ్స్ సులువుగా కంట్రోల్

**మైక్రోసాఫ్ట్ ప్రత్యేకించి మైక్రోసాఫ్ట్ టీమ్స్‌పై వెబ్‌కామ్, ఆడియో కంట్రోల్‌ని యూజర్లు ఇకపై సులువుగా, సమర్థంగా ఉపయోగించుకునే వీలు కల్పించింది. ఈ విషయమై అప్డేట్‌ను మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్ పోస్ట్‌లో ప్రకటించింది. తాజా అప్డేట్‌తో ఇకపై సమావేశాల్లో ఆడియో, వీడియో సెట్టింగ్‌లను సింగిల్ టచ్‌తో మేనేజ్ చేయవచ్చు. అందుకోసం...**

- క్విక్ సెట్టింగ్స్ యాక్సెస్ కోసం డౌన్‌లోడ్ యారోని క్లిక్ చేయాలి. లేదా సమావేశం జరుగుతున్నప్పుడు మీటింగ్ టూల్ బార్‌పై ఉన్న మిక్ బటన్‌ను క్లిక్ చేయాలి.
- మోర్ వీడియో ఆప్షన్ లింక్ లేదా మోర్ ఆడియో ఆప్షన్ లింక్‌ని క్లిక్ చేయాలి.
- మీటింగ్ టూల్‌బార్‌పై మోర్ యాక్షన్స్ బటన్‌ని క్లిక్ చేయడం ద్వారా యాక్సెస్ పొందవచ్చు.
- తదుపరి ఆడియో సెట్టింగ్ లేదంటే వీడియో ఎఫెక్ట్స్ అండ్ సెట్టింగ్స్‌ను ఎంపిక చేసుకోవాలి.

టీమ్స్ పబ్లిక్ ప్రెవ్యూ లేదా మైక్రోసాఫ్ట్ 365 టార్గెటెడ్ రిలీజ్ మెంబర్ అయి ఉంటేనే ఈ యాక్సెస్ లభిస్తుంది. విండోస్ లేదంటే మేక్‌ఓఎస్‌లో క్విక్ సెట్టింగ్స్ ఉపయోగించుకునేందుకు న్యూటీమ్ క్లయింట్ అప్డేట్ కాగలుగుతారు. మైక్రోసాఫ్ట్ టీమ్స్ అన్నింటికీ రాబోయే రోజుల్లో ఈ వెసులుబాటు రానుంది.

## వాట్సాప్ నుంచి ఫైల్ షేరింగ్ ఫీచర్!



వాట్సాప్ త్వరలో ఫైల్ షేరింగ్ ఫీచర్‌ను పరిచయం చేయనుంది. ఐఫోన్‌లోని ఎయిర్‌డ్రాప్ మాదిరిగా ఇది పని చేయనుంది. గూగుల్ ప్లే స్టోర్‌లో దీన్ని బీటా టెస్టర్లు చూశారని డబ్ల్యుఎబీటాఇన్ఫో వెల్లడించింది. ఈ ఫీచర్‌తో చాలా స్వల్ప వ్యవధిలో ఫైల్స్‌ను వాట్సాప్ యూజర్లు షేర్ చేసుకోగలుగుతారు. ఇది కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ ఫీచర్‌గానే ఉంటుందని భావిస్తున్నారు. యూజర్ డేటా గుట్టు వెల్లడికాదు. వాట్సాప్‌నకు కూడా యాక్సెస్‌లో ఉండబోదు. అలా యూజర్ ఫైల్ భద్రత విషయంలో రాజీ ఉండదు. అదే సమయంలో చాలా వేగంగా ఫైల్ షేరింగ్‌కూ వీలుచిక్కుతుంది. ఇప్పటి వరకుకు షేరింగ్‌కు సంబంధించి హయ్యర్ స్టోరేజీ ఫైల్స్, ఇమేజ్ అలాగే వీడియో క్వాలిటీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కొత్త ఫీచర్‌తో వాటిని అధిగమించవచ్చు. వివిధ నివేదికల ప్రకారం కొత్త విధానంలో 'షేర్ ఫైల్స్ విత్ నియర్‌బై పీపుల్' ఆప్షన్‌ను ఓపెన్ చేసి ఫైల్స్ అందుకోవడం లేదా పంపుకోవడం చేయాలి. అలాగే ఉపయోగించడానికి ముందు డివైజ్‌ను అటూ ఇటూ కదపాల్సి ఉంటుంది. అయితే ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుందనే విషయమై అధికారిక వివరణ ఏదీ లేదు. ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని సమాచారం కూడా.

## డేటా ట్రాకింగ్‌ను బ్లాక్ చేస్తున్న గూగుల్




గూగుల్ పెద్ద ఎత్తున కుకీస్‌ను బ్లాక్ చేస్తోంది. చాలా ఫీచర్లను విడుదల చేయడానికి ముందు ఈ పనిచేస్తోంది. ముప్పయ్‌మిలియన్ల క్రోమ్ యూజర్ల కుకీల పనిపడుతోంది. తద్వారా తన యూజర్లకు సంబంధించిన డేటా ట్రాకింగ్‌ను బ్లాక్ చేస్తోంది. ఇంతా చేస్తే ఇలా బ్లాకింగ్ అయింది గూగుల్ క్రోమ్ యూజర్లలో ఒక శాతానికే పరిమితం. అలాగే ఈ పని కొత్త కూడా కాదు. యాపిల్, మొజిల్లా ఇప్పటికే ఇలాంటి కుకీ-కిల్లర్ ఫీచర్లను జతచేసింది. ఒకరకంగా ఇది ప్రైవసీని పెంచే చర్యలు మొదటిది. వాస్తవానికి ఈ కుకీస్‌తో వివిధ వెబ్‌సైట్స్ యూజర్ ట్రెండ్‌ని తెలుసుకోగలుగుతాయి. అలా వారికి అవసరమైన అన్ని రకాల ప్రకటనలను అందుబాటులో ఉంచుతాయి. అదే సమయంలో యూజర్ లోకేషన్ కూడా ట్రాక్ చేసే వీలుంటుంది. కొత్త ఫీచర్ ఎలా పనిచేస్తుందంటే, 'బ్రౌజ్ విత్ మోర్ ప్రైవసీ' అవసరమా అని గూగుల్ అడుగుతుంది. రెస్పాండ్ అయిన యూజర్ల నుంచి 'పార్టిసిపెంట్స్ ఫర్ ట్రాకింగ్ ప్రొటెక్షన్' కోసం ర్యాండమ్‌గా సెలెక్ట్ చేస్తుంది. ఎంపికైతే యూజర్‌ని నోటిఫై చేస్తుంది. యూజర్ కూడా కన్‌ఫర్మ్ చేయాల్సి ఉంటుంది. అప్పుడు ప్రైవసీ అండ్ సెక్యూరిటీ సెక్షన్‌లో కుకీలకు మల్టిపుల్ టోగెల్స్ కనిపిస్తాయి. టర్నింగ్ దెమ్ ఆన్ గుర్తు లేకుంటే గూగుల్ ట్రాకింగ్ పొటెక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేసిందని తెలుసుకోవాలి. వ్యాపార సముదాయాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్టు గూగుల్ ఇప్పటికే బ్లాగ్‌లో తెలిపింది.

## టీన్స్ సేఫ్టీకి మెటా చర్యలు

మెటా తన పరిధిలోని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఉపయోగించే యువత(టీన్స్) సేఫ్టీకి సంబంధించి పలు చర్యలనుతీసుకుంటోంది. అందులో భాగంగా డైరెక్ట్ మెసేజ్ సెట్టింగ్స్‌ను డిఫాల్ట్‌గా కట్టుదిట్టం చేస్తోంది. ప్రధానంగా అమెరికా, బ్రిటన్ తదితరాల్లో దేశాన్ని అనుసరించి 18 నుంచి 16 ఏళ్ళ లోపు పిల్లలకు కాంటాక్ట్ లేదా గ్రూపులో ఉన్న వ్యక్తుల నుంచి మాత్రమే డైరెక్ట్ మెసేజ్‌లు అందుతాయి. అంటే తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లు వారికి చేరవు. గత ఏడాది మార్చిలోనే సూపర్విజన్ టూల్స్‌ని ఇన్‌స్టాగ్రామ్ జోడించింది. సక్రమంగా లేని ఇమేజ్‌లను టీన్స్ చూడకుండా ఉండేలా కూడా చర్యలను ఈ ఏడాది మొదట్లో ఆరంభించింది. రెండురోజుల నుంచే అపరిచితుల నుంచి మెసేజ్‌లు టీన్స్‌కు అందకుండా ఇన్‌స్టాగ్రామ్ కట్టడి చేసింది. ఇందుకోసం 'పేరెంటల్ సూపర్విజన్ టూల్స్ ద్వారా అప్రూవల్ తప్పనిసరి. ఈ ఫీచర్ విషయంలో మరిన్ని విషయాలను త్వరలో తెలియజేస్తామని మెటా ఈ సందర్భంలో తెలియజేసింది. అలాగే పొగాకు ఉత్పత్తులు, ఆయుధాలు, ఆల్కహాల్, కాంట్రాసెప్షన్, కాస్మోటిక్ ప్రొజీజరర్స్, వెయిట్ లాస్ ప్రోగ్రామ్స్ పై కూడా ఇన్‌స్టాగ్రామ్ ఆంక్షలు విధించింది. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో వీటన్నింటి అమలుకు శ్రీకారం చుట్టింది.

## క్రోమ్ బ్రౌజర్‌కు ఎఐ పవర్డ్ ఫీచర్లు

***క్రోమ్‌కు మూడు జనరేటెడ్ ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఫీచర్లను అందుబాటులోకి వస్తున్నాయి. వి121 అప్డేట్‌తో రాబోయే రోజుల్లో అందిస్తోంది. మేక్, విండోస్ పీసీలకు క్రోమ్‌తో అందనున్నాయి. సర్కిల్ టు సెర్చ్ సహా పలు ఏఐ జనరేటెడ్ ఫీచరల్లను క్రోమ్‌కు గత వారం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. తాజా అప్డేట్ విషయానికి వస్తే.***

- మొదటిది ట్యాబ్ ఆర్గనైజర్. దీంతో క్రోమ్ ఆటోమేటిక్‌గా టాబ్ గ్రూపులను సజస్ట్, క్రియేట్ చేస్తుంది. బ్రౌజర్‌లో ఓపెన్ అయ్యే అన్ని ట్యాబల ఆధారంగానే ఈ ప్రక్రియ ఉంటుంది. ఒకేసారి పలు టాస్కులను చక్కబెట్టే వ్యక్తులకు ఇది బాగా ఉపయోగపడతుంది. ట్రిప్ ప్లానింగ్, టాపిక్‌పై రీసెర్చ్, షాపింగ్ వంటివి ఒకేసారి చేసుకోవచ్చు. ఇందులో భాగంగానే చేసే పనికి పేరు, ఎమోజీని సూచిస్తుంది. ఫలితంగా మరోసారి అవే కావాలని అనుకున్నప్పుడు వాటని పట్టుకోవడం యూజర్‌కు తేలికగా ఉంటుంది.
- రెండోది పిక్సెల్ 8 సిరీస్‌లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. టెక్ట్స్ టు ఇమేజ్ డిఫ్యూజన్ మోడల్ ఇది. కస్టమ్ వాల్ పేపర్‌ను క్రియేట్ చేసుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది. చాలా వేగంగా కస్టమ్ థీమ్స్‌ను జనరేట్ చేసుకోవచ్చు. సబ్జెక్టు, మూడ్, విజువల్ స్టయిల్, కలర్‌ని టైప్ చేస్తే సరిపోతుంది. ఈ విషయంలో బెస్ట్ రిజల్టును గూగుల్ క్రోమ్ అందిస్తుంది.
- మూడోది జనరేటివ్ ఏఐ. అత్యున్నతంగా తీర్చిదిద్దిన మెసేజ్ రూపకల్పనకు ఇది తోడ్పడుతుంది. అలాగే హోటల్ లేదంటే ఒక టూరిస్టు ప్లేస్‌పై రెవ్యూ రాయడంలో సహకరిస్తుంది. వ్యాకరణ దోషాలు, చిన్నపాటి తప్పులు కూడా లేకుండా అంటే ఎర్రర్ ఫ్రీగా రాసుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇందుకోసం మొదట టెక్ట్స్ బాక్స్‌పై కుడివైపు క్లిక్ చేయాలి. విజిట్ చేసిన ప్రాంతంపై కూడా అదీ క్రోమ్‌పై క్లిక్ చేయవచ్చు. అక్కడ 'హెల్ప్ మి రైట్'ని సెలెక్ట్ చేసుకోవాలి. కొన్ని పదాలను టైప్ చేయడం మొదాలుపెట్టగానే ఎఐ తోడై తన పని చేసుకుంటుంది. మొత్తమ్మీద ఆర్టికల్ చాలా బాగా వచ్చేందుకు ఈ ఫీచర్ సహయకారిగా ఉంటుంది.

## బెస్ట్ పవర్ బ్యాంక్స్

**ఒంటరిగా ఒక్క అడుగు వేయలేని రోజులు. అనుక్షణం కనెక్ట్ అయి ఉండాల్సిందే. ప్రతి నిమిషం అమృతమే. ఈ నేపథ్యంలో డిజిటల్ కనెక్టివిటీకి ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. అది సక్రమంగా ఉండాలంటే పవర్ బ్యాకింగ్ కూడా చాలా అవసరమే. ఎక్కడ, ఏ పరిస్థితుల్లో ఉన్న మన డివైజ్‌ని బ్యాటరీకి అనుసంధానం చేసి సేఫ్ ప్లేస్‌లో ఉండొచ్చు. ఈ పరిస్థితుల్లో బెస్ట్ పవర్ బ్యాంక్స్ ఏవంటే...**



**షావోమీ ఎంఐ పవర్ బ్యాంక్ 3ఐ(20000ఎంఏహెచ్):** దీన్లో 20000ఎంఏహెచ్ లిథియం పాలిమర్ బ్యాటరీ, 18 వాట్స్ ఫాస్ట్ పవర్ డెలివరీ చార్జింగ్ కేపబిలిటీతో ఉంది. ట్రిపుల్ పోర్ట్ ఔట్‌పుట్, డ్యూయల్ ఇన్‌పుట్ పోర్ట్స్(మైక్రో - యూఎస్‌బీ/ యూఎస్‌బీ-సి) సౌకర్యం ఉంది. దీంతో వేర్వేరు డివైజ్‌లతో చార్జింగ్‌కు వీలవుతుంది. చార్జింగ్ సమయం సాపేక్షంగా 6.9 గంటలు కాగా యూజర్లకు మూవింగ్‌లో సౌలభ్యంగా ఉంటుంది. అడ్వాన్స్‌డ్ 12-లేయర్ చిప్ ప్రొటెక్షన్, స్మార్ట్ పవర్ మేనేజ్‌మెంట్‌తో బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచుతాయి. అలాగే ఈ బ్యాటరీకి షావోమీ ఆరు నెలల గ్యారంటీ కూడా ఇచ్చింది.

**షావోమీ ఎంఐ పవర్ బ్యాంక్ (10000ఎంఏహెచ్):** ఇది లిథియం ఐయాన్, లిథియం పాలిమర్ బ్యాటరీ ఇది. 22.5 వాట్స్ అల్ట్రా - ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం ఉంది. సూపర్ లైట్ వెయిట్, పాకెట్ సైజ్‌లో ఉన్నందున పోర్టబిలిటీ సులువుగా. పవర్ డెలివరీ 3.0. వేగంగా చార్జింగ్‌కు ఇది ఉపయోగపడుతుంది. చార్జింగ్ సమయం ఆరు గంటలు. కెపాసిటీ, సైజ్ మధ్య సమతూకం ఉంటుంది.

**స్పైజెన్ 20000ఎంఏహెచ్ పవర్ బ్యాంక్:** ఇది కూడా 20000ఎంఏహెచ్ పవర్ బ్యాంక్‌తో వచ్చింది. 30 వాట్స్ చార్జింగ్ సామర్థ్యం దీనికి ఉంది. కెపాసిటీ విషయానికి వస్తే, ఐఫోన్ అయిదు రెట్లు అనుకుంటే గెలాక్సీ ఎస్23 మూడు రెట్లు. రెండు యూఎస్‌బి-సి పోర్టులతో 30 వాట్స్, యూఎస్‌బీ-ఎ తో 22.5 వాట్స్ డెలివర్ అవుతుంది. ఈ బ్యాటరీ పదకొండు సేఫ్టీ టెస్టుల్లో పాసైంది.

**అర్బన్ నానో పవర్ బ్యాంక్(10000ఎంఏహెచ్):** దీని ఫాస్ట్ చార్జింగ్ సామర్థ్యం 22.5 వాట్స్. కెపాసిటీ, సైజ్ మధ్య సమతూకం ఉంది. ఇండియాలోనే దీని డిజైన్, ఉత్పత్తి జరిగాయి. దీని బరువు 178 గ్రాములు. 3000ఎంఏహెచ్ బ్యాటరీ 2.4 రెట్లు, 4000ఎంఏహెచ్ బ్యాటరీ 1.8 రెట్లు చార్జ్ అవుతుంది. డ్యూయల్ ఇన్‌పుట్ పోర్ట్స్ సపోర్ట్‌తో చార్జింగ్ వేగంగా ఉంటుంది.

**అంబ్రేన్ మనీ పవర్ బ్యాంక్(20000ఎంఏహెచ్):** లిథియం పాలిమర్ బ్యాటరీ ఇది. 22.5 వాట్స్ ఔట్‌పుట్‌కుతోడు దీని పవర్ డెలివరీ టెక్నాలజీ కారణంగా చార్జింగ్ వేగంగా జరుగుతుంది. ఒకేసారి మూడు డివైజ్‌లకు చార్జింగ్‌కు వీలవుతుంది. మాన్యుఫాక్చరింగ్ డిఫెక్ట్స్‌కు మూడు నెలల వారెంటీ కూడా ఉంది.

